పెద్ద కథ:

# ఈ దీపం ఆరిపోదు

## విన్నకోట సుశీలాదేవి

కళ్లు తెరిచాను.

కిటికీలో నుంచి ఎఱ్ఱటి ఎండ మీద పడుతోంది. 'అమ్మయ్య! నేను బ్రతికే ఉన్నానన్నమాట.' హాయిగా నిట్టూర్చాను.

రోజూ రాత్రి పడుకోబోయే ముందు అనుకుంటాను — 'నాకు ఈ రాత్రి తెల్ల వారుతుందా? మళ్ళీ ఉషోదయంలో మేల్కొని మంచు తెరల్ని చీల్చుకొస్తున్న సూర్యుడినీ, నా కిటికీ ప్రక్కనే బద్ధకంగా రేకులు విప్పుకునే చిట్టిమందారాల్ని చూడ గలనా' — అని.

యధావిధిగా తెల్లవారుతుంది. సూర్యుడు లేవక ముందే లేస్తాను. వెలుగు రేకలు ఒక్కొక్కటి విచ్చుకుంటుంటే చీకటి పారిపోతూ ఉంటుంది. ఎఱ్ఱటిబింబంలోనుండి వెలువడే ప్రతి కిరణం ప్రకృతి లోని ప్రతి వస్తువుని తళతళలాడిస్తుంది. నిద్ర పోతున్న చేతనాచేతనాలను తట్టి లేపుతుంది.

ఆ ఉషోదయాన్ని చూస్తూ—

ఆ చల్లటి గాలిని అనుభవిస్తూ —

ఆ ప్రకృతిలో నేనూ ఒక భాగమై పులకరించడం పరవశించడం ప్రతిరోజూ నా అలవాటు.

కాని, ఈ రోజు వీటికి విరుద్ధంగా జరిగింది. నేను లేచేసరికి, ఎఱ్ఱటి ఎండ కిటికీలో నుంచి మీద పడుతోంది.

అంటే దాదాపు ఏడయి ఉంటుంది. ఇవ్వాళ ఎందుకింత మొద్దు నిద్దరపోయాను! రాత్రి తొందర గానే పడుకున్నానే, ఆలోచిస్తూంటే హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది.

అవును, నాకు అర్ధరాత్రి ఒంటిగంటకి మెలకువ వచ్చింది. మళ్లీ మూడింటివరకూ నిద్ర పట్టలేదు.

అబ్బ! ఎంత భయంకరమైన కల. తలుచు కుంటే ఇప్పటికీ భయమేస్తోంది.

వారూ, సరోజా కలిసి పాలలో విషం కలిపారు. నాచేత బలవంతంగా తాగిస్తున్నారు. నేను ఏడు స్తున్నాను. అవును! హృదయం బ్రద్దలయేలా యేడుస్తున్నాను.

"నన్ను చంపొద్దండీ, నాకు బ్రతకాలని ఉందండీ. మీరు సరోజనే చేసుకోండి. నేనేమీ అననండి. నన్ను మాత్రం చంపొద్దండీ—"

కాని, వారు నా చేతులు విరిచి కట్టారు. బల వంతంగా నా నోరు తెరిచారు. సరోజ గ్లాసుని నా నోటిలోకి వంపుతోంది. నేనేడుస్తోంటే పగల బడి నవ్వుతోంది. నేను గింజుకుంటున్నాను. వారు నా మెడ వెనక్కి విరిచి పట్టుకున్నారు. నేను బాధతో కెవ్వుమని అరిచాను.

అంతే! మెలకువ వచ్చింది. తలచుకుంటుంటే ఇప్పటికీ నా శరీరం నిలువెల్లా వణికిపోతోంది. వీళ్లిద్దరూ కలిసి నన్నెప్పటికైనా చంపేస్తారు. నాకు తెల్సు. స్వార్థం పెచ్చు పెరిగితే మానవుడు దానవుడవుతాడట. నా అసహాయతకు నాకే కళ్ళ నుండి నీళ్ళు వచ్చాయి.

ఇంతలో బయట అడుగుల చప్పుడు విన్పిం చింది. కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

"ఇంకా ఈవిడ లేవలేదు. మహారాణి! ఆవిడకేం ఎంత సేపయినా పడుకుంటుంది. మధ్యలో సేవలు చేయలేక నాకు చావొచ్చింది. ఈవిడగారి మాయదారి రోగం ఏమిటో గాని మమ్మల్ని చంపుతోంది" సరోజ సణుక్కుంటూ వెళ్ళి పోయింది.

దాని మాటలు వింటోంటే నా ఒళ్లు భగభగ మండింది, కోపంతో పళ్ళు కొరికాను.

"సరోజా! నువ్వు కూడా నన్ను అనేదానివేనా? నువ్వు ఏ పరిస్థితిలో ఈ యింటికి వచ్చావో మరిచి పోతున్నావు. ఎవరి దయాధర్మం మీద ఈ ఇంట్లో స్థానం పొందేవో జ్ఞాపకం లేదా! నువ్వు నా ఇంటి శనిదేవతవవుతావని ఆనాడు గ్రహించలేకపోయాను. నన్నూ, నా కుటుంబాన్ని సర్వనాశనం చేయడానికే వస్తున్నావని అనుకోలేకపోయాను. నువ్వు ఏ క్షణంలో నా ఇంట్లో అడుగు పెట్టావో ఆనాటి నుంచే ఈ ఇంట్లో సుఖం లేకుండా పోయింది." — నా మనస్సు గతంలోకి వెళ్ళింది. అప్పటికి —

సరోజ వచ్చి నెలయింది.

సరోజ నాకు ఇంటి పనుల్లో సాయంచేస్తూ చాలా కలుపుగోలుతనంగా ఉండేది.

సరోజ సెకెండ్ క్లాస్ వరకూ చదివింది. ఎక్కడైనా, ఏదైనా ఉద్యోగం ఇప్పించి వేరే ఇల్లు చూసి సరోజను అందులో ఉంచాలని నా ఆలోచన.

వారికి చెప్పాను ఉద్యోగం చూడమని. ఆయన 'అలాగే' అన్నారు.

ఆ రోజు మధ్యాహ్నం మూడవుతుంది. నా గదిలో పడుకుని నిద్రపోతున్నాను. వారు ఆరోజు త్వరగా వచ్చినట్టున్నారు. నాకు తెలియదు. మామూలుగా నాల్గింటికి లేచి వారు వచ్చే సమయానికి ఏదైనా టిఫిను చేద్దామని వంటింట్లోకి నడిచాను.

వంటింట్లోంచి నాకు ఏవో మాటలూ నవ్వులూ విన్పించాయి. తలుపు దగ్గిరగా వేసి వుంది. నేను నెమ్మదిగా వెళ్ళి కొద్దిగా తలుపునెట్టి చూశాను.

ఎదుటి దృశ్యాన్ని చూచి నిశ్చేష్టురాలయ్యాను. సరోజ అటు తిరిగి స్టవ్ మీద టిఫిను చేస్తున్న ట్టుంది. వారు వెనకాల నిలబడి సరోజ మెడ చుట్టూ చేతులువేసి ఆమె మీదికి వంగి ఏదో చెప్తున్నారు.

ఒక్క క్షణం కూడా అక్కడ నిలవలేక పోయాను. పరిగెత్తున్నట్లే వచ్చి నా బెడ్ మీద వాలిపోయాను.

వీళ్ళిద్దరికి ఇంత చనువు ఎలా వచ్చింది? ఎప్పుడు వచ్చింది? ఇలా చాలా రోజుల నుంచీ జరుగు తోందా? నా వెనకే జరుగుతున్న ఈ భాగోతం నేనే గమనించలేకపోయానన్న మాట. ఆయన ఎంతకు తెగించారు. సరోజ. అవును.... సరోజ.... ఎంత నంగనాచి.

గుండెల్లోంచి దుఃఖం పొంగుకు వచ్చింది. ఆ రాత్రి భోజనం చేయలేదు. వారూ, సరోజా బ్రతిమిలాడారు. నాకు వాళ్ళ ఉనికే అసహ్యం


కలిగిస్తోంది.

"నాకు ఒంట్లో బాగాలేదు" అని చెప్పి తప్పించుకున్నాను.

ఆ రాత్రి నిద్రకు దూరమయ్యాను. ఆ మర్నాడు మొట్టమొదటిసారిగా హార్ట్ ఎటాక్ వచ్చింది. డాక్టర్ మందువల్ల గుండెనొప్పి తగ్గింది. కాని మనస్సుకి తగిలిన దెబ్బ మాత్రం మానలేదు. అది రోజు రోజుకీ క్యాన్సర్‌లా శరీరాన్ని తినేస్తోంది. ఏదో ఒక రోజు ఈ కాస్త గుండెనీ తినేస్తుంది. అప్పుడు.....అప్పుడు.....

'అమ్మగారూ, అమ్మగారూ....' రావులమ్మ పిలుస్తోంది.

నేను కళ్ళు తెరిచాను.



"అమ్మగారూ! చాలా ఎండెక్కిందమ్మా! లేచి ముఖం కడుక్కోండి" నెమ్మదిగా నన్ను లేవదీసింది రావులమ్మ.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాను. రావులమ్మ టేబిల్ మీద టిఫిన్ ప్లేటు పెడుతోంది. ప్లేటులో వున్న ఇడ్లీని చూడగానే నోరూరింది. గబగబా వచ్చి మంచం మీద కూర్చున్నాను. ప్లేటులో వున్న కారపొడిని చూడగానే సగం వుత్సాహం తగ్గిపోయింది. నాకు కొబ్బరి చట్నీ అంటే ఎంతో ఇష్టం. ఈ సంగతి సరోజకి తెలుసు. మరి కొబ్బరి చట్నీ ఎందుకు చేయలేదో?

"చట్నీలేదా?" అని రావులమ్మని అడిగాను "ఉల్లి చట్నీ చేశారుట. మీకు తినరుగా" అంది రావులమ్మ.

ఉల్లి చట్నీ అంటే ఆయనకీ, సరోజకీ ఇష్టం. నేనైతే రెండూ చేస్తాను. నన్ను పూర్తిగా తీసిపారేశారన్నమాట.

ఏది పెడ్తే తినదు? తినక చస్తుందా! అనేదే వాళ్ళ ఉద్దేశం.

ఇడ్లీ తినబుద్ధి కాలేదు. కాని ఆకలిమాటో – అలాగే తిన్నాను – కాఫీ తాగాను.

"అమ్మగారూ! స్నానం చేయండమ్మా. ఎనిమిదింటికి డాక్టరుగారు వస్తారుగా"—ప్లేటు తీస్తూ అంది రావులమ్మ.

నేను లేచాను. రావులమ్మ చీర జాకట్టు తీసి బాత్‌రూమ్‌లో పెట్టొచ్చింది. స్నానం చేసొచ్చి జడ వేసుకుంటూ —

"సరోజ ఏది రావులమ్మా!" అని అడిగాను.

"వంటింట్లో ఉన్నారమ్మా."

ఈ రోజు పాయసం తాగాలని ఉంది. సరోజతో చెప్పాలి కాని సరోజ ఇష్టం ఉంటే చేస్తుంది లేకపోతే లేదు. చిత్రం! నా ఇంట్లో నాకే స్వతంత్రం లేకుండా పోయింది. ఏ పని చెప్పాలన్నా బెరుకు.

ఇదివరకైతే సరోజ పొద్దుటే వచ్చి ఆ రోజు వంటకి ఏం చెయ్యాలో అడిగేది. అసలు ఏ చిన్న పని చెయ్యాలన్నా "అక్కయ్యా ఇలా చేయమంటావా?" అంటూ సలహా తీసుకునేది!

"అమ్మగారూ! డాక్టరుగారు వస్తున్నారమ్మా" నేను సర్దుకుని కూర్చున్నాను.

ఆయన డాక్టర్ మూర్తిగారితోపాటు లోపల కొచ్చారు. మిగతా సమయాల్లో రాకపోయినా డాక్టరుగారితోపాటు మాత్రం తప్పక వస్తారు ఆయన.

బహుశ మూర్తిగారి దగ్గిర చులకన అవడం ఇష్టం లేదేమో. చక్కగా డ్రెస్ చేసుకుని ఉన్నారు. ఆదివారమైనా ఈ ముస్తాబు దేనికి?

"ఎలా ఉందమ్మా" మూర్తిగారడిగారు.

"మీరే చెప్పాలి" నవ్వుతూ అన్నాను.

దగ్గిరికి వచ్చి పరీక్షించారు. నేను డాక్టరుగారి ముఖంలోకే చూస్తున్నాను. కాని ఆయన ముఖంలో నాకు కావాల్సిన మార్పు కన్పించలేదు.

"ఎలా ఉంది" - వారడిగారు.

నాకు మాత్రం 'ఇంకా ఎన్నాళ్ళలో చస్తుంది' అన్నట్లనిపించింది. డాక్టరుగారు నావైపొకసారి చూసి వారితో బయటికి వెళ్ళారు. నాకు వాళ్ళ మాటలు విన్పించలేదు. కాని ఏం మాట్లాడుకుంటారో నాకు తెలుసు.

ఆవిడ ఇంకెంతోకాలం బ్రతకదు అని అంటారు. ఆయన ముఖం వెలిగి ఉంటుంది. ఈ ఆలోచనలతో నా గుండె బరువెక్కింది.

మూర్తిగారు లోపలకు వచ్చారు. వచ్చి నా పక్కనే కుర్చీలో కూర్చుంటూ "కొద్దిగా ఇంప్రూవ్‌మెంట్ కనిపిస్తోందమ్మా నీకేం ఫర్వాలేదు" అన్నారు.

అవి నాకు ఓదార్పు మాటలని తెలుసు.

"ఆయన ఏరీ" అన్నాను.

"ఎవరో ఫ్రెండ్‌ని కల్సుకొవాలిట వెళ్ళాడు."

ఊ! రోగిష్ఠి భార్యంటే అంత వెగటయి పోయింది. మొదట్లో నాకీ రోగం వచ్చిందని ఆయన ఎంతో కంగారు పడ్డారు. బాధ పడ్డారు.

"రాజీ! నువ్విలా పడుకుంటే నాకేం తోచడం లేదు!" నా పక్కనే కూర్చుని అనేకసార్లు అన్నారు ఈ మాట.

ఆ మాటలు వింటూ ఆయనకి నా మీద గల ప్రేమకి ఆనందపడ్డాను. ఆ క్షణంలో నాకు ఆయన మీద వున్న కోపం పోయేది. మనసులో ఆయన్ని క్షమించేసేదాన్ని.

ఆయన ప్రేమ చూస్తుంటే ఆ రోజు నేను చూసిందంల్లా అబద్ధమయి వుంటుంది. నా కళ్ళు నన్నే మోసగించాయేమో? సరోజ పక్క పూరికే నిలబడ్డారేమో? నేనే అనవసరంగా ఆయన్ని అనుమానించానేమో? అని అనుకున్న క్షణాలు కూడా లేకపోలేదు! వారు ఆఫీసు టైము తప్ప మిగతా కాలమంతా నా దగ్గిరే గడిపేవారు. ప్రొద్దున్న నాతోనే టిఫిను చేసేవారు.

"రాజీ! వేళకు మందులు వేసుకుంటున్నావా? రాత్రి తెచ్చిన యాపిల్స్ తిన్నావా! ఇవ్వాళ ఏం తెమ్మంటావ్?" అంటూ ప్రశ్నలు వేసి నా ప్రాణం తీసేవారు.

వచ్చేటప్పుడు ఏవేవో తెచ్చేవారు. పక్కనే కూర్చుని అవన్నీ తినిపించేవారు.

కాని రాను రాను వారి పద్ధతే మారిపోయింది. నేనెలా వున్నానో అని కనుక్కోవటం కూడా మానుకున్నారు. ఈ మార్పుకి కారణం నాకు తెలుసు.

వారికి సుఖం కావాలి. ఆనందం కావాలి. మరి మంచంలో పడ్డ నా సంగతి ఎవరికి అక్కరలేదా! నా గుండెల మంట ఎవరు చూస్తారు? నా మనస్సు ఎలా బాధపడుతుందో ఎవరికి కావాలి? ప్రేమ పూర్వకమైన మాటల కోసం ఎంత తపిస్తున్నానో ఆప్యాయతకీ, అభిమానానికీ ఎలా ముఖం వాచి ఉన్నానో ఎవరికి కావాలి?

"కొత్త మందులు వ్రాస్తున్నాను. ఎలా వేసుకోవాలో కూడా వ్రాస్తున్నాను" అంటూ కాగితం మీద రాయసాగారు డాక్టరుగారు.

నేను నిరాశగా నవ్వాను.

"ఎందుకండీ మూర్తిగారూ మీకీ శ్రమ. ఇదేం తగ్గే రోగం కాదు" అన్నాను.

డాక్టరుగారు తలెత్తి చూసి–

"నువ్వా డాక్టరువి. నేనా?" అని సీరియస్‌గా అడిగారు.

నేను నవ్వుతూ "రోగి కూడా సగం డాక్టర్" అన్నాను.

"కానీ, నేను డాక్టరుని. నా మాట విని తీరాలి రోగం సంగతి ఆలోచించడం మానేసి, వేళకి మందులు వేసుకుంటూ, ఎటువంటి ఆలోచనలూ లేకుండా ప్రశాంతిగా ఉండమ్మా."

నేను నవ్వుకున్నాను. ప్రశాంతి – శాంతి అనే పదార్థం ఎలా ఉంటుందో పెళ్ళయ్యాక మర్చిపోయాను!

"డాక్టరుగారూ! ఒక్కమాటడుగుతాను. నిజం చెప్తారా."

"అడుగమ్మా" అన్నారు.

"నేనింకా ఎన్నాళ్ళు బ్రతుకుతాను?"

ఆయన కనుబొమలు ముడివడ్డాయి. వెంటనే నవ్వేస్తూ.

"అదేమిటమ్మా. అలా అంటావ్ నువ్వు చాలా రోజులు బ్రతుకుతావు" అని అన్నారు.



పార్లమెంటు సభ్యురాలు

చెన్నుపాటి విద్య

విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ (ఐ) అభ్యర్థిగా శ్రీమతి చెన్నుపాటి విద్య ఈ మధ్య జరిగిన మధ్యంతర ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నికైనారు.

శ్రీమతి విద్య 1934 లో జన్మించారు. ఆమె తండ్రి కీ. శే. గోరా (గోపరాజు రామచంద్రరావు) ప్రముఖ సంఘ సంస్కర్త; నాస్తికవాది. ఆయన ప్రభావం శ్రీమతి విద్య మీద పడడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ద్వారా బి. ఏ పట్టం పొందిన తరువాత ఆమె కూడా రాజకీయాల్లోనూ, సాంఘిక సేవా కార్యక్రమాలలోనూ ప్రవేశించారు. ఆమె భర్త శ్రీ చెన్నుపాటి శేషగిరిరావు. వారిది కులాంతర వివాహం.

సర్వోదయ నాయకుడు కీ. శే. ప్రభాకర్‌జీ నాయకత్వంలో శ్రీమతి విద్య సేవాగ్రాంలో వుండి, పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. తుపాను పీడిత ప్రాంతాలలో పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టే లక్ష్యంతో స్థాపింపబడిన 'ఆర్థిక సమతా మండల్'కి ఆమె ఉపాధ్యక్షురాలుగా వుంటూ కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో తుపాను బాధితులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీమతి విద్య ఎన్నో సేవా సంస్థలలో వివిధ హెూదాలలో పని చేశారు. స్థానిక పటమట లంక కస్తూరిబా మహిళా మండలి అధ్యక్షురాలుగానూ, కృష్ణాజిల్లా పరిషత్, కంకిపాడు పంచాయితీ సమితి, ఆంధ్రప్రదేశ్ సాంఘిక, సంక్షేమ సంస్థ, కృష్ణాజిల్లా మహిళా ఆర్థిక సహాయ కార్పొరేషన్ లలో సభ్యురాలుగానూ మంచి పేరు ప్రఖ్యాతులు గడించారు.

వివిధ మహిళా సేవా సంస్థలలోనూ, మండలులలోనూ స్త్రీలకు పయోజన విద్యా కేంద్రాలను స్థాపించిన శ్రీమతి విద్య "స్త్రీలలో ఆర్థిక సమానత్వం, సాంఘిక చైతన్యం రావాలంటే ప్రతి వనిత ముందు విద్యావంతురాలు కావాలి" అంటారు. —మల్లిడి కనకరత్నం

"మీరలాగే అంటారు డాక్టర్ ఈ రోగం రోజు రోజూ కాస్త కాస్త నన్ను మింగేస్తోంది. నా బ్రతుకు ఇంకా రోజుల్లో ఉంది. నాకు తెలుసు" నా కంఠం దుఃఖంతో బొంగురుపోయింది.

"అలా నిరాశగా మాట్లాడకమ్మా. ఒక్కసారి అసాధ్య విషయాలు కూడా సాధ్యమవుతాయి." అన్నాడు దృఢంగా.

"మీరేం చేయగలరు డాక్టర్! మృత్యువుని ఆపగలరా?"—సూటిగా అడిగాను.

మూర్తిగారు మాట్లాడలేదు. కొద్దిసేపయ్యాక అన్నారు.

"నీ రోగం సగం మానసికమమ్మా! నువ్వు ఇటువంటివేమీ ఆలోచించకుండా మాతో సహకరిస్తే తొందర్లోనే నీకు నయమవుతుంది. అంతా నీ చేతుల్లోనే ఉంది. డాక్టరుగా నేనేం ఓడిపోలేదు. చివరివరకూ రోగాన్ని తగ్గించడానికి కృషి చెయ్యడమే మా డ్యూటీ" అన్నారు.

ఇంతలో రావులమ్మ కాఫీ తెచ్చింది. మూర్తిగారు కాఫీ తీసుకున్నారు.

తర్వాత కాస్సేపు వాళ్ళమ్మాయికి చూసిన సంబంధాలను గూర్చి, వాళ్ళబ్బాయి చదువుల గూర్చి మాట్లాడి—

"రేపొస్తానమ్మా, నే చెప్పిన విషయాలు జ్ఞాపకం ఉంచుకో" అని వెళ్ళిపోయారు.

డాక్టరుగారు చెప్పిన మాటలే నా మనస్సు ఆలోచిస్తోంది—

ప్రశాంతంగా ఉండాలి. ఎటువంటి ఆలోచనలూ ఉండకూడదు. మానసికంగా ఆనందంగా ఉండాలి. ఎంత అసాధ్యమైన విషయాలు ఇవి.

ఈ శరీరంలో జీవుడు ఉండగా పైవేమీ సాధ్యం కాదు. అంటే మృత్యువు తప్పదన్న మాటేగదా! ఈ మనస్సు ఇలా ఆలోచిస్తూనే ఉంటుంది. కలత చెందుతూనే ఉంటుంది. రేపో, మాపో, ఈ క్షణాన్నో, మరుక్షణాన్నో మృత్యువు కబళించవచ్చు.

నవ్వు

అర్థం కాని నవ్వు.

ఏడుపు

సర్వం పోగొట్టుకున్న మహావేదనను గుండెల్లో దాచుకున్న దుఃఖం.

రెండూ ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. నా వయస్సు ఇంకా ముప్పై నిండలేదు. ఇంతవరకూ నేను సరిగ్గా కళ్ళైనా తెరవలేదు. అప్పుడే చచ్చిపోతానా?

ఏమో!

ఒక్కొక్కసారి నిజంగా చచ్చిపోతాననిపిస్తుంది. అప్పుడు ఏదో భయం, దిగులు మనస్సుని ఆవరిస్తాయి.

ప్రాణం మీది తీపో

బ్రతుకు మీది ఆశో

నన్ను నిలువునా ఒణికిస్తుంది. కానీ నాకేం ఆశలు మిగిలాయి.

మామూలుగా స్త్రీ జీవితం మూడురకాలుగా వుంటుందట—

కూతురుగా, భార్యగా, తల్లిగా.

కూతురిగా నాన్నగారి ఎడల నా బాధ్యత నిర్వర్తించుకున్నాను అంతే....అదే నా జీవితానికి శాపమైంది.

భార్యగా, తల్లిగా అపజయం పొందాను. ఎవరికీ అవసరంలేక ఒంటరిగా జీవితం ఆవలి ఒడ్డుకి చేరుకుంటున్నాను.

రేపోమాపో ఈ ఆకురాలిపోతుంది. ఈ హంస ఎగిరిపోతుంది.

నేనులేనని ఎవ్వరూ విచారించరు. అందరూ మామూలుగానే వుంటారు.

ఈ చెట్లు, ఆకాశమూ ఇలాగే వుంటాయి. అన్నీ వుంటాయి. అందరూ వుంటారు. కానీ నేను మాత్రం లేకుండా పోవాలి! ఎంత అన్యాయం. నేను లేకుండా ఈ ప్రపంచం మాత్రం ఎందుకుండాలి. ఉండకూడదు!

అంతా నశించిపోవాలి. నా చావుతో పాటు ప్రళయం రావాలి. అందరూ చావాలి. నశించిపోవాలి! 'అమ్మగారూ'.

కళ్ళు తెరిచి చూశాను. మాకు రోజూ కూర లిచ్చే అమ్మి వెంకటి.

"ఏంటమ్మగారూ! ఇలాగైపోయారు ప్చ్! కష్టాలన్నీ మంచోరికే వస్తాయి." జాలిపడుతోంది వెంకటి.

నాకు ఒళ్ళు మండింది. నా మీద ఎవ్వరూ జాలి పడవద్దు. నేను బాగానే ఉన్నాను. నేను చచ్చిపోతానని ఏడుస్తున్నావా? నేను చావను నేను చావను.

గది బయట రావులమ్మ, వెంకటి కూర్చుని నన్ను గూర్చి మాట్లాడుకుంటున్నారు.

"అమ్మగారు ఇంట్లో తిరుగుతుంటే లక్ష్మిలా వుండేవారు. పండగొస్తే ఎన్నిరకాల పిండివంటలు చేసేవారు! నాకిన్ని పెట్టేవారు. ఒకేలా ఆ రోజు నే రాకపోతే మర్నాటి దాకా ఉంచేవారు. ఎంత మంచి అమ్మ" వెంకటి అంటోంది.

"ఏం చేస్తాం అంతా కర్మ"

"అమ్మగారూ మంచం మీంచి లేవడమే లేదా?" వెంకటి అడుగుతోంది.

"ఆ! ఏదో కొద్దిగా తిరుగుతున్నారు. ప్చ్! ఏదయినా అమ్మగారి పనంతా అయిపోయింది"— రావులమ్మ అంటోంది.

వీళ్ళిద్దరి సానుభూతి వచనాలు నా చెవులను బద్దలు కొడుతున్నాయి.

"అమ్మగారి పనంతా అయిపోయింది"— రావులమ్మ మాటే మనసులో మ్రోగుతోంది. నిజంగా నేను చేయవలసిన పని అనేదే లేదా! ఇన్నాళ్ళూ ఈ సంసారం కోసం ఎంత తాపత్రయ పడ్డాను. కాని నేను సాధించిందేమిటి?

అసలు ఈ నేను అంటే ఏమిటి? ఈ శరీరమా! ఆత్మా! ఏమో నాకు సరిగ్గా తెలీదు.

కాని

ఈ శరీరాన్ని ఆవరించుకుని ఆశ్రయించుకున్న ఈ బ్రతుకు చాలా విలువైనదిగా తోచింది.

"వెధవ బ్రతుకు ఉత్త బోర్. దీనిలో ఏమి వుంది?" అని చాలాసార్లనుకున్నాను.

కాని ఇప్పుడు అలా లేదు. ఆ చిరాకు, విసుగు లేవు. ఏ వస్తువైనా ఉన్నప్పుడు దాని విలువ తెలీదు. ఈ చివరి దశలో తెలిసింది కాని ప్రయోజనం ఏమిటి?

జీవితం జారిపోతోంది. ఈ నాటకరంగం మీద నా పాత్ర అయిపోతోంది. ఇంత జీవితం, ఇన్ని సంవత్సరాలు ఎలా గడిపేశానో, ఎంత నిర్లక్ష్యంగా వృధా చేశానో, ఇంతకాలం గడిచిందే ఇన్నాళ్ళూ ఏం చేశాను? ఏం తెలుసుకున్నాను. ఏం సాధించాను. నా బ్రతుక్కి గమ్యం ఏదైనా వుందా? నా జీవితానికి లక్ష్యం ఏదైనా ఏర్పరచుకున్నానా! దేవుడు ప్రత్యక్షమై నా జీవితం ఇస్తే ఎంత తెలివితో, ప్రతిక్షణం ఎంత అపురూపంగా బ్రతుకుతాను. ఆలోచనలతో నా మనసు అలిసిపోయింది. స్తబ్దమైపోయింది.

దూరాన ఎక్కడో చావు డప్పు వినిపిస్తోంది. రాను రాను దగ్గిరవుతోంది. భయంకరంగా వినిపిస్తోంది. చెవి ప్రక్కనే వాయిస్తున్నట్లుగా వుంది. రెండు చేతుల్తో చెవులు మూసుకున్నాను.

స్వామీ! నన్ను బతకనివ్వు! ఎప్పుడూ బతికేలా ఉండనివ్వు నా మనసు పిచ్చిగా అరుస్తోంది. కళ్ళకి మైకం కమ్ముతోంది. నేను కూడా చావను కదా! అమ్మో! ఎలా? చచ్చిపోతున్నాను.

రక్షించండి. ఎవ్వరూ నన్ను ఆదుకో లేరా?

ఆదుకో....

"అమ్మగారూ! మీ కోసం ఎవరో వచ్చారమ్మా" రావులమ్మ నన్ను కుదుపుతూ పిలుస్తోంది.

కళ్ళు తెరిచాను. కొద్దినిమిషాలకి గాని స్పృహలోకి రాలేకపోయాను.

"అమ్మగారూ! ఎవరో వచ్చారమ్మా" నా కోసమా! ఎవరొచ్చి వుంటారు?

అమ్మ కాదు కదా! ఒళ్ళంతా సంతోషంతో జలదరించినట్లయింది.

"ఎవరే" అన్నాను.

"ఏమోనమ్మా! ఎవరో అమ్మాయిగారు"

అమ్మ కానందుకు నిరుత్సాహం కలిగినా .. కోసం వచ్చిన ఆ పిల్ల ఎవరో చూడాలనే కుతూహలం కూడా కలిగింది.

"సరే రమ్మను" నెమ్మదిగా లేచి సర్దుకుని కూర్చున్నాను.

రావులమ్మ వెనకాల ఒక అమ్మాయి లోపలకి వచ్చింది. నన్ను చూసి నమస్కారం చేసింది. వయస్సు పాతికేళ్ళు ఉండవచ్చు, సన్నగా, తెల్లగా చిగురుటాకులా వుంది. చక్కటి ముఖం, సరోవరంలో చేపల్లా తళతళలాడే కళ్ళు - చూడగానే ఆ అమ్మాయి చూపరులను ఆకర్షించే విధంగా వుంది.

"కూర్చోండి" కుర్చీ చూపాను. నిండుగా కొంగు కప్పుకుంది. బిడియంగా ఒదిగి కూర్చుంది.

ఎంత ఆలోచించినా ఆ అమ్మాయి ఎవరో జ్ఞాపకం రావటం లేదు.

"మీరు........"

ఆ అమ్మాయి నావేపు చూసి నవ్వింది.

"నేను మీకు తెలీదు. కాని మీరు నాకు తెలుసు నేను మోహన్‌గారి భార్యను నా పేరు జయ" అంది.

"మోహనా....ఎవరు చెప్మా...."కనుబొమలు చిట్లించాను.

"జ్ఞాపకం రాలేదా? మీకు పద్మ తెలుసు కదా! పద్మ, మోహన్ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు."

ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. మోహన్ని ఒకసారి పద్మ తీసుకువచ్చి పరిచయం చేసింది. చూడగానే చక్కని జంట అనుకున్నాను. అయితే మోహన్‌కి ఇదివరకే పెళ్ళయిందా! ఇంత అందమైన భార్యనుంచుకుని అదేం బుద్ధి! ఆశ్చర్యంలో తల మున్కలయ్యాను.

"ఆశ్చర్యపోతున్నారా! బహుశ మీకు తెలిసి వుండదు. మాకు పెళ్ళయి నాలుగేళ్ళు అయింది. ఇప్పుడు చూడండి ఆయన నాకు విడాకులిస్తారుట. నేనంటే అసహ్యంట. నాతో కాపురం నరకం అట. ఇప్పుడు నేనేం చెయ్యాలో మీరే చెప్పండి" కంఠంలో ఆవేశం, బాధ మిళితమయ్యాయి.

నాకంతా అయోమయంగా వుంది. బహుశ ఈ విషయం పద్మకి తెలీదేమో, తెలిస్తే ఇంత నీచానికి ఎప్పుడూ ఒప్పుకోదు. అయినా మోహన్ ఎంత రాక్షసుడు. పెళ్ళంటే బొమ్మలాటలా వుంది. ఆరితేరిన హంతకుడు. కనిపించకుండా ప్రాణాలు తీసేలా వున్నాడు. అతని అందమైన నవ్వు వెనకాల ఇంత విషం దాగివుందా!

"నా మాటలు నిజమో, కాదో అనుకుంటున్నారా".

"ఛ! అదేం కాదు మోహన్ చేస్తున్న అఘాయిత్యం గూర్చి ఆలోచిస్తున్నాను".

"మీ గురించి ఆయన చెప్పారు. మీరు వాళ్ళ పెళ్ళికి అంగీకరించారట కదా! మీకు అసలు విషయం చెప్పి ఈ కష్టం నుండి నన్ను గట్టెక్కించమని అడగడానికి వచ్చాను".

ఆ అమ్మాయి కళ్ళు రెండూ సరస్సులయ్యాయి.

నేను ముందుకు వంగి ఆ అమ్మాయి కన్నీటిని తుడుస్తూ.

"లేదమ్మా, నాకీ విషయాలేమీ తెలియవు. పద్మ చెప్పలేదు. మోహన్ చెప్పలేదు. తెలిస్తే ఇంతటి ఘోరాన్ని ప్రోత్సహిస్తానా" అన్నాను.

ఆ అమ్మాయి కళ్లు తుడుచుకుంది. నాకు అర్థం కాని విషయం ఒక్కటే.

ఇంతటి అందమైన భార్యని మోహన్‌కు ఎలా వదలబుద్ధయిందా అని? నిజం చెప్పాలంటే ఈ అమ్మాయి ముందు పద్మ తీసికట్టే!

"మీది ఇష్టం లేని పెళ్లా! అంటే మోహన్‌కి నువ్వంటే ఇష్టం లేదా!" అసలు మూలకారణం ఏమిటో తెలుసుకోవాలని అడిగాను.



# మీ రచయిత్రితో మీరు

వచ్చే నెల నుంచి ఆరంభమవుతున్న ఈ శీర్షికలో ప్రసిద్ధ రచయిత్రి కుమారి వాసిరెడ్డి సీతాదేవి, పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. మే నెలలో

ప్రసిద్ధ రచయిత్రి

## డాక్టర్ సి. ఆనందారామం

పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. పాఠకులు ఆమె కథల మీద గాని, నవల మీద గాని, వ్యక్తిగతంగా గాని ఇతరత్రా గాని ఎలాంటి ప్రశ్నలయినా అడగవచ్చు. ప్రశ్నలు కార్డు మీదనే రాయాలి. ఒక కార్డులో ఒక్క ప్రశ్నే వుండాలి. పైన పంపిన వారి పేరు, చిరునామా వుండాలి. ప్రశ్నలు ‘మీ రచయిత్రితో మీరు’ అని రాసి, ‘వనిత’ చిరునామాకు మార్చి 15వ తేదీలోగా చేరేలా పంపాలి. ఈ ప్రశ్నలకు సమాధానాలు మే సంచికలో వస్తాయి.

మంచి ప్రశ్నగా భావింపబడిన ప్రశ్న పంపినవారికి

పాతిక రూపాయలు బహుమానం!!

“ఆయనంటే నాకిష్టమే. కాని ఆయన మనస్సులో ఏముందో నాకు తెలీదు! పైకి మామూలుగానే ఉండేవారు.”

“ఆశ్చర్యంగా ఉందే మరి అటువంటివాడు ఎలా మారాడు.”

జయ నవ్వింది. “అక్కయ్యగారూ! మగాళ్లు మారడం ఎంతసేపండి. ప్రవహించే నది ఎప్పుడూ కొత్తనీటికే స్థానం ఇస్తుందిట. అలాగే వారికి కూడా రోజురోజుకీ కొత్త సుఖం కావాలి. అన్ని వస్తువుల్లాగానే కొన్నాళ్ళకి భార్య కూడా పాతదయింది.” అంది జయ బాధగా.

వివాహబంధం పవిత్రమైంది అంటారు. అది శాశ్వతంగా భార్యాభర్తల్ని కలిపివుంచుతుంది. ఆ మంత్రాలకి ఆ శక్తి వుంది అంటారు. మరి జయ, మోహన్ మంత్రాలసాక్షిగా వివాహం చేసుకున్నారు. కాని అది మూన్నాళ్ళముచ్చట అయింది. ఆ మంత్రాల శక్తి ఏమయింది? వివాహబంధం విలువ ఇంతేనా?

“నువ్వు చదువుకున్నావా జయా!”— ఆ క్షణంలో జయ నాకు ఆత్మీయురాలిలా అన్పించింది. ఈ అమ్మాయి జీవితానికీ, నా జీవితానికీ ఎక్కడో పోలిక ఉన్నట్లనిపించింది. అందుకే ఏకవచనంలో సంబోధించాను.

‘ఆ! బి. ఎ. ప్యాసయ్యాను” అంది జయ.

“మరింకేం? చదువుకున్నదానివి. అతడు నీకు విడాకులిస్తే ఏం! హాయిగా ఏదైనా ఉద్యోగం చేసుకుంటూ బతకొచ్చుకదా! పాతకాలపు స్త్రీలా ఇంకా భర్త నీడలోనే ఉండాలని కోరుకోవడం దేనికి?” అన్నాను.

జయ నావైపు విచారంగా చూసింది.

“అక్కయ్యా! మీ కింకా లోకంపోకడ అర్థం అయినట్లులేదు. కాలం మారింది. కాని మనుషులు మాత్రం మారలేదు. పైకి మాత్రం ఈ సంఘం మారినట్లు కన్పిస్తోంది. కాని లోపలంతా మురుగు వాసనే, పాత భావాలు కుళ్ళి కంపుకొడుతున్నాయి. మనిషి పై ఆకారం ఆధునికంగా వేసుకుని తనలో ఎంతో మార్పు వచ్చినట్లు నటిస్తున్నాడు. కాని అతని నరనరాన పాత భావాలే. అతని రక్తంలో ఉన్నది ఎర్ర, తెల్ల కణాలు కావు. మూఢాచారాలు, ఛాందస పాత ధోరణులు.”

“స్త్రీలు చదువుకోవాలి. కాని తన భార్య చదువుకున్నదై ఉండకూడదు. స్త్రీలందరూ స్వేచ్ఛగా అందరితో మాట్లాడాలి. కాని తన భార్య తనని కూడా సూటిగా చూడకూడదు. స్త్రీలు తనతో షికార్లు కొట్టాలి. కాని తన భార్య వంటింటి గడప దాటి బయటకు రాకూడదు. ఇదీ అక్కయ్యా నేటి పురుషుల మన స్తత్వం” ఆవేశంగా మాట్లాడ్డం వలన జయ కంఠం రాచుకుపోయినట్లు బొంగురుపోయింది. ముఖం ఎర్రబడింది. నా కన్నా ఎక్కువగా జయకి ఈ లోకం గురించి తెలిసినట్లుంది.

“అక్కయ్యా! మనం చూసే మార్పంతా పుస్తకాల్లోనే నిజ జీవితంలో ఆవగింజంత మార్పు కూడా కనబడడం లేదు. భర్త నీడలో వున్న స్త్రీకే గౌరవం. భర్తని వదిలితే ఆమె గతి కుక్కగతే.”

జయ చెప్పే మాటలన్నీ పరమ సత్యాలు. ఇంత తెలివితేటలు గల పిల్లకి మోహన్ విడాకులిస్తాడంటే అతను పరమ మూర్ఖుడయి ఉండాలి.

“మోహన్‌కీ, నీకూ తగాదా ఏమన్నా వచ్చిందా?” అని అడిగాను.

“తగాదానా” అటువంటిదేమీ లేదు. మొదట్లో అంటే మా పెళ్లి సమయంలో కూడా మోహన్ సరదాగానే వున్నారు. కాని అక్కయ్యా! మొదటి రాత్రే మోహన్‌గారి మన స్తత్వం కొద్దిగా అర్థమైంది నాకు. ఆ రాత్రి ఆయన నన్నడిగిన మొదటి ప్రశ్న “నీకు బి. ఏ లో క్లాసు వచ్చిందా” అని.

మా రిజల్ట్సు వచ్చి అప్పటికి వారమైంది. ‘ఆ! ఫస్టు క్లాసు వచ్చింది’ ఉత్సాహంగా చెప్పాను. ‘ఉహూ’ అన్నారు సాలోచనగా.

బహుశ ఎమ్మే చదివించడానికి అడిగారేమో అనుకుని సంతోషపడ్డాను.

“ఏమండీ! నేను ఎమ్. ఎ చదవనా?” అని అడిగాను.

ఆయన ముఖం చిట్లించారు.

“చదువా! చదువుకోడానికి నువ్వేమీ కన్నెపిల్లవు కావు. గృహిణివి. సంసారాన్ని బాగా నడుపుకుంటే చాలు” అంటూ చికాకు పడ్డారు.

నా మనస్సు చిన్నబోయింది. చిన్నప్పట్నించీ

ఎమ్. ఎ. చదవాలని నా కోర్కె. ఇక నాకు చదువు యోగం లేదేమో.

"ఈ వెధవ చదువులొచ్చి ఆడవాళ్ళని చెడ గొడుతున్నాయి. ఎక్కడ చూసినా చదువుకున్న ఆడపిల్లలే" విసుక్కుంటూ లైటు తీసి పడు కున్నారు.

ఆయన ధోరణికి విస్తుపోయాను. ఏవేవో భయాలు కూడా కలిగాయి. తొందరపడి నిర్ణయానికి వచ్చే స్వభావం కాదు నాది. అయినా ఒక్కరోజు లోనే ఆయన స్వభావం ఏం తెలుస్తుంది? ఏది ఏమైనా ఆయనకు స్త్రీ అంటే చులకన. చదువు కున్న వాళ్ళంటే భయం ఉన్నాయని గ్రహించ గలిగాను.

రోజులు గడిచేకొద్దీ ఆయన స్వభావం అర్థం కాజొచ్చింది. ప్రతి చిన్న విషయంలోనూ ఆయన మాటే నెగ్గాలని చూస్తుండేవారు. నేను చదువు కున్నాను కాబట్టి నేనెక్కడ ఆయన మాటను ఎది రిస్తానోనని ఆయన అన్నివిధాలా నన్నణచాలని చూస్తుండేవారు.

నాకిష్టమైన చీర కట్టుకోకూడదు. ఇష్టమైన కూర చేసుకోకూడదు. అంతా ఆయన చెప్పినట్లు చేస్తే మాత్రం ప్రేమాభిమానాలు కురిపించేవారు.

మొదట్లో ఇది బాధనిపించినా రాను రాను రొటీన్ జీవితమయింది.

వండటం, తినటం, నిద్ర. పిల్లలు ఉంటే కాస్త మార్పు ఉండేది. కాని దానికీ నేను నోచుకోలేక పోయాను.

ఏది ఏమైనా రోజులు ఏదోలా గడుస్తున్నాయి.

కాని ప్రశాంతంగా పారే నీటిలో రాయిలా, ప్రశాంత వాతావరణంలో ఉరుములా పద్మ నా జీవి తంలో ప్రవేశించింది!

ఆయనో రోజు సాయంత్రం ఇంటికొచ్చి—


"జయా! రేపు మా ఆఫీసులోని నా కొలీగ్ భోజనానికి వస్తుంది. వంట బాగా చెయ్యి" అన్నారు.

ఆయన కొలీగ్స్‌తో భోజనానికి రావటం అల వాటే. వచ్చినవాళ్ళు సాయంత్రంవరకూ కూర్చుని పేకాడుకునే వారు. వాళ్ళ అరుపులతో, కేకలతో నవ్వులతో ఇల్లు అదిరిపోతూ ఉండేది. అందుకే ఆదివారం వస్తుందంటే నాకు భయం కూడా వేస్తుండేది.

నేను మారు మాట్లాడకుండా మర్నాటి భోజనానికి కావల్సిన ఏర్పాట్లు చేశాను.


[సశేషం]

## కలువరేకుల ముగ్గు



మొదట 21 చుక్కలు 7 వరుసలు పెట్టాలి. తరువాత వరుసగా 19, 17, 15, 13, 11, 9, 7 వరకు చుక్కలు పెట్టాలి. చిత్రంలో చూపిన విధంగా ముగ్గు కలుపుకుంటే కలువ రేకుల ముగ్గు ముచ్చటగా పూర్తవుతుంది.

—వై. నాగమణి, చిలకలూరిపేట



పది గంటల ప్రాంతంలో డ్రాయింగ్ రూములోంచి ఎవరో అమ్మాయి గొంతు విన్పించినట్లయితే వంటింట్లోంచి వచ్చి తొంగిచూశాను. ఆయన కెదురుగా ఎవరో అమ్మాయి కూర్చుని ఉంది. ఆయన చూస్తే బాగుండదని లోపలకు వెళ్ళిపోయాను.

ఒక గంట తర్వాత లోపలికి వచ్చి "వంటయిందా?" అన్నారు.

"ఆ" అన్నాను.

"అయితే అన్నీ టేబిల్ మీద సర్దేసి వెళ్ళు! మేము పెట్టుకుంటాం' అన్నారు.

ఈ కొత్త విధానం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. కాని ఆయనకి ఎదురు చెప్పకూడదు. మారు మాట్లాడకుండా ఆయన చెప్పినట్లే చేశాను. అక్కణ్ణించి వచ్చి గదిలో కూర్చున్నాను.

వంటింట్లోంచి మాటలూ, పకపకా నవ్వులూ విన్పిస్తున్నాయి. అవన్నీ వింటోంటే నా మనస్సు భగభగమంటోంది. ఎవరా అమ్మాయి? ఆయనతో ఆ అమ్మాయికి అంత చనువు ఎలా వచ్చింది? ఆ పిల్ల ఆఫీసులో అందరితోనూ అలాగే ఉంటుందా? లేక ఆయనతోనే ఉంటుందా! వీళ్ళిద్దరిది కేవలం స్నేహమేనా? లేక ఇంకేదైనా వుందా!—

ఇవన్నీ నా మనస్సులో రేగినవి మాత్రమే. నేను వారినేమీ అడగదల్చుకోలేదు. వీళ్ళ వ్యవహారం ఎంతవరకూ వస్తుందో చూడదల్చుకున్నాను.

మూడు నెలలు గడిచాయి.

ఒకరోజు పడుకునే సమయంలో అన్నారు "జయా! నేను పద్మని పెళ్లి చేసుకోబోతున్నాను." అని.

నాకు షాక్‌లా తగిలింది ఆ మాట. వారింతకు తెగిస్తారని కలలో కూడా అనుకోలేదు!

"ఇది చాలా అన్యాయం" అని అరిచాను. వారు శాంతంగా "ఏది" అన్నారు.

"మీరు పెళ్ళి చేసుకోవడం."

"ఎందుకవుతుంది? నాకు పిల్లలు కావాలి" అన్నారు.

వారికి పిల్లలంటే ఇష్టం వున్నట్లు ఎప్పుడూ చెప్పలేదు. ఇదొక వంకేమో!

"దానికి నే నేంచెయ్యను? అది నా ఒక్కదాని మీదే ఆధారపడిలేదు. డాక్టరు దగ్గిరికి వెళ్లి ఇద్దరం పరీక్ష చేయించుకుందాం రండి!" అన్నాను బింకంగా.

ఆ మాటలతో ఆయనకి కోపం వచ్చింది. "నాకేం పట్టింది! నేను మగాణ్ణి. ఆ అవసరం నాకు లేదు."

"లేదూ! మరి పద్మని చేసుకుని కులుకుదామనుకున్నారా! మీరుండేది అరణ్యం కాదు. చుట్టూ సంఘం వుంది. నాకు విడాకులివ్వందే దాన్ని పెళ్ళి చేసుకోవడానికి వీలులేదు. తెలుసా?" అన్నాను ఆవేశంగా.

ఆయన నవ్వారు.

"విడాకులు ఎలా పుచ్చుకోవాలో నాకు తెలుసు" అని లైటు తీసి దుప్పటి ముసుగేసుకున్నారు.

నేను నా మంచం మీద వాలి కరువుతీరా ఏడ్చాను."

జయ ఆ పైన మాట్లాడలేకపోయింది. ఆమెను చూస్తోంటే నా మనస్సు ఏవిటోగా అయిపోయింది.

ఎంతో అణకువ, మర్యాద వుట్టిపడేట్టు కనిపించే మోహన్ ఇంత నీచుడా! అపురూపంగా ప్రేమించే భార్యను కాదని మరోదాన్ని చేసుకోడానికి సిద్ధపడడమా!

"అక్కయ్యా! రెండురోజులు నిద్రాహారాలకు దూరమయ్యాను. వారు అనుకున్నంత పనీ చేస్తారు. అప్పుడు నా గతి ఏమిటి?"

జయ కళ్ళ నుండి టపటపా నీళ్ళు రాలాయి.

అనునయంగా జయ చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

"అక్కయ్యా! ఇన్నాళ్ళూ ఆయన నీడలో వుండి, ఆయన చెప్పింది వింటూ, ఆయన కింత వండిపెడ్తూ, ఒక విధమైన జీవితానికి అలవాటు పడ్డాను. నాకు బ్రతుకు మీద ఎటువంటి మమకారం గానీ, కోరికలు గానీ, ఏవేవో చెయ్యాలనే ఉత్సాహం గానీ లేవు. ఇప్పుడు ఆయన నీడలోంచి వచ్చి విడిగా జీవించాలనే కోరిక నాకు లేదు. ఆయన గనుక విడాకులిస్తే నాకు చావడమే శరణ్యం. నేను చావడమో! బ్రతకడమో! అది నీ చేతుల్లోనే వుంది అక్కయ్యా!"

జయ కథ వింటోంటే నా చరిత్రపుటలు నా కళ్ల ముందు వుంచిన అనుభూతి కలిగింది.

లోకంలో స్త్రీల కన్నీటిగాథలన్నీ ఒకేలా వుంటాయంటారు. ఇదే కాబోలు. జయ, పద్మని పెళ్ళి చేసుకుంటే చావాలని నిర్ణయించుకుంది.

కానీ నాకు మాత్రం చావడం ఇష్టంలేదు! ఈ అందమైన ప్రపంచాన్ని వదిలి వెళ్ళలేను. భగవంతుడు ప్రత్యక్షమై వరమిస్తానంటే – ఈ ప్రకృతిలోని అందాల్ని చూస్తూ సృష్ట్యంతం వుండ



ఇస్తే చాలంటాను.

లోకంలో కాస్త నిరాశకలిగితే చాలు మనుషులు ఆత్మహత్య చేసుకుంటారు. చిన్న కష్టం వస్తే భరించలేరు. చిన్న సమస్యకి సహించలేరు.

అటువంటివి విన్నప్పుడు వారి పిరికితనానికి అసహ్యమేస్తుంది. వారి అజ్ఞానానికి జాలివేస్తుంది. ఏ కోరికలు తీరకపోతేనేం? ఏ ఆశలు నెరవేరక పోతేనేం? చీకటి ముసుగుల్ని తొలగించుకొస్తున్న సూర్యోదయాన్ని చూస్తూ బ్రతకొచ్చుకదా!

చంద్రకాంతిలో నవ్వే పారిజాతాల్ని చూస్తూ బ్రతకొచ్చుకదా!


నిశీధిలో, నిరవనిశ్శబ్దంలో —

నేను ఒక్కదాన్ని మేల్కొని గాలి తెచ్చే సుగంధాన్ని పీలుస్తూ, ఏవేవో స్వర్గాలు చూస్తూ గడపిన క్షణాలు అనేకం వున్నాయి.

"ఏమిటక్కయ్యా! ఆలోచిస్తున్నావు?"

తలెత్తి చూశాను.

కాలం మారుతున్నా, స్త్రీల కన్నీళ్లు అలాగే నిలిచి వున్నాయి.



# ఈ దీపం ఆరిపోదు



## విన్నకోట సుశీలాదేవి

పెద్ద కథ:

"జయా! పద్మ నాకు తెలుసు. నీ కెటువంటి అన్యాయం జరగదు. మాటిస్తున్నాను. నువ్వు నిశ్చింతగా ఉండమ్మా" అన్నాను దృఢంగా.

జయ నా రెండు చేతులూ పుచ్చుకుని కళ్ళకద్దుకుంది ఆనందంగా.

"అక్కయ్యా! మీరెంత మంచివారు. నా జీవితాన్ని ఒడ్డున పడేశారు. మీ మేలు జన్మలో మరిచిపోలేను. నా కాపరం నిలబెట్టినందుకు రోజూ మిమ్మల్ని తలచుకుని దీపం వెలిగించుకుంటాను."

జయ ఆనందంతో, ఆవేశంతో మాట్లాడుతోంది.

ఆమె ముఖం వెలిగిపోతోంది.

లేచి నుంచుంది.

"వస్తానక్కయ్యా! ఆయన వచ్చే టైమయింది. మళ్ళీ కలుస్తాను," అని చటుక్కున వంగి నా కాళ్ళ మీద చేతులుంచింది.

"ఛ! ఏం పని జయా!" అంటూ ఆమెను లేవనెత్తాను.

"వస్తానక్కయ్యా!" అంటూ జయ తృప్తిగా వెళ్ళిపోయింది.

వెళుతున్న జయని చూస్తూ నిట్టూర్చాను. ఏం ఆడవాళ్ళు! వీళ్ళ కోరికలు ఎంత అల్పమైనవి. భర్త ఎక్కడెక్కడో తిరిగి ఇంటికొచ్చి ప్రేమగా తమను పలుకరిస్తే చాలు. ఆయన తప్పులన్నింటినీ క్షమించేస్తారు. అన్నీ మర్చిపోతారు.

చిత్రం ఏమిటంటే! చదువు స్త్రీ బుద్ధికి పదును పెట్టిందేగాని, మనస్సుని వికసింపచేయలేదు. అయినా జయకి అంత నమ్మకంగా మాటిచ్చాను కదా నేను పద్మని ఒప్పించగలనా!

పద్మ నా మాట వింటుందా! కాదంటే.... ఊహూ అలా అనదు. పద్మ నాకు చిన్నప్పట్నించీ తెలుసు. చాలా మంచిపిల్ల. ఏదో తెలియక తొందరపడి వుంటుంది. నేనంటే చాలా ఇష్టం ఆ పిల్లకి. నే చెప్తే కాదనదు. కాదంటే.... నేను ఎంత అవమానానికి గురౌతానో! అసలు జయకి ఏం సమాధానం చెప్తాను?

ఆలోచనల్తో మనసంతా వికలమైంది.

" అమ్మగారూ ! పది దాటింది భోజనంచేస్తారా ! " రావులమ్మ అడిగింది.

ఏది తప్పినా తిండి తినడం తప్పదు కదా !

" తీసుకురా " అని లేచి అలాగే నెమ్మదిగా నడచుకుంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను.

బాత్‌రూమ్‌లో కాళ్ళు కడుక్కుంటూ కిటికీలోంచి బయటికి చూచాను. కింద నూతిచప్టా దగ్గిర ఆయన కాళ్ళు కడుక్కుంటున్నారు. సరోజ ప్రక్కన నుంచుని ఏదో చెప్తోంది. ఇద్దరూ విరగబడి నవ్వు కుంటున్నారు.

నాకు కారం రాచుకున్నట్లయింది. నే నిక్కడ ఇలా రోగంతోపడి ఏడుస్తుంటే వాళ్ళు హాయిగా వున్నారు. ఏదో కసి, ఆవేశం నా మనస్సుని ఊపాయి. కాని నేనేం చేయగలను ? మనసులో ఏడ్చుకోవటం తప్ప.

నా కోసం బాధపడే ఆత్మీయులు లేని దౌర్భాగ్య జీవితం ఐపోయింది నాది. ఎలా వున్నావు ? ఏం తిన్నావు ? ఏం కావాలి ? అని అడిగేవారు లేరు. ఈ మూలగదిలో నన్ను పారేశారు.

ఒక వస్తువుని మన కుపయోగపడేవరకూ వుంచు కుంటాం. అది పాడయితే దూరంగా విసిరేస్తాం.

అవును ! మనిషి కూడా వస్తువుతో సమానమే నేమో !

" అమ్మా ! అలా నిలబడిపోయారేమిటి ? " రావులమ్మ కంగారుగా లోపలకు వచ్చింది.

డబ్బు కోసం చేసేదైనా దీనికున్న అభిమానంలో వెయ్యో వంతైనా వాళ్ళకి లేదు. రావులమ్మ నా చేయి పుచ్చుకుని నెమ్మదిగా నడిపించుకుని వచ్చి మంచం మీద కూర్చోపెట్టింది.

కంచం వున్న టేబిల్‌ను నా ముందుకు లాగింది. అన్నం మీద హితవు ఏనాడో చచ్చిపోయింది. ఏదో ముష్టిదానికి పడేసినట్లు మిగిలినవి, అడుగూ బొడుగూ నా ముఖాన పారేస్తున్నారు !

" ఏంటమ్మా ! అలా తింటారు. డాక్టరుబాబు బాగా తినమని చెప్పలా ! పెరుగు వేయనా అమ్మా ! " అంటూ నీళ్ళలాంటి పెరుగు కంచంలో ఒంపింది.

రెండు ముద్దలు తిని చెయ్యి కడుక్కున్నాను.

" కాస్సేపు పడుక్కుని హాయిగా నిద్రపోం డమ్మా ! " రావులమ్మ కంచం తీసుకుపోయింది.

హాయి ! హుఁ ! ఈ శరీరం అనే పంజరం లోంచి మనస్సనే చిలక ఎగిరిపోయిననాడే హాయి. అంతవరకూ నా మనస్సుకి విశ్రాంతి లేదు. ఈ ఆలోచనలు నన్ను తినెయ్యక తప్పదు. వూరికే పడుకుంటే ఒకటే ఆలోచనలు. ఏదైనా చదువు కుందామంటే కళ్ళల్లో నీళ్లు కారతాయి. అయినా సరే ఏదైనా పుస్తకం తీసుకుని కాస్సేపు బొమ్మ లైనా చూద్దామనిపించింది. రావులమ్మ లేదు. భోజనం చేస్తోందేమో !

నేను లేచి టేబిల్ మీద చూశాను. అన్నీ పాత మేగజయిన్సే. కొత్తవి ముందుగదిలో వుంటాయి. తెచ్చుకుందామని లేని ఓపిక తెచ్చుకుని మెల్లగా నడిచాను.

ముందుగది కర్టెను గాలికి రెపరెపలాడుతోంది. తొలగించబోయి లోపలనుంచి ఏవో మాటలు విన్పిం చటంతో ఆగిపోయాను.

" నీకు వైలెట్ చీర చాలా బాగుంది సరూ ! " అది ఆయన కంఠం.

కర్టెను కొద్దిగా తొలగించి చూశాను. ఇద్దరూ ఆవైపు తిరిగున్నారు. సరోజ నడుం దగ్గిర పడిన చీర మడతల్ని సరిచేస్తున్నారు ఆయన.

" ఈ చీర మీద ముత్యాలదండ వేసుకుంటే ఇంకా బాగుంటుందండీ " గారంగా అంటోంది సరోజ.

" ఓ ! అలాగే రేపే కొనుక్కుందాం "

" ఎందుకండీ కొనడం. ఆవిడవి వున్నాయిగా ! పైగా ఆవిడ వాటిని పెట్టుకోవడం లేదుగా " అంది నవ్వుతూ.

" ఓ యస్ ! దానికేం. ఈ రాణీగారు ఆజ్ఞాపిం చడం, ఈ సేవకుడు నెరవేర్చకపోవడమూనా ! " సరోజ రెండు భుజాల మీద చేతులు వేసి దగ్గరకు తీసుకోబోయారు ఆయన.

" ఊఁ ! వదలండి. ఆ మూడుముళ్ళూ పడ్డాకే అన్నీనూ. అయినా అంత తొందర వున్నవారు త్వరగా పెళ్లి చేసుకోరాదూ " ఈసడింపుగా అంది సరోజ.

" నాకూ తొందరగానే చేసుకోవాలని వుంది కాని.... "

వారు అంటున్న మాటలను ఆ పైన వినలేక పోయాను.

ఈ భూమి బద్దలై నన్ను తనలోకి తీసుకో కూడదా ! లేని ఓపిక తెచ్చుకుని తూలిపోతూన్న శరీరాన్ని ఎలాగో మంచం మీదకు చేరవేశాను.

మనుషులు ఎంత నీచంగా ప్రవర్తిస్తారు ! ఒకప్పుడు నాతోనూ ఇటువంటి ప్రేమ మాటలే మాట్లాడారు ఆయన.

నేను వచ్చిన కొత్తలో " రాజీ ! నువ్వు నా పూర్వజన్మ పుణ్యంకొద్దీ లభించావు. ఇంత అనుకూలవతియైన భార్య లభించడం నా అదృష్టం " అనేవారు.

ఆనాడు ఆయన మాటలు విని మురిసిపోయాను. ఇప్పుడు రోగిష్ఠి దాన్నయిపోవడంతో ఎప్పుడు చస్తానా అని చూస్తున్నారు !

ఒకసారి ఆయనకి జబ్బు చేసింది. మంచం మీద నుండి లేవలేకపోయేవారు; అన్నీ నేను దగ్గిరుండి చేయాల్సి వచ్చింది.

నేనప్పుడు విసుక్కోలేదు.

అసహ్యించుకోలేదు.

రెట్టింపు ప్రేమతో చేశాను.

ఆయన జబ్బు నయం అయ్యాక అన్నారు.

" రాజీ ! నువు చేసిన సేవవల్లే నేను బ్రతికాను. నీ ఋణం ఎలా తీర్చుకోను " అని. నేను కోపంగా చూశాను.

" ఛ ! ఏమిటండీ ! ఆ మాటలు? మనలో మనకి ఋణాలేమిటి ? అది నా ధర్మం " అని అన్నాను.

" ఏమైనా నువు నాకు ప్రాణదానం చేశావు రాజీ ! నీకూ నేను ఇలాగే సేవ చేస్తాను " అన్నారు నవ్వుతూ. " అయితే నాకు రోగం రావాలను కుంటున్నారా " " ఛ ! ఛ ! అది కాదు వూరికే అన్నాను. నువ్వెప్పుడూ ఆరోగ్యంగానే తిరగాలి నా కళ్ళ ముందు."

నిజంగా వారలా ప్రేమగా మాట్లాడి చాలా రోజులయింది.

ఆ క్షణాలు అమూల్యమైనవి. కాని అదంతా నటన మోసం అని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

" అక్కయ్యా ! "

ముఖం ఒక్కసారి గట్టిగా తుడుచుకుని ఇటు తిరిగాను.

ఎదురుగా సరోజ. వైలెట్ చీర పైన ముత్యాల గొలుసు లేదు. బహుశ నా ఎదురుగా వేసుకోవడం ఇష్టంలేదేమో !

" అక్కయ్యా ! మీకెలా వుంది ? " తియ్యగా అడుగుతోంది.

ఇటువంటి పయోముఖ విషకుంభాలంటే నాకు ఎలర్జీ.

" ఎలా వుందక్కయ్యా ! " మళ్ళీ అడిగింది సరోజ. అడిగేది నా రోగం గూర్చి కాదేమో ! తన

చీర గురించి అయిఉంటుంది !

"చాలా బాగుంది" కటువుగా సమాధానం చెప్పాను. సరోజ అదేమీ పట్టించుకున్నట్టు లేదు.

"అక్కయ్యా ! బావగారు సినిమాకి రమ్మని బ్రతిమాలుతున్నారు. నాకైతే మిమ్మల్నిలా వదిలి వెళ్ళాలని లేదు. కాని ఆయన వినడం లేదు."

ఏం నటన ? వీళ్ళిద్దరికీ నటనలో బిరుదులు ఇవ్వవచ్చు. కసిగా పళ్ళు నూరుకున్నాను.

"సరోజా" ఆయన గొంతే అది. "వెడుతున్నా అక్కయ్యా ! నీకేమన్నా కావాలంటే రావులమ్మ నడుగు" అంటూ వయ్యారంగా నడుచుకుంటూ వెళ్ళింది సరోజ మా వారితో.

*

సరోజ మా అత్తగారివైపు బంధువు. అడపా దడపా మా ఇంటికి వచ్చి వుంటూవుండేది. సరోజకి తల్లి లేదు. కొన్నాళ్ళకి తండ్రి కూడా పోయాడు. ఏదో కొద్ది ఆస్తి వుంది. సరోజ అన్నదమ్ములందరూ వున్న ఆస్తిని పంచుకున్నారు. సరోజ ఒంటరిదయింది. అన్నదమ్ములందరూ సరోజ విషయమే పట్టించుకోలేదు.

సరోజ ఒక రోజు వురుము లేని వర్షంలా ఏడుస్తూ మా ఇంటికి వచ్చింది.

కళ్ళల్లో ప్రాణాలున్నాయి. తిండి తిని ఎన్నాళ్లో అయినట్లుగా వుంది. మా అత్తగారు అప్పుడు లేరు. కూతురి వూరికి వెళ్ళారు. సరోజ నా కాళ్ళ మీద పడి భోరుమంది.

"అక్కయ్యా ! మీరే దిక్కు. అందరూ నన్ను తరిమేశారు. మీరు ఆశ్రయమిస్తారని కోటంత ఆశతో వచ్చాను. నన్ను పొమ్మనకండి మీ ఇంట్లో పని మనిషిగానైనా వుంటాను. మీరే నన్ను రక్షించాలి."

సహజంగా నా మనసు జాలిది. కష్టాల్లో వున్న సరోజను చూడగానే కరిగిపోయాను. లేవనెత్తి ఆమె కన్నీటిని తుడిచి ఆమెకు ఆశ్రయమిచ్చాను.

శవాకారంలో మా ఇంటికి వచ్చిన సరోజ రోజు రోజుకీ ఆరోగ్యవంతురాలై బొద్దుగా, అందంగా తయారయింది.

నేను మాత్రం రోజురోజుకీ క్షీణిస్తున్నాను. సరోజ తన తళుకు బెళుకులతో నా భర్తని తన వైపు ఆకర్షించుకుంటోంది. ఈ ఇంట్లో తన స్థానాన్ని గట్టి చేసుకుంటోంది.

పాలు తాగిన రొమ్మునే గుద్దేవాళ్ళకి ఏ శిక్ష వేయాలి ?

భగవంతుడనేవాడుంటే తప్పకుండా వీళ్ళకి శిక్ష పడుతుంది.

"అమ్మగారూ ! పడుకున్నారా !" రావులమ్మ వచ్చింది.

"లేదే ! నువ్వు అన్నం తిన్నావా !"

"తిన్నానండీ"

"ఎదురింటి కెళ్ళి పద్మను ఒక్కసారి ఇలా పిలుచుకు వస్తావా" అన్నాను.

రావులమ్మ వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చింది.

"అమ్మగారూ ! పద్మమ్మగారు ఎక్కడికో పోయినారంట. రాగానే పంపుతామన్నారు." అని రావులమ్మ అక్కడే కూర్చుంది ఏదో చెప్పబోతోం దని గ్రహించాను.

"అమ్మగారూ ! సరోజమ్మ భలే ఆడదండీ ! అయ్యగార్ని ఇట్టే బుట్టలో వేసింది. ఇద్దరూ ఎలా నవ్వుకుంటూ పోతున్నారో చూశారామ్మా."

పనిమనిషితో ఇంటి విషయాలు మాట్లాటడం నాకిష్టం వుండదు. వాళ్ళు ఇలాంటి విషయాల్ని గూర్చి ఉన్నవీ, లేనివీ కల్పించి ప్రచారం చేస్తుంటారు, మనం ఒకటంటే పది చెప్తారు. కాని అలా మాట్లాడవద్దని రావులమ్మతో చెప్పలేను ! అదే నన్ను కాస్త ఆదుకునేది.

"మీరు మంచోరు కాబట్టి అలా చూస్తూ వూరుకున్నారు. మరొకరైతేనా – అయినా మీకు జబ్బు నయం కాదా ! మళ్ళీ ఇదివరలా తిరగరా ! అయ్యగారు ఇంతలోనే అలా మారిపోవాలా !

## లోకజ్ఞానం

1. హిందూ దేశ చరిత్రలో క్రీ. పూ. 327–326 సంవత్సరాలకు గల ప్రాముఖ్యత ఏమిటి ?

2. ప్రపంచంలో నేటికీ అక్కడక్కడ అగ్నిపర్వతాలు వున్నాయి. మన దేశంలో ఒకప్పుడు దక్కను పీఠభూమి అగ్నిపర్వతమయం అనేవారు. అయితే ఇప్పుడు మన దేశంలో అగ్నిపర్వతాలు వున్నాయా ? ఉంటే అవి ఎక్కడున్నాయో చెప్పగలరా ?

3. మన దేశంలో కల్లా అతి ప్రాచీనమైన పర్వతశ్రేణి ఏది ?

4. టిరాప్ జిల్లా ఏ రాష్ట్రంలో వుంది ? అది ఈ మధ్య వార్తలలో కెక్కడానికి గల కారణమేమిటి ?

5. ప్రపంచంలో కల్లా అత్యధికంగా వర్షం కురిసే ప్రాంతం చిరపుంజి అని మీకు తెలుసు. మరి ఈ చిరపుంజి పీఠభూమి ఏ కొండ మీద వున్నదో చెప్పగలరా ?

6. మన దేశంలో ఏ ప్రదేశాన్ని 'లాండ్ ఆఫ్ సన్‌రైజ్' లేక 'సూర్యుడు ఉదయించే భూమి' అని అంటారు ?

7. 'బోర్న్‌ఫ్రీ' నవలా రచయిత్రి పేరేమిటి ? ఆమె గురించి ఈ మధ్య పత్రికలలో పడడానికి గల కారణమేమిటి ?

8. సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన బ్రిటిష్ ప్రధాని ఎవరు ?

9. ప్రపంచంలో కల్లా అత్యంత వేగంతో ప్రయాణం చేసి రికార్డు నెలకొల్పిన విద్యుత్ రైలు ఏ దేశానికి చెందినది ? దాని వేగమెంత ?

10. జెట్ ఇంజన్ కనుగొన్నది ఎవరు ?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి]

అయినా ఈ మగాళ్లు ఎప్పుడూ ఇంతేనండి.''

రావులమ్మ అంటున్న మాటలు నాకు వినా లన్పించడం లేదు.

ఈ మాటలన్నీ నా మనస్సును బాధించేవే; అంటే పరోక్షంగా నన్ను మృత్యువు దగ్గరకు చేర్చేవి!

"ఆ సరోజమ్మ పెట్టే కూడు తినలేకుండా వున్నానమ్మా! ఒకటే విసుగు. మళ్ళీ మీరు లచ్చిందేవిలా ఎప్పుడు కళకళలాడుతూ తిరుగు తారో ''....

లచ్చిందేవి!....నా మనస్సులో ఏదో జ్ఞాపకం కదలాడింది.

*

"ఒరేయ్! మనింట్లో లక్ష్మి తల్లి పుట్టిందిరా'' బామ్మ ఎప్పుడూ నన్ను చూసి అనేది. రాజ్య లక్ష్మిగా నేను పెరిగాను. నేను పుట్టిన తర్వాత నాన్న వ్యాపారం బాగా అభివృద్ధి చెందిందట.

ఇద్దరు మగపిల్లల తర్వాత పుట్టిన నేను ఎంతో గారాబంగా పెరిగాను. నేను ఏం కోరినా వెంటనే వచ్చి ఒళ్లో వాలుతుండేది.

నేను పెద్దదాన్ని అవగానే బామ్మ రోజూ సాధించేది నాన్నను—

"ఒరేయ్! అమ్మాయికి పెళ్ళి చెయ్యరా'' అంటూ. ఆవిడ మాకు వరసకి మాత్రమే బామ్మ. అయినా మేమంటే ఎంతో ఇష్టం. కాని నాకు అప్పుడే చేసుకోవాలని లేదు.


"నేను బాగా చదువుకోవాలి. ఎన్నో డిగ్రీలు సంపాదించాలి. ఎంతో పెద్ద ఉద్యోగం చెయ్యాలి'' నా ఊహలు ఇలా సాగుతుండేవి.

"నాన్నా నేను చదువుకుంటాను'' అని నాన్నతో చెప్పాను. నాన్న నా కోర్కెని ఆమో దించారు.

వాళ్ల పిన్నితో మాత్రం "సంబంధాలు చూస్తూనే వున్నానే కుదరటం లేదు'' అంటూ ఏవో సాకులు చెప్పేవారు నాన్న.

పెద్దన్నయ్య ఎం.ఏ ప్యాసయి కాలేజీ లెక్చరరు వుద్యోగం సంపాదించాడు. రెండో అన్నయ్య ఇంజనీరింగు మూడో సంవత్సరంలో వున్నాడు.

ఆ యేడే నేను కాలేజీలో మొదటి డిగ్రీలో చేరాను. నా చదువుకి ఆటంకంగా కన్పించిన బామ్మ పోయి రెండేళ్లయింది. ఆవిడలేని కొరత



రోజా పువ్వు వాడకుండా రేపటి వరకు నిలువ వుండాలంటే – ఒక చిట్కా వుంది! పువ్వు మధ్యన ఒక చుక్క కొబ్బరినూనె వేయడం!



రాత్రి పడుకోబోయే ముందు కళ్ళకు మంచి రకం ఆముదం రాస్తే కళ్ళు, కళకళలాడుతూ వుంటాయి. కనుబొమ్మలకు రాస్తే, పల్చగా వుండే వెంట్రుకలు పెరిగి అందంగా అగుపిస్తాయి.

పడుకోబోయే ముందు పెదవులకు నెయ్యి రాసి తెల్లవారి లేస్తూనే, వేడి నీటితో కడిగితే పెదవులు మెరుస్తుంటాయి.

ప్రతి రోజూ స్నానం చేయబోయే ముందు ఒక చెంచా పాల మీగడలో కొన్ని చుక్కలు నిమ్మ రసం వేసి, రెండింటిని బాగా కలిపి ముఖానికి, చేతులకి పట్టించి, తరువాత సీకాయ పొడితో రుద్దుకొంటే శరీరానికి కొత్త కాంతి ప్రవేశిస్తుంది.

—కె. జి. సరళకుమారి

నన్ను చాలా రోజులు బాధించింది. నా చదువుకి అడ్డు చెప్పిందనే కోపమేగానీ బామ్మంటే నాకు ఎప్పుడూ ప్రేమే. నా డిగ్రీ అయ్యేవరకూ నాన్న పెళ్ళి సంగతి ఎత్తనన్నారు.

ఆ సంవత్సరమే నా జీవితంలో అనుకోని సంఘటన జరిగింది.

"ఆంటీ''—

ఆ పిలుపుతో జ్ఞాపకాల ఊయలలో ఊగుతున్న నేనూ, నిద్రపోతున్న రావులమ్మా వులిక్కిపడ్డాము. తల తిప్పి చూశాను.

ఎదురుగా పద్మ.

"కూచో పద్మా! రావులమ్మా నువ్వెళ్ళి వరం డాలో పడుకో'' అన్నాను.

రావులమ్మ లేచి వెళ్ళింది. పద్మ నా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

"ఆంటీ నీకెలా వుంది?'' పద్మ చేతితో నన్ను తడుముతూ అంది.

"ఏదో, ఇలా వున్నానమ్మా!''

"రోజు రోజుకీ చిక్కిపోతున్నావు ఆంటీ! మందులు సరిగ్గా వేసుకోవడం లేదా?''

"వేసుకుంటున్నానమ్మా! నా రోగానికేంలే! నేను బ్రతికున్నంత కాలమూ అవి వుండేవే'' అన్నాను నవ్వుతూ.

"ఏమో ఆంటీ! నిన్ను చూస్తుంటే దిగులేస్తూ వుంటుంది. పూర్వం ఎంత చక్కగా వుండేదానివి.''

గతాన్ని గుర్తు చేస్తే నా గుండెల్లో మంట. ఈ కాస్సేపైనా మనస్సుని ఆలోచనల నుంచి తప్పించాలి!

"పద్మా! మా అమ్మకు ఉత్తరం రాశావా!''

"రాశాను ఆంటీ:''

"అవునూ! ఇందాక రావులమ్మని పంపితే ఎక్కడికో వెళ్లావన్నారు ఎక్కడికి వెళ్లావు పద్మా?''

సిగ్గుపడింది పద్మ.

"మోహన్‌రావు రమ్మన్నారు. ఇద్దరం అలా కాస్సేపు తిరిగొచ్చాం'' అంది.

ఎంత అమాయకురాలు.

ఆ వెధవ ఎలా మోసం చేస్తున్నాడో? మోహన్ చూపులు ఎంత కన్నింగ్‌గా వుంటాయి. మనిషిని నిలువునా ముంచేసే చూపులు. పెదవులపై ఎప్పుడూ చిరునవ్వు వెలుగుతూ వుంటుంది. దాంతోనే ఎదుటి వాళ్ళని సమ్మోహపరుస్తున్నాడు!

"ఇంతకీ పెళ్లెప్పుడంటాడు పద్మా'' కొద్దిగా కోపంగానే అన్నాను.

"అప్పుడే ఎక్కడ ఆంటీ! మొదటి భార్యకి విడాకులివ్వాలిగా'' అంది.

నేను తెల్లబోయాను. ఇన్ని రోజుల నుంచీ మోహనరావుకి పెళ్లయినట్టుగా పద్మకు తెలీదేమో అనుకున్నాను. పద్మ తెలిసే వివాహం చేసుకోవా లనుకుంటోందన్నమాట.

"పద్మా! మోహన్‌కి వేరొకరితో ఇదివరకే వివాహం జరిగిందా'', అని అడిగాను ఏమీ తెలియనట్టు.

"జరిగింది ఆంటీ! కాని ఆవిడంటే మోహన్‌కి ఇష్టం లేదట. పెద్దవాళ్ళు బలవంతంగా చేశారుట. ప్చ్. పాపం! ఆ అమ్మాయి ఏం చదువుకోలేదుట. అందంగా కూడా ఉండదట. అందుకే ఆ అమ్మా యికి విడాకులిచ్చి నన్ను చేసుకోవాలనుకుంటు న్నారు. అదీకాక మా మనసులు కూడా కలిశాయి.''

ఎంతో తేలికగా నిర్లిప్తంగా చెప్పుతున్న పద్మ

మాటలను నిర్ఘాంతపోయి విన్నాను.

"పద్మా! ఒకవేళ ఆ అమ్మాయి విడాకు లివ్వకపోతే?" అన్నాను.

పద్మ కోపంగా నా వంక చూసింది.

"ఎందుకివ్వదూ! ఆయన ప్లీడరు దగ్గిరికి వెళ్లారు. ఆ ప్లీడరు ఏవో సలహాలు చెప్పాట్ట. ఆ అమ్మాయి మంచిదికాదని, రోగాలున్నాయని ఏవేవో నిరూపిస్తారట కోర్టులో. అప్పుడు ఎవడికోసం వస్తాయి విడాకులు? ఏది ఏమైనా మేము జీవితాంతం కలిసుంటామని ప్రమాణాలు చేసుకున్నాం ఆంటీ!"

పద్మ ఎంతో అమాయకంగా చెప్పుతోంది.

చిన్నతనంలో పరికిణీలు వేసుకుని గంతులు వేసుకుంటూ తిరిగే పద్మే నా కళ్లముందు మెదిలింది. నాలుగు సినిమాలు చూసి, నవల్సు చదివి ఏవేవో మాటలు వల్లిస్తోంది. ఈ అమాయకపు పిల్లలు ఆధునిక నాగరికత పేరిట చెలామణి అవుతున్న కృత్రిమపు పద్మవ్యూహంలో చిక్కుకు పోతున్నారు.

వీరికి విముక్తి ఎప్పుడో? అయినా ఆ మోహన్ దుర్మార్గుడు, రాక్షసుడు —

"సరోజ కనిపించదేం ఆంటీ!"

"సరోజా మీ అంకుల్ సినిమాకి వెళ్ళారు పద్మా" ఏడ్వలేక నవ్వుతూ అన్నాను.

"నిజంగానా"

"ఆ! ఇంకో విషయం చెప్పనా! మీ అంకుల్ సరోజని పెళ్లి చేసుకోబోతున్నారు."

పద్మ ఆశ్చర్యంగా కళ్లు వెడల్పు చేసుకుని చూసింది.

"అదెలా సాధ్యం ఆంటీ! నువ్వుండగా నేనా!"

నవ్వాను.

"నేను బ్రతికున్నా చచ్చినవాళ్ళతో సమానమేగా! ఆయనకేం ఉపయోగంగా వున్నానని? పైగా ఇలా మంచంలో పడి వున్నాను."

"ఇది చాలా అన్యాయం ఆంటీ! నీకు ఏదో జబ్బుచేస్తే మాత్రం ఇక తగ్గదా! మళ్ళీ మామూలు మనిషివి కాలేవా?"

"ఏమో పద్మా! అదెప్పటి సంగతో కదా! ప్రస్తుతం ఆయనకి నేనంటే పరమ అసహ్యంగా వుంది. మగవాళ్ళు కదా! వాళ్ళకి పెళ్ళంటే చొక్కా మార్చినట్లుగా వుంటుంది."

పద్మ ముఖం ఎర్రగా చేసుకుని "నీలాటి వాళ్ళు అలా మెత్త మెత్తగా వుంటే మగవాళ్ళు ఇలాగే అన్యాయాలు చేస్తుంటారు. అయినా నువ్వు విడాకులివ్వకు ఆంటీ!" అని అన్నది.

పద్మని చూసి మనసులో నవ్వుకున్నాను.

"ఎలాగైనా తీసుకుంటారమ్మా! మోహన్ అనుసరించబోయే దారే వుంది కదా! నా మీద కూడా అటువంటి తప్పుడు రాతలే రాస్తారు" అన్నాను.

పద్మ చప్పున తగ్గి, "నువ్వూ, ఆవిడా ఒకటి ఎలా అవుతారు?" అన్నది నెమ్మదిగా.

"ఎందుక్కాదు పద్మా! ఇద్దరమూ ఆడవాళ్ళమేగా. ఇద్దరికీ జరుగుతున్న అన్యాయం ఒక్కటేగా. నువ్వు చెప్పావే స్త్రీలు మెత్తగా వూరుకుంటున్నారని దానిక్కారణం తెలుసా? స్త్రీయే స్త్రీకి శత్రువవుతోంది. సాటి ఆడదానికి అన్యాయం చెయ్యడానికి ఆడదే పూనుకుంటోంది."

పద్మ మాట్లాడలేదు.

"పద్మా! నువ్వు ప్రేమించడం తప్పని ఎవ్వరూ అనరు. ప్రేమ పునాదిరాయిగా సంఘం నిర్మించబడాలి. కాని నువ్వు ఇప్పుడు చేయబోయే పనిని నిర్మలంగా ఆలోచించి చూడు. నువ్వు ఒక వివాహితుడిని పెళ్ళాడబోతున్నావు."

"అవును ఆంటీ! మోహన్‌రావుగారిని మనసారా ప్రేమించాను" అంది పద్మ.

"కాని పద్మా! నీ సుఖం కోసం నువ్వు ఆయన్ని చేబడితే సాటి ఆడకూతురైన జయ నీ పాదాల కింద పడి నశించిపోతుంది. ఇది నువ్వు ఆలోచించావా!"

"కానీ........"

"నన్ను చెప్పనీ పద్మా! నీ ఆంటీకి అన్యాయం జరగబోతోందని విచారిస్తున్నావు. జయ కూడా నాలాటిదే. నువ్వు సరోజని అసహ్యించుకుంటున్నావు. జయ కూడా నిన్ను అలాగే అసహ్యించుకుంటుంది! అయినా పద్మా! నీకేం తక్కువ ఒకసారి పెళ్ళయినవాడిని చేసుకోవడానికి? నీకు తెలీదేమో అతనికి చదువుకున్న స్త్రీలంటే ఏమంత మంచి అభిప్రాయం లేదు. నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడంటే అది నీమీది ప్రేమతో కాదు! అది కేవలం మోహం. ఆ మోజు తీరాక—"

నిష్టల రాధిక



కుమారి నిష్టల రాధికా కృష్ణాజీ తన నాల్గవ యేట నుంచీ నృత్యం నేర్చుకుంటోంది. హైదరాబాద్‌లోని న్యూకేజీ అప్పర్ ప్రైమరీ స్కూలులో 7వ తరగతి చదువుతున్న ఈ పన్నెండేళ్ళ బాలిక ఇప్పటి వరకు ఎన్నో నాట్య ప్రదర్శనలిచ్చింది. కొన్ని బహుమతులు గెల్చుకుంది కూడా. తాను విడిగానేకాక, చెల్లెళ్ళు అనుపమ, యామినీలతో కూడా కలిసి నాట్య ప్రదర్శనలు ఇస్తూన్నది.

రాధిక తల్లి శ్రీమతి శారద హైదరాబాద్ సంగీత నృత్య కళాశాలలో గాత్రం నేర్పే ఉపాధ్యాయిని. తండ్రి ఎన్. వి. కృష్ణాజీ నాటకరంగంలో ప్రఖ్యాతి వహించినవారు. రాధిక, తన చెల్లెళ్ళతో పాటు, హైదరాబాద్ సంగీత నృత్య కళాశాలలో అధ్యాపకురాలైన శ్రీమతి ఉమా రామారావు వద్ద శిక్షణ పొందుతోంది.

—మృణాళిని

దగ్గు రావడంతో ఆగాను. 'ఆంటీ!' అంటూ భయంగా చూసింది పద్మ. 'పద్మా' అంటూ ఆప్యాయంగా పద్మ చేతిని నా చేతిలోకి తీసుకుని "నువ్వు నా కూతురిలాటిదానివి పద్మా! నువ్వు నా కళ్ళ ముందే వూబిలోకి కూరుకుపోతుంటే నేను చూస్తూ వూరుకోలేను."

"ఆంటీ! ఏమిటో నాకంతా అయోమయంగా వుంది" అని అంది.

"పద్మా! ఇందాక అతని భార్య జయ నా దగ్గిరికి వచ్చింది. ఆ అమ్మాయి బి. యే ప్యాసయింది. చాలా అందంగా వుంది. తన భర్త విషయం చెప్పి ఎలాగైనా ఈ పెళ్ళి ఆపుచెయ్యమని వేడుకుంది. జయ విషయంలో మోహనరావు చెప్పిన విషయాలన్నీ అబద్ధం పద్మా! నా మాట నమ్ము" — అన్నాను.

"నిజంగానా ఆంటీ! ఆ అమ్మాయి బి. యే ప్యాసయిందా! ఏమీ చదువుకోలేదని చెప్పాడే మోహన్!"

"చూశావా పద్మా! అతను చేస్తున్న మోసం. చిత్రం ఏమిటంటే ఆడవాళ్లు ఎంత చదువుకున్నా, ఎన్ని ఉద్యోగాలు చేస్తున్నా పురుషుని మాయ మాటలకు లొంగిపోతూనే వున్నారు. అది బలహీనతో, అమాయకత్వమో! నిన్న ఆ అమ్మాయిని ప్రేమించాడు. ఇవ్వాళ నిన్ను. రేపింకొకరిని. ఇలా అతని రాక్షసత్వం సాగుతూనే వుంటుంది—"

ఆవేశంతో నా గొంతు వణికింది. "ఆంటీ! నన్ను క్షమించు ఆంటీ! అతని మాయ మాటలను గుడ్డిగా నమ్మి మోసపోయాను." పద్మ కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

వాటిని తుడుస్తూ నేను పద్మని దగ్గిరికి తీసుకుని గుండెలకి హత్తుకున్నాను.

"పద్మా! ఈ సంఘంలో మెలిగేటప్పుడు జాగ్రత్తగా వుండాలి. అందరి మాటలూ నమ్మకూడదమ్మా. పోనీలే అయిందేదో అయింది. ఇక ముందు ఇటువంటి పొరపాట్లు చేయకు. ఈలోపు మీ అమ్మగారికి చెప్పి చక్కటి అబ్బాయిని చూసి తొందర్లోనే మూడు ముళ్ళూ వేయించమని చెబుతాను" నవ్వాను.

"ఛీ! పో! ఆంటీ!" అంది పద్మ సిగ్గుపడుతూ.

"ఏం? ఈ అంటీ కోరిక తీర్చవా – నువ్వు తొందరగా పెళ్లి చేసుకుని నీ భర్తతో నా కళ్ళ ముందు నిలబడాలి. ఇదేనమ్మా నా చివరి కోరిక" నా గొంతు మూగవోయింది.

"ఏం! మాటలవి ఆంటీ!" మందలింపుగా అంది పద్మ.

నేను వెంటనే నవ్వేస్తూ—

"ఏదో అలా వచ్చేసిందిలే. ఇప్పటికైనా నా మాటలను నమ్ముతావా పద్మా!"

పద్మ నిర్మలంగా నవ్వింది.

"ఆంటీ! మీరు నాకు జ్ఞానోదయాన్ని కలిగించారు. ఇంక ఆ మోహన్ ముఖమే చూడను. జయగార్ని ఒక్కసారి కలుసుకుని క్షమాపణ కోరుకుంటాను" అంది.

"ఊఁ! చెబుదువులే" అన్నాను.

పద్మ లేచి నుంచుని నా చేతులు పట్టుకుని—

"ఆంటీ! మీ మేలు నా జన్మలో మరిచిపోలేను. వస్తా ఆంటీ" అని అన్నది.

"సరే" అన్నాను.

పద్మ వెళ్ళిపోయింది.

అమ్మయ్య! ఎలాగైతేనేం ఈ సమస్య పరిష్కారం అయింది. నా మనస్సు తేలిక పడింది. మాట నిలబెట్టుకున్నాను. ఇంక నాకు ఏమైనా ఫర్వాలేదు.

ఈ ఆలోచనతో నా మనస్సు ఝల్లుమంది.

అంటే.... అంటే నేను చచ్చిపోతానా?

ఇందాక పద్మతో మాట్లాడుతూ కూడా ఇలాగే 'నా చివరి కోరిక' అన్నాను.

ఎందుకలా అన్నాను?

నేను తొందర్లోనే చచ్చిపోతానని నా ఆత్మకి తెలిసిందా!

వివేకానందుడు అంటాడు–

"మనస్సు దేనినైతే గాఢంగా కోరుకుంటుందో అదే జరిగితీరుతుంది" అని. అయితే నా మనస్సులో నా అంతరాంతరాలలో నేను చచ్చిపోతాననే అభిప్రాయముందా? —

అదే అనాలోచితంగా బయటికి వచ్చిందా?

మళ్ళీ మృత్యువుని తలచుకోగానే నా శరీరమంతా చల్లబడినట్లయింది.

మళ్ళీ మనసంతా పిచ్చిగా తయారయింది.

ఏవేవో ఆలోచనలు, ఏవేవో శంకలు.

అప్పటి వరకూ మామూలుగా వున్న మనస్సులో ఏదో భయం, దిగులు ప్రవేశించాయి.

కనిపించని వ్యక్తుల మీద కసి, ద్వేషం. ఈ ప్రపంచాన్నే మింగేయాలన్నంత కోపం.

గుండెలు పగిలేలా ఏడ్వాలనిపించే దుఃఖం.

కాని ఏదీ చెయ్యలేని అశక్తత.

నన్ను ఇలా బాధపెడ్తున్నదెవరు? ఒంటరిగా వుండటం చూసి నన్ను కాస్త కాస్త తినేసే ఈ ఆలోచనలేమిటి?

నేను బ్రతికుండగానే నాకు నరకాన్ని చూపిస్తున్నది ఎవరు?

మృత్యువా?

ఒకవేళ నేను చనిపోతే నరకానికి పోతానా? స్వర్గానికి పోతానా?

మత విశ్వాసం ప్రకారం పునర్జన్మ ఉన్నదనుకుంటే — మరో జన్మ ఎత్తాలి.

అప్పుడు ఎక్కడ పుడ్తానో? ఈ జన్మలో మంచిపన్లు చేస్తే మరుజన్మ మంచిది వస్తుందట.

నేను ఏ ఏ మంచిపనులు చేశాను?

పద్మ జీవితాన్ని రక్షించాను. తోటి స్త్రీ కాపురాన్ని నిలబెట్టాను. నాకు తెలిసినంతవరకూ చెడ్డవి, ఎదుటివాళ్ళకు బాధ కలిగించేవి ఏవీ చెయ్యలేదు.

అవును చెయ్యలేదు.

'అబద్ధం' —

ఎవరో గది అదిరిపోయేట్టు అరిచినట్టనిపించింది.

చుట్టూ చూశాను.

ఎవరూ లేరు.

నా మనసే నన్ను ప్రశ్నిస్తోంది.

'నువ్వెవరికీ అన్యాయం చెయ్యలేదా?'

నేనెవరికీ అన్యాయం చెయ్యలేదు.

గుర్తు తెచ్చుకో....నా మనస్సు నన్ను నిలదీస్తోంది. హృదయపు లోతుల్లో ఏవో, ఏవేవో జ్ఞాపకాలు కదలి, చెదరి, ఆకృతి చెందడానికి ఆరాట పడుతున్నాయి.

ఒక్కసారి నీ బావను గురించి ఆలోచించు!

నీవల్లనేగదా నీ బావ అందరికీ దూరమై, తను ఒంటరివాడై, అవిటివాడై ....జీవితంలో ఏవీ మిగలక....

ఆశలు పెంచి, నమ్మించి మోసం చేసి.... అవును! నేను మోసం చేశాను నా బావను కాదని – పెద్దవాళ్ల పట్టుదలలకు లొంగిపోయాను లొంగిపోయి....

మనస్సు పొరల్లో ఏవేవో జ్ఞాపకాలు!

[సశేషం]

జీవితంలో ఎన్నో సంఘటనలు జరుగుతూ వుంటాయి. కానీ, అన్ని సంఘటనలూ మన మీద ప్రభావాన్ని చూపలేవు. కొన్నింటిని మరు నిముషం లోనే మరచిపోతాం. మరికొన్ని జీవితాంతం జ్ఞాపకం వుంటాయి. అవే జీవితాన్ని పూర్తిగా మార్చివేయగలుగుతాయి.

అవి నేను బి. యస్ సి సెకండ్ ఇయర్ చదివే రోజులు.

ఆ రోజు మధ్యాహ్నం సావిత్రి దగ్గిర బోటనీ రికార్డు తెచ్చుకుందామని సావిత్రి ఇంటికి వెళ్ళాను. సావిత్రీ నేనూ ఒకే గ్రూపు. ఒకే బెంచీమీద కూర్చుంటాం. అదీకాక, కొద్దిగా దూరపు చుట్టరికం కూడా వుంది.

నేను వెళ్ళేసరికి సావిత్రి హాల్లో కూర్చుని వుంది.

ఆదివారం కావటం వల్ల సావిత్రి కెదురుగా వాళ్ళన్నయ్య శ్రీనివాస్ కూడా కూర్చుని వున్నాడు.

వాళ్ళిద్దరే కాక శ్రీనివాస్ పక్కన ఇంకో కొత్త వ్యక్తి కన్పించాడు.

ఆ కొత్త వ్యక్తిని సావిత్రి వాళ్ళింట్లో నేనెప్పుడూ చూడలేదు!

ఆ ముగ్గురూ కలిసి పేకాట ఆడుకుంటున్నారు.

నేను గుమ్మంలోనే ఆగిపోవడం సావిత్రి చూసి- 'రావే రాజీ! అక్కడే ఆగిపోయావేం! ఇక్కడ కొత్తవాళ్ళెవరూ లేరు' అని అంటూ లేచి నా దగ్గరకు వొచ్చి చెయ్యి పుచ్చుకుని లోపలకు తీసుకొచ్చింది.

నేను సావిత్రి పక్కనే కూర్చున్నాను బిడియంగా.

శ్రీనివాస్ పేకముక్కలు కలుపుతున్నాడు.

"అన్నయ్యా! రాజీకి కూడా ముక్కలు పంచు" అంది సావిత్రి.

శ్రీనివాస్ ముక్కలు వేయబోతుంటే "ఊహు! వద్దన్నయ్యా! నాకు వెయ్యకండి. నేను తొందరగా ఇంటికి వెళ్ళాలి. సావిత్రీ! నీ బోటనీ రికార్డు ఇవ్వు వెళ్ళిపోతాను" అని అన్నాను.

"అబ్బ! ఇస్తాలేవే, కాస్సేపాగు" అంది సావిత్రి.

"ఇంట్లో అమ్మ ఒక్కతే వుంది"

"ఎప్పుడొచ్చినా చెప్పుల్లో కాళ్ళు పెట్టుకొస్తావ్! అది సరేగానీ రాజీ! ఈయనెవరో తెలుసా" అంది ఆ అపరిచిత వ్యక్తిని చూపిస్తూ.

నేను తలెత్తి చూశాను, ఆ వ్యక్తి వైపు.

అతనికి శ్రీనివాస్ వయస్సుంటే వుంటుంది.

కాని శ్రీనివాస్ కంటె దృఢంగా, ఆరోగ్యంగా వున్నాడు.

కొద్దిగా చామన చాయ అయినా అందమైన ముఖం, నుదుటి మీద పడే వంకీల జుట్టు. లాల్చీ, పైజామా వేశాడు. ఒకసారి చూడగానే మనిషిని ఆకట్టుకునే రూపం.

అతని చూపులు నన్ను తీక్షణంగా చూస్తున్నట్లని పించడం వలన చటుక్కున తలదించుకున్నాను.

"తెలియలేదా?"

లేదన్నట్లు తలతిప్పాను.

"ఇతను మీ బావ కృష్ణప్రసాద్" అంది సావిత్రి.

ఇబ్బందిగా ఫీలయ్యాను.

"సావిత్రీ రికార్డు ఇయ్యవా" అన్నాను.

"అబ్బ! నీ గొడవ నీదేనే, తెచ్చిస్తానుండు" లేచి తెచ్చిచ్చింది.

నేను బోటనీ రికార్డు పుచ్చుకుని వస్తానని సావిత్రికి చెప్పి గబగబా బయటికి వచ్చేశాను.

ఆ తర్వాత సావిత్రిని చూసినపుడల్లా బావే జ్ఞాపకం వచ్చేవాడు.

నాకూ ఒక బావ వున్నాడు. అత్తయ్యా, మామయ్యా అందరూ వున్నారు.


వాళ్లకీ, మాకూ ఎందుకు మాటల్లేవో?

నాన్నగారినిగానీ, అమ్మనిగానీ అడగాలని చాలా సార్లు అనుకున్నాను. కాని ఎందుకో అడగలేక పోయాను.

పెద్ద కథ

# ఈ దీపం ఆరిపోదు

## విన్నకోట సుశీలాదేవి



నేను తెల్లబోయాను.

నాకు అత్తయ్య వున్నట్లు తెలుసు. అదయినా ఎప్పుడో చిన్నప్పుడు బామ్మ అంటుండేది, అత్తయ్య ఎక్కడో వుందని. ఈ మధ్యకాలంలో అత్తయ్య సంగతి ఎవ్వరూ ఎత్తకపోవడం వల్ల అత్తయ్య వివరాలు నాకేవీ తెలియవు. మా ఇంట్లో ఆ ప్రస్తావన కూడా ఎప్పుడూ రాలేదు.

"నీకు మీ అత్తయ్య తెలిసుండదు. వాళ్ళకీ, మీకూ మాటల్లేవుగా" అంది సావిత్రి.

నేనేం మాట్లాడలేదు.

"కాని నీ గురించి మీ అత్తయ్యా, బావా ఎప్పుడూ అడుగుతూనే వుంటారు రాజీ" అన్నాడు శ్రీనివాస్.

నేను తలెత్తి బావవైపు చూశాను. బావ నావైపే చూస్తున్నాడు. సూదుల్లాంటి ఆ చూపులు నా శరీరాన్ని గుచ్చుతున్నట్లనిపించింది.

'పోనీ సావిత్రినే అడుగుతే' అని అన్పించింది కానీ నేనెవరినీ అడగలేదు!

ఒకరోజు—

కాలేజీ నుంచి వస్తూ బజార్లో ఆగి ఫ్యాన్సీ షాపులో మాచింగ్ గాజులు కొనుక్కుంటున్న సమయంలో 'బ్యాటరీ సెల్స్ ఇవ్వండి' అంటూ అడుగుతున్న మనిషిని యాదాలాపంగా పక్కకి తిరిగి చూశాను.

'బావ'!

అతను కూడా నన్ను చూశాడు. పలకరింపుగా నవ్వాడు.

నేను తల తిప్పుకున్నాను.

నాకు కావాల్సిన గాజులు ప్యాక్ చేయించుకుని బయటకు వచ్చాను.

బావ నా వెంట వస్తూ—"రాజీ! నేనెవరో మర్చిపోయావా?" అన్నాడు.

"జ్ఞాపకం వుంది" తలవంచుకుని నడుస్తూనే సమాధానం చెప్పాను.

"మరి మాట్లాడవేం?"

ఏం చెప్పాలో తోచలేదు.

"వెంటనే ఇంటికి వెళ్లాలా?"

"ఊఁ" అన్నాను.

"పోనీ! కాస్సేపు ఎక్కడైనా కూర్చుందామా రాజీ!" అడిగాడు బావ.

నాకేమిటో కొత్తగానూ, సిగ్గుగానూ వుంది. రోడ్డు మీద మమ్మల్నెవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూశాను. ఎవరి గొడవల్లో వారు వున్నారు.

"తొందరగానే వెడుదువుగానిలే రాజీ!" అంటూ ఎదురుగా వున్న హోటల్లోకి దారి తీశాడు.

నేను కాదని చెప్పలేకపోయాను. బావనే అనుసరించాను.

ఫామిలీ రూమ్‌లోకి వెళ్లి కూర్చున్నాము. నేను తలొంచుకుని టేబిల్ పైన గీతలు గీస్తూ కూర్చున్నాను.

"రాజీ! పరాయి ఆడపిల్లలా ఎందుకలా సిగ్గు పడతావ్? ఫ్రీగా మాట్లాడు" అన్నాడు బావ.

బావ మాటలు ఆజ్ఞాపిస్తున్నట్లుగా వున్నాయి.



"రాజీ! అత్తయ్య, మావయ్య బావున్నారా?"

"ఆఁ"

"మీ అన్నయ్యలు ఏం చేస్తున్నారు?"

సమాధానం చెప్పాను.

బేరర్ వచ్చాడు.

"ఏం కావాలి" అడిగాడు బావ.

"ఏం వద్దు" అన్నాను.

"వద్దా! రెండు ప్లేట్ల గులాబ్‌జామ్ తీసుకురా" అని బేరర్‌తో చెప్పాడు.

"రాజీ! నువ్వు కన్పిస్తావేమోనని సావిత్రి వాళ్లింటికి చాలాసార్లు వచ్చాను. కాని ఒక్కసారి కూడా నువు రాలేదు. నేను సావిత్రి యింటికి వస్తే నాతో మాట్లాడవలసి వస్తుందని మానేశావా రాజీ!"

బాగా పరిచయమున్నట్లు గలగలా మాట్లాడేస్తున్నాడు.

"ఊహు! కాదు."

బేరర్ ప్లేట్లు తీసుకు వచ్చాడు.

"తీసుకో" అంటూ నావైపు ఒకటి తోశాడు.

బావ మాటల్లో ఏదో శక్తి వున్నట్లుంది. నేను కాదని చెప్పలేకపోయాను.

"మన పరిచయం, చాలా ఆశ్చర్యంగా జరిగింది కదూ!" అన్నాడు.

"అవును! నాకో బావ వున్నట్లు మిమ్మల్ని కలుసుకునేంతవరకూ తెలీదు" అన్నాను.

"నాకు మాత్రం చక్కటి మరదలు వున్నదని తెలుసు" బావ గలగలా నవ్వుతూ అన్నాడు.

నేను సిగ్గుపడ్డాను.

"ఎలా తెలుసు!"

"సావిత్రి అమ్మ, మా అమ్మ తోడికోడళ్ల వరస. నేను విజయవాడలో పని వున్నపుడల్లా సావిత్రీ వాళ్లింట్లోనే దిగుతుంటాను. నీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూండేవాడిని. సావిత్రీ నువ్వూ కాలేజీ నుంచి వస్తోంటే చాలాసార్లు చూశాను."

కప్పు కిందపెట్టి పర్సుతీసి అయిదు రూపాయల కాగితం ప్లేట్లో పెట్టాడు.

'మా ఇంటికి ఒక్కసారీ రాలేదే?' అని అడుగుదామనుకున్నాను.

కాని అప్పటికే బావ లేచి నుంచున్నాడు.

నేనూ లేచాను. ఇద్దరం రోడ్డుమీదకి వచ్చాము.

"రాజీ! నేను రాత్రికి వెళ్లిపోతున్నాను."

'మళ్లీ ఎప్పుడు వస్తావు' అని అడగాలనిపించింది. కాని మాట్లాడలేకపోయాను.

"ఈసారైనా నిన్ను చూడగలిగినందుకు ఆనందంగా వుంది రాజీ! మన మొదటి పరిచయానికి గుర్తుగా" అని గులాబీల దండ కొనిచ్చాడు.

తీసుకున్నాను.

"తల్లో పెట్టుకో" అన్నాడు.

"ఇక్కడా! ఇంటికివెళ్లి పెట్టుకుంటాను."

"కాదు! పెట్టుకో! నేను చూడాలి" అన్నాడు సీరియస్‌గా.

ఒక్కి మొండివాడిలా వున్నాడు. నా మీద ఎంతో అధికారం వున్నవాడిలా మాట్లాడుతున్నాడు.

కాని బావ మాటలు నాకు కోపాన్ని తెప్పించలేదు. ప్రతిసారీ కాదని చెప్దామనుకుంటూనే లొంగిపోతున్నాను.

ఏమిటో చిత్రంగా వుంది.

పుస్తకాలూ, ప్యాకెట్ బావ చేతికిచ్చి పూలు పెట్టుకున్నాను.

"రాజీ! నీ పొడుగాటి జడలో ఈ గులాబీలు చక్కగా వున్నాయి" అన్నాడు.

నేను చిన్నగా నవ్వాను.

సెంటరొచ్చింది. తను ఆగాడు—

'నేనిటు తాలుకాఫీసు కెడతాను' అని, "రాజీ! నేను సావిత్రీ వాళ్ళింటికి వచ్చినపుడల్లా నీకు కబురు చేస్తాను. కాస్త దర్శనం ఇస్తావా" అన్నాడు.

నాకు ఏం చెప్పాలో తోచలేదు.

"చెప్పు రాజీ!"

బావను చూస్తోంటే జాలేసింది.

'అలాగే!' అన్నాను నవ్వుతూ.

'వస్తా రాజీ' అంటూ వెళ్ళిపోయాడు.

నేను మెల్లగా నడచుకుంటూ ఇంటికి వచ్చాను.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. సాయంత్రం జరిగిన విషయమే మనసులో పదేపదే మెదలసాగింది.

మనసంతా ఎందుకో స్పందిస్తోంది.

వింత అనుభూతితో శరీరం జలదరిస్తోంది.

బావ ఇప్పుడు ఏం చేస్తున్నాడో? అసలు ఏం చదివాడో అడగనే లేదు. పొడవుగా తీవిగా వుండే బావ రూపమే నా కళ్ల ముందు కదలాడసాగింది.

*

వారం రోజుల తర్వాత సావిత్రి కాలేజీలో కలిసి చెప్పింది.

"ప్రొద్దున మీ బావ వచ్చాడే. సాయంత్రం వస్తావా?"

నా గుండె ఒక్కసారి ఆగినట్లయింది.

వెళ్లాలా? వద్దా?

మా స్నేహం ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో?

నాన్నగారికి తెలిస్తే ఏమంటారో? అమ్మకు తెలిస్తే బాధపడుతుందేమో!

సాయంత్రం కాలేజీ అయ్యేవరకూ ఆలోచిస్తూనే వున్నాను.

కాలేజీ వదిలాక సావిత్రి "వస్తావా రాజీ! మా ఇంటికి" అంది.

నాకు ఏం సమాధానం చెప్పాలో స్ఫురించలేదు.

నా సందేహావస్థను చూసి సావిత్రి "ప్రసాద్ నీకు మరీ మరీ చెప్పమన్నాడు. నువు రాకపోతే రేపు కాలేజీకి తనే వస్తాట్ట" అంది.

నేను నిలువునా వణికిపోయాను.

అయ్యా బాబోయ్!

బావ అనుకున్నంతా చేస్తాడేమో? రేపు కాలేజీకి వచ్చి నాతో మాట్లాడుతూ వుంటే స్టూడెంట్స్ చూస్తే ఇంకేమైనా వుందా?

బావను చూడాలని నాకూ వుంది! వెళ్లక తప్పదు. వెడతాను.

సావిత్రితో కలిసి వాళ్లింటికి వెళ్లాను. బావ నన్ను చూడగానే సంతోషంతో ఎదురు వచ్చాడు.

నేను సందేహిస్తూ రాకుండా మానేస్తే బావ ఎంత బాధపడేవాడో కదా - అని కూడా నాకు అన్పించింది.

"రాజీ! కూర్చో" అన్నాడు.

కూర్చున్నాను.

సావిత్రి లోపలికి వెళ్లింది కాఫీ తెస్తానంటూ.

బావ నా ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

"రాజీ! ఈసారి కేవలం నీకోసమే వచ్చాను" అన్నాడు.

ఆ మాటలు నాకు మధురంగా విన్పించాయి.

"ఇక మళ్లీ ఇప్పుడిప్పుడే ఇక్కడికి రావడం కుదరదు. పొలం పనులు వున్నాయి."

"మామయ్య చెయ్యలేరా?"

"నాన్నపోయి నాలుగేళ్లవుతోంది" అన్నాడు బావ.

దుఃఖంతో అతని కంఠం రుద్ధమైంది. నాకూ బాధవేసింది.

"అలాగా! అయామ్ సారీ బావా" అన్నాను.

"ప్రస్తుతం పొలానికీ, ఇంటికీ నేనే యజమానిని" అన్నాడు బావ.

ఇంతలో సావిత్రి కాఫీ తెచ్చి యిస్తూ—

"ప్రసాద్! సినిమాకి వెడదామన్నావుగా తయారవ్" అంది.

బావ నావైపు చూసి, "నువ్వు వస్తావా రాజీ!" అన్నాడు.

నేను కంగారుపడ్డాను. "ఉహూ! రాను అమ్మకి చెప్పలేదు" అన్నాను.

"సావిత్రి మీ ఇంటికి కబురు చేస్తుందిలే" అంటూ బావ సావిత్రి వైపు చూశాడు.

"అవునే రాజీ! మా నౌకరుతో మీ యింటికి కబురు చేస్తాను. నువ్వు తప్పకుండా మాతో రావాలి"

"నా కోసం రావా రాజీ! మళ్లీ చీకటితోనే ఫస్టు బస్సుకి వెళ్లిపోతాను. నాకోర్కె తీర్చవూ?"

బావ మాటలకి కరిగిపోయాను.

"రా! రాజీ! ముఖం కడుక్కుందువుగానీ."

చేయి పుచ్చుకుని లాక్కెళ్లింది సావిత్రి.

ముఖం కడుక్కుని జడ వేసుకున్నాను.

సావిత్రి తన ఎర్ర పూలి పూలీ చీర కట్టుకోమంది.

కానీ నేను నీలంవాయిలు చీర సెలక్టు చేసుకున్నాను.

ఇద్దరం కిందికి దిగి వచ్చాము. బావ వైట్ ప్యాంటు పైన నల్లచుక్కలున్న ఎర్ర పుల్‌హాండ్స్ షర్టు వేసుకున్నాడు.

ఎప్పుడూ పైజమాలో చూడటం అలవాటయిన నాకు ఆ డ్రస్సులో మరీ బావ అందంగా కనిపించాడు.

'రండి' అన్నాడు బయటకు దారి తీస్తూ. మాతో శ్రీనివాస్ కూడా వచ్చాడు.

సినిమా చూస్తున్నంతసేపూ బావ నా పక్కనే కూర్చుని ఏవేవో మాట్లాడుతూనే వున్నాడు.

*

ఆ తర్వాత చాలా రోజులకు గానీ మళ్ళీ బావ రాలేదు.

ఈ మధ్యకాలంలో ఎంత చదువులో మునిగినా బావ జ్ఞాపకం వస్తూనే వున్నాడు.

సావిత్రి 'బావ వచ్చాడు' అంటూ ఎప్పుడు కబురు తెస్తుందా అని ఎదురు చూసిన క్షణాలు కూడా వున్నాయి.

అప్పుడప్పుడు అనుకుంటాను – నేనెందుకిలా పిచ్చిదాన్ని అవుతున్నానా? అని.

బావలో నన్నాకర్షించింది ఏమిటి?

నా క్లాసులో మగపిల్లలు కూడా వున్నారు. వాళ్లు నాతో సరదాగానే మాట్లాడుతూంటారు.

కాని వాళ్ళ మాటలేవీ నన్ను ఇలా ముగ్ధురాల్ని చేయలేదు.

మళ్ళీమళ్ళీ వినాలనిపించలేదు.

వాళ్ళెవరూ బావంత అందంగా లేకపోవడం వలన బావనే తలచుకుంటున్నానా—

నెల తర్వాత బావ వచ్చాడు. వచ్చాడని సావిత్రి కబురు చేయగానే పరిగెత్తాను.

ఆ సాయంత్రం వరకూ సావిత్రి గదిలో కూర్చుని ఇద్దరం హాయిగా కబుర్లాడుకున్నాం.

తన పొలం విషయాలూ, తమ ఊళ్లో రాజకీయాలూ, దేశపరిస్థితీ ఇలా అనేక విషయాల గూర్చి మాట్లాడాడు. అతని జనరల్ నాలెడ్జికి ఆశ్చర్యపోయాను!

మళ్ళీ ఆ మర్నాడు బావ వెళ్ళిపోయాడు.

*

సెకెండ్ ఇయర్ పరీక్షలయ్యాయి. సెలవులు రేపనగా బావ వచ్చాడు.

"పరీక్షలయ్యాయా రాజీ!" అన్నాడు బావ.

"ఆ"

"సెలవుల్లో ఏం చేస్తావ్"

"టైపు నేర్చుకుందామనుకుంటున్నా" అన్నాను. ముఖం చిట్లించాడు బావ.

"వెధవటైపు ఎందుకు? టైపిస్టవవుతావా? నాన్సెన్సు"

నేను నవ్వాను.

"అ! నాకు అవ్వాలనే వుంది" అన్నాను బావను ఉడికిస్తూ.

"ఛీ! ఛీ! అంత ఖర్మ నీకేం పట్టింది?"

"ఖర్మేమిటి చక్కటి వుద్యోగం...."

"సరేలే ఎప్పటి సంగతో కదా! రాజీ! సెలవులకి మా వూరు రాకూడదూ?"

బావని ఇలా దొంగతనంగా కలుసుకుని మాట్లాడ్డానికే ఎంతో గిల్టీగా ఫీలవుతున్నాను.

ఇప్పుడు వాళ్ళ వూరు కూడా వెళ్ళడమా?

అదీ అమ్మావాళ్ళకి తెలీకుండా—ఎలా వెళ్ళగలను?

"రాజీ! ఏమిటాలోచిస్తున్నావ్"

"బావా! నేను రాలేను"

"ఏం ఇష్టం లేదా?" తీక్షణంగా చూస్తూ అన్నాడు.

### లోకజ్ఞానం - సమాధానాలు

1. విలియమ్ హోగర్త్ (1697-1764). ఇంగ్లండు దేశస్థుడు. అతనికన్న ముందే కొందరు అప్పటి ఆచారాలు, నమ్మకాల మీద వ్యంగ్య ధోరణిలో కొన్ని చిత్రాలు గీసినా ఈనాడు మనం చూస్తున్న కార్టూన్లకు ఒక రూపం ఇచ్చింది విలియమ్ హోగర్త్.
2. 1969లో. ఆ సంవత్సరం 420 మెగావాట్ల ఉత్పాదనశక్తి గల తారాపూర్ అణుశక్తి కేంద్రం ప్రారంభించబడింది.
3. మహాత్మాగాంధి.
4. అండమాన్, నికోబార్ దీవులలో.
5. సాగర గర్భంలో చేపలు పట్టడం కోసం మన దేశంలో నిర్మింపబడిన మొట్టమొదటి నౌక 'మత్స్యహరిణి' వాస్కోడా గామాలోని గోవాషిప్‌యార్డ్‌లో నిర్మించబడింది.
6. కలకత్తాలో 1814 లో స్థాపించబడింది.
7. కాన్పూరు – లక్నో నగరాల మధ్య 1960 లో ప్రారంభించబడింది.
8. ప్రకాష్ పడుకోన్. ఇంగ్లండు బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల డెభ్భైఏళ్ళ చరిత్రలో విజయం సాధించిన తొలి భారతీయుడు ప్రకాష్. ఇతను డెన్మార్క్, స్వీడన్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లను కూడా సాధించాడు. 'అనధికార ప్రపంచ ఛాంపియన్'గా ప్రస్తుతం కీర్తింపబడుతున్న ప్రకాష్ మే నెలలో ఇండోనీషియాలో జరగనున్న ప్రపంచ బాడ్మింటన్ పోటీలలో పాల్గొంటున్నాడు.
9. అసిటిల్ సాలిసైక్లిక్
10. వెన్నెముక.

నాకేం చెప్పాలో తోచలేదు.

"అది కాదు బావా! అమ్మకి చెప్పకుండా...."

"రాజీ! పెద్దవాళ్ళు ఏవేవో విషయాలకి పట్టుదలలు పడుతూ వుంటారు. విరోధాలు పెంచు కుంటూ వుంటారు. అవెప్పుడూ శాశ్వతంగా వుండాల్సిందేనా? మనం వాటిని రూపుమాపడానికి ప్రయత్నించకూడదా?"

"అది సాధ్యమా బావా?"

"ఎందుకు సాధ్యం కాదు రాజీ! మనకు కావల్సింది ధైర్యం, ఉత్సాహం. అవి వుంటే చాలు. నేను నీతో స్నేహం చేసేది ఎందుకో తెలుసా? మళ్లీ మన రెండు కుటుంబాలు ఒక టవ్వాలి. ఇది నీకు ఇష్టం లేదా రాజీ!"

బావ సూటిగా అడిగాడు. బావ అలా ఆవేశంగా మాట్లాడుతుంటే నేను ఆశ్చర్యంగా బావకేసి చూస్తుండిపోయాను.

"రాజీ! నేను చెప్పింది నీకిష్టం లేదా?"

"ఎందుకిష్టం లేదు బావా నా కిష్టమే"

"అయితే నాతో సహకరించు రాజీ! నీ ఆస రాతో, నీ ప్రోత్సాహంతో మన రెండు కుటుంబాలను ఒకటి చేస్తాను. రాజీ! మా అమ్మ, మీ నాన్నని తలచుకుని రోజూ ఏడుస్తూనే వుంటుంది. మీ నాన్న మనసు కరిగి ఏనాటికైనా తన చెల్లెల్ని దగ్గిరికి చేరదీస్తాడని అమ్మ ఆశ. ఇంతకాలం ఆ ఆశ ఆశగానే వుండిపోయింది రాజీ!" క్షణం ఆగి అన్నాడు.

"రాజీ! ఒకటడుగుతాను చెప్పు! ప్రేమించి పెళ్ళి చేసుకోవడం తప్పా? పెద్దవాళ్ళు కూతురి అభిప్రాయం తెలుసుకోకుండా ఏదో సంబంధం చూసి ఖాయం చేసేరు. కాని అప్పటికే ఆ అమ్మాయి వేరే అతనికి మనసిచ్చి అతనితోనే తన బ్రతుకను కుంది. ఇంట్లో ఈ విషయం తెలిసి ఆమెను నిర్బంధించి బలవంతంగా పెళ్ళి చేయబోయారు. కాని ఆమె ఇంటి నుంచి తప్పించుకుని ప్రేమించిన వాడితో వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఇంటికొస్తే ఆవిడ అన్నయ్య అంటే మీ నాన్న నిర్దాక్షిణ్యంగా ఇంటి నుంచి గెంటేశారు.

రాజీ ఒక్క విషయం చెప్పనా! తరతరాల నుంచీ ఈ కులం, ప్రేమ పేరిట ఎందరో ఎన్ని విధాలుగా ఆహుతైపోతున్నారు. నేను చెప్పిన ఈ కథ కూడా నీకు పాతదిగానే అనిపించవచ్చు. కాని మన సమాజం అభ్యుదయంతో ముందుకు వెళ్ళిన రోజున ఇటువంటి సమస్యలూ, ప్రశ్నలూ తలెత్తవ్. అంతవరకూ ఇటువంటివి తప్పవు".

అత్తయ్యా, బావా ఎందుకలా దూరంగా వుంటు న్నారో ఇప్పుడు నాకు తెలిసింది.

ఇది జరిగి చాలా కాలమైంది. గతకాలాన్ని గుర్తు చేసుకుంటూ నాన్నగారు అర్థం లేని పట్టుదల లకు పోవడం నిజంగా విచారించదగ్గ విషయమే!

"రాజీ! అమ్మకి నిన్ను తీసుకొచ్చి చూపిస్తానని మాటిచ్చాను. మరి నా మాట నిలబెట్టవా!"

ఆ మాటలే. అదే నా బలహీనతని దెబ్బతీసేవి. నన్ను నిలువునా శక్తిహీనురాలిగా చేసేవి!

"అమ్మకి చెప్పకుండా ఎలా?"

"నీ స్నేహితురాలి వూరు వెడుతున్నానని చెప్పు"

"అమ్మో! ఇంత పచ్చి అబద్ధం -ఎలా బావా! ఊహు నేను రాను"

"రాజీ! ఇందులో బలవంతం ఏమీ లేదు. నీ మీద వున్న అభిమానంతోనూ, నా మాటను కాదనవనే నమ్మకంతోనూ, అత్తయ్యను చూడ టానికి వస్తావనే ఆశతోనూ, అడిగాను. నీకిష్టం లేకపోతే చెప్పు రాజీ! నేను వెళ్ళిపోతాను. నా ఆశలకు, నా కలలకు, ఇంతటితో స్వస్తి చెప్పి మరీ వెళ్ళిపోతాను........" ఆపైన బావ మాట్లాడ లేకపోయాడు.

తలెత్తి బావకేసి చూశాను.

బావ ముఖంలో విచారం గూడుకట్టుకునుంది. ఇంతసేపూ ఎంతో సరదాగా వున్న బావ ఇప్పుడిలాగ అయిపోవడం నేను చూడలేను.

మా ఇద్దరి మధ్యా కొన్ని సెకండ్లు నిశ్శబ్దం. అవును. ఏదో ఒకటి చెయ్యాలి! చెయ్యక తప్పదు! బావ ఆశల్ని పండించాలి. నాన్నగారు తన తప్పుని గుర్తించేటట్లు చెయ్యాలి. "బావా" అన్నాను.

బావ నా వేపు చూశాడు.

"బావా! నేను మీ ఇంటి కొస్తాను" అనేశాను.

ఆ క్షణాన ఏ శక్తి నన్నామాట అనిపించిందో, బహుశ – అంతరాంతరాలలో బావ మీద వున్న అభిమానమేనేమో!

"బావా! నువ్వెప్పుడు బయలుదేరమంటే అప్పుడు బయలుదేరతాను. నేన్నీకెప్పుడూ తోడు గానే వుంటాను" అన్నాను.

ఆ మాట వినటంతోనే బావ ఆనందంగా "రాజీ! నా జీవితానికి వరం చాలు" అంటూ ఆప్యాయంగా నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

*

నేను బావ దగ్గిరకు వెళ్లే రోజు దగ్గర పడు తున్నకొద్దీ నా మనసు ఆందోళనకు గురి కావడం మొదలు పెట్టింది.

"నేను ఎలాగైనా వూరు తప్పకుండా వస్తాను బావా!" అని ఎంతో ధైర్యంతో అన్న నేనే ఇప్పుడెందుకిలా పిరికి దానిగా మారిపోతున్నానో నాకే అర్థం కావడం లేదు.

అమ్మను ఏమని అడగాలి? అడిగితే పంపిస్తుందా! పంపించకపోతే ఏం చెయ్యాలి? మానెయ్యాలి.

కాని బావ నా కోసం స్టేషన్‌కు వస్తానన్నాడు. నేను వస్తానన్న సమయానికి రాకపోతే! బావ స్టేషన్ నుంచి ఎడ్లబండిని తీసుకెళ్ళిపోతాడా?

లేకపోతే నేను వచ్చేంతవరకూ స్టేషన్లోనే నా కోసం ఎదురు చూస్తూ వుంటాడా!

ఊహు! బావ వెళ్లడు. అలా నా కోసం నిరీక్షిస్తూ వుంటాడు.

నేను నా మనసులో ఒంటరిగా స్టేషన్‌లో నిల బడి నా కోసం నిరీక్షిస్తున్నట్లుగా బావని వూహించు కున్నాను.

నిరీక్షణ.

ఏ పుస్తకంలోనో చదివిన వాక్యాలు జ్ఞాపకం వచ్చాయి.

"నిరీక్షణలో ఎంత హాయివుంది. క్షణం గడ వదు. ఊపిరి పీల్చనివ్వదు. ప్రతి క్షణం వాచీ చూసుకోవడం, చూపు ఆగినంత దూరం దృష్టి నిలపటం. ఎవరినో చూసి వస్తున్నారని భ్రమ పడటం, దానివల్ల ఆనందం, మరుక్షణంలో ఆ వ్యక్తి లేకపోవడం, కళ్ళు బరువుగా వాలిపోవడం, చిత్రమైన హింస ఈ నిరీక్షణ!" —

నేను వెళ్ళకపోతే బావ కూడా అటువంటి హింసనే అనుభవిస్తాడేమో!

ఊహు! బావని అటువంటి బాధకు గురి చెయ్యను. అయితే నేను వెళ్ళాలి. మళ్ళీ సమస్య మొదటికి వచ్చింది.

ఇంట్లో అబద్ధాలు చెప్పి సినిమాలకి, షికార్లకి, తిరిగే అమ్మాయిలు నాకు తెలుసు. అప్పట్లో వాళ్ళ ప్రవర్తన చూసి అసహ్యించుకునే దాన్ని. కాని ఇప్పుడదే స్థితి నేనూ ఎదుర్కోవలసి రావడం ఇబ్బందిగానే వుంది.

*

నేను బావ వాళ్ళ వూరు వెళ్ళే రోజు రేపటికి వచ్చేసింది.

ఎలాగోలా అమ్మని ఒప్పించాలి.

వంటింట్లోకి తొంగి చూశాడు.

ఫరవాలేదు. అమ్మ దగ్గిరికి వెళ్ళొచ్చు.

నేను నెమ్మదిగా అమ్మ దగ్గిరికి వెళ్ళి ప్రక్కనే కూర్చున్నాను. అమ్మ కూరలోకి వచ్చి బఠాణీలు వలుస్తోంది.

నా వేపు ఒకసారి చూసి మళ్ళీ పనిలో నిమగ్న మైంది. నాకెలా మాట్లాడాలో? ఏం మాట్లాడాలో తెలీక ఆలోచిస్తూ వుండిపోయాను.

కొన్ని నిమిషాలు గడిచిన తర్వాత అమ్మ తలెత్తి—

"ఏమిటి రాజీ! ఏమన్నా కావాలా?" అంది. నేను వెంటనే "అమ్మా! నా క్లాస్‌మేట్ సరళ గుంటూర్లో వుంది. సెలవులకు రమ్మని ఒకటే వుత్తరాలు రాస్తోంది. వెళ్ళి రెండు రోజులు వుండి వస్తాను. పంపించవా అమ్మా!" అన్నాను. దానికి అమ్మ "అంత దూరమా రాజీ! ఒక్కదానివీ ఎలా వెడతావ్! వెంట పంపిద్దామంటే అన్నయ్యలు కూడా వూళ్లోలేరు. ఈసారి ఎప్పుడైనా వెడుదువు గానిలే" అంది.

ఈ మాట వినటంతోనే నా గుండె బ్యాలెన్స్ తప్పినట్లయింది.

కళ్ళల్లో నీళ్ళు తిరగడానికి సిద్ధంగా వున్నాయి.

"అది కాదమ్మా! నేను రేపు వుదయం బండికి వస్తానని ఉత్తరం కూడా రాశాను. ఈ ఒక్కసారికీ పంపించమ్మా! నీకు దణ్ణం పెడతాను. నన్నీ ఒక్కసారికీ పంపించు" అమ్మని బ్రతిమి లాడసాగాను.

"ఊ! ఏమిటో రోజులు మారిపోతున్నాయి. నన్నడక్కుండానే మీ ఫ్రెండుకి వుత్తరం రాసే వన్నమాట. సరే వెళ్ళిరా! నీకెంత డబ్బు కావాలో బీరువాలో వుంది తీసుకో."

నవ్వుతూ అమ్మ అలా అంటుంటే నా మనసు ఒక్కసారి బావ సమక్షంలో వాలిపోయింది.

*

ఆ చిన్న స్టేషన్‌లో నేను రైలు దిగడం బావ ఎడ్ల బండి ఎక్కించి ఇంటికి తీసుకు రావడం చాలా థ్రిల్లింగ్ అనిపించింది.

# ఎండ దెబ్బను తప్పించుకోడం ఎలా?

వేసవిలో తరచుగా 'ఎండదెబ్బ' తగిలిన సంఘటనలను మనం చూస్తూ ఉంటాం. ఎండ దెబ్బ తగిలిన కేసుల్లో అత్యవసరంగా తగు అవసరమైన చర్యలు తీసుకోనట్లయితే కొన్నిసార్లు ప్రాణాపాయం కూడా సంభవించడం జరుగుతుంది.

ఎండదెబ్బను తప్పించుకోవచ్చు. అయితే ముందుగా దీని దుర్లక్షణాలేమిటి? వైద్య సహాయం తీసుకునేలోపల మనమేవిధంగా ప్రథమ చికిత్స చేయవచ్చు అనే విషయాలను తెలుసుకోవలసి ఉంటుంది.

'ఇంజన్ రూం' లాంటి ఉష్ణోగ్రత హెచ్చుగా ఉండే గదుల్లో ఎక్కువసేపు వేసవిలో గడిపినా, ఉష్ణోగ్రత బాగా ఉన్నప్పుడెండలో తిరిగినా ఈ ఎండదెబ్బ తగలడం జరుగుతూ ఉంటుంది. తలకూ, కళ్లకూ తగిన రక్షణ లేకుండా ఎండలో తిరిగితే ఈ లక్షణాలు వచ్చే అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయి.

**లక్షణాలు:**

ఎండదెబ్బ తగిలిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. 106 డిగ్రీల నుంచి 108 డిగ్రీల ఫారిన్ హీట్స్ పెరగొచ్చు. రోగికి బాగా తల నొప్పి, తలతిప్పు, మైకమూ కలగవచ్చు. చిత్త భ్రమ ఏర్పడటమూ, స్పృహతప్పడమూ, శరీరం మొద్దుబారడమూ జరగొచ్చు. చర్మమంతా ఎర్రబారి పొడిగా తయారవుతుంది. చెమటపట్టదు. నాడివేగం హెచ్చుతుంది. నాడి నిముషానికి 150 సార్లు కొట్టుకోవచ్చు. ఇలా చివరికి రోగి ప్రాణాపాయస్థితిని కూడా ఎదుర్కోవలసి రావచ్చు. ఒకసారి ఎండదెబ్బకు గురి అయి తప్పించుకున్న వ్యక్తి మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తపడటం మరీ అవసరం. ఎందువలననంటె అతని శరీరం ఎండను భరించలేదని ఇదివరకే చెప్పివేసింది. కనుక మళ్ళీ ఆ స్థితిని కొని తేవద్దు.

**ప్రథమ చికిత్స:**

శరీర ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతూ ఉన్నట్లయితే, రోగిని పడుకోబెట్టాలి. ఎక్కువ జ్వరంగా ఉన్నట్లుగా అనిపిస్తే, ఓ గంటలోపే ఆ ఉష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నాలు చేయాలి. ఎక్కువ ఆలస్యం...అంటే, 3, 4 గంటలపాటు అలాగే ఉష్ణోగ్రత కొనసాగితే మెదడు దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండె కూడా ఆగిపోవచ్చు. కనుక అతి త్వరితంగా శరీరోష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నాలు చేయాలి. రోగి దుస్తులను చల్లని నీటితో తడపాలి. తలచుట్టూ, మెడచుట్టూ, వీలయితే మిగతా శరీరాన్ని కూడా కప్పేలా మంచు ముక్కలతో నింపిన సంచీలను పెట్టాలి.

రోగికి గాలి సోకడం చాలా అవసరం కనుక 'ఫ్యాను' క్రింద పడుండజేస్తే మంచిది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేందుగ్గాను శరీరాన్ని రుద్దుతూ ఉంటే బాగుంటుంది. రోగికి స్పృహ వచ్చిన తర్వాత చల్లని పళ్ళరసాలనివ్వవచ్చు.

ఈలోగా డాక్టరుగారిని పిలువనంపడం మాత్రం మరచిపోకూడదు.

**తప్పించుకునేందుకు మార్గాలు:**

* బాగా నీళ్ళు త్రాగాలి. ఉప్పు కలుపుకుని త్రాగడం మరీ శ్రేయస్కరం. బయటకు వెళ్ళబోయేముందు, గమ్యస్థానం చేరిం తర్వాతా నీరు త్రాగాలి.

* బిగువైన దుస్తులను ధరించడం మంచిది కాదు. సాధ్యమైనంతవరకూ వదులుగా ఉండే దుస్తులనే వేసుకోవాలి.

* తలకు రక్షణ కోసం టోపీనీ, కాళ్లకు చెప్పులనూ వేసుకోకుండా ఎండలో తిరగకూడదు. వీలయితే మెడ భాగాన్ని కూడా జేబు రుమాలుతో కప్పివేయడం మంచిది.

* ఎండలో శ్రమనెక్కువ చేసే పనులు చేయకూడదు.

* అతిగా తినడంగానీ, ఆల్కహాల్ను తీసుకోడంగానీ మంచిది కాదు.

* అనారోగ్యంతో ఉన్నవాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో తిరగడం కూడదు.

* వయసు మళ్లినవాళ్లూ, పిల్లలూ, గుండె జబ్బులవాళ్లూ ఎండదెబ్బకు త్వరగా గురి అవుతారు. కనుక వారు ప్రయాణం చేయడం తప్పనిసరి అయినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోడం కూడా తప్పనిసరే అని గుర్తుంచుకోవాలి.

—డా. లక్ష్మి

ప్రశాంతంగా వున్న ఒక పెంకుటింటి ముందు బండి ఆపుతూ బావ — "అమ్మా! అమ్మా! ఎవరు వచ్చారో చూడు" అంటూ కేకేశాడు.

నేను బండిలోనే కూర్చుని కుతూహలంగా ఆ ఇంటి కేసి చూస్తుండిపోయాను.

పూర్వకాలపు మండువా ఇల్లు. విశాలంగానే వుంది. కాని ఆ ఇల్లు ఆ పరిసరాలు నా దృష్టికి ఆనటం లేదు.

అత్తయ్య కోసం నా కళ్ళు ఆత్రంగా చూడ సాగాయి.

తడి చేతులు కొంగుకు తుడుచుకుంటూ—

"ప్రసాద్! మీరు అక్కడే వుండండి" అంటూ అత్తయ్య వచ్చి నేను బండి దిగడానికి స్టూలు తెచ్చి వేసింది.

నేను అత్తయ్యనే చూస్తున్నాను.

పచ్చటి ఛాయతో కళకళలాడుతోంది అత్తయ్య ముఖం. అంత అందమైన ముఖంలో బొట్టుంటే ఇంకెంత బాగుండేదో.

నేను లోపలికి వచ్చాను.

అత్తయ్య నన్ను ఎగాదిగా చూసి సంతోషంతో నా చేతులు పట్టుకుని—

"రాజీ! ఎంత పెద్దదానివయ్యావే! పోన్లే తల్లీ! నీకయినా ఈ అత్తయ్య మీద దయ కలిగింది. చూడటానికి వచ్చావు" అని అంటుంటే అత్తయ్య కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

నేను ఆనందం, బాధ మేళవించిన భావాలతో వుక్కిరిబిక్కిరయ్యాను.

"చూశావమ్మా! నా మాట నిలబెట్టుకున్నాను" బావ పెద్ద పోజులో అంటున్నాడు.

"పెద్ద గొప్పగా చెప్తున్నావుగానీ! నీ మాట మీద రాలేదు. నేనత్తయ్యను చూడాలనుకున్నాను. వచ్చాను. నాకిష్టం లేకపోతే నీ మాటేమీ నిలబడేది కాదు."

"అబ్బా! పిట్టకూత పట్టిందే!" అన్నాడు నవ్వుతూ.

"ఎప్పుడు రైలెక్కావో ఏమో, ముఖం కడుక్కుందువుగాని రామ్మా" అంది అత్తయ్య.

"అవును పాపం! ఎన్ని రోజులు రైలులో వుందో ఏమో! ఆ ముఖం చూడు."

"ఏమ్మా! నా ముఖానికేం?" అన్నాను. "నీ ముఖానికేం! ఎంచక్కా నాలుగు రోజుల క్రితం తయారుచేసిన పకోడీలా వుంది."

"బావా! మీ ఇంటికి తీసుకొచ్చి నన్నిలా అవమానించటం భావ్యమా" అన్నాను కోపం నటిస్తూ.

"ఊరుకోరా ప్రసాద్! నువ్వు రామ్మా" అంటూ అత్తయ్య నన్ను లోపలకు తీసుకెళ్ళింది.

స్నానం చేద్దామని సూట్‌కేస్‌లో బట్టలు తీసుకుంటుంటే అత్తయ్య నన్ను వారించి—

"నీ కెందుకమ్మా! నువ్వు స్నానానికి పద నేను తీసుకొచ్చి బట్టలిస్తాను" అంది.

'వద్దులే అత్తయ్యా! నేను తీసుకుంటాగా' అని ఎంత చెప్పినా అత్తయ్య వినకుండా నా బట్టల్ని తనే దొడ్లోకి తీసుకొచ్చింది.

విశాలమైన పెరడు, రకరకాల మొక్కలు, ఒకవైపున నుయ్యి. మరోవైపు కొబ్బరి చెట్లు.

వేసవికాలమైనా చల్లగా వుంది.

ఒక మూలగా చుట్టూ తాటాకులతో దడిలా కట్టి వుంది. దానికొక తడిక తలుపులా వుంది.

బహుశా అదే బాత్‌రూమ్ అనుకుంటూ. అత్తయ్య దాన్ని చూపిస్తూ—

"రాజీ! అక్కడ తొట్లో నీళ్ళున్నాయి స్నానం చేసిరా! ఇదిగో తడిక మీద టవలూ, చీరా వేస్తున్నాను" అంటూ దారి చూపింది.

చల్లటి నీళ్ళలో స్నానం చేశాక ఎంతో హాయిగా అన్పించింది.

చందనం రంగు వాయిలు చీర కట్టుకుని అదే రంగు జాకట్టు వేసుకున్నాను.

దొడ్లోనుంచి హాల్లోకి వెళ్ళబోతుంటే అత్తయ్య "రాజీ! ఇలారామ్మా" అంటూ పిలిచింది.

నేను అత్తయ్య వున్న గదిలోకి వెళ్ళాను.

అదే అనుకుంటా వంటగది. అత్తయ్య పొయ్యి ముందు కూర్చుని వంట చేస్తోంది. నన్ను చూసి—

'రామ్మా!' అంటూ తన పక్కనే పీట వేసింది. నేను కూర్చున్నాను.

"రాజీ! అమ్మా నాన్న బావున్నారా!"

నేను తలూపాను.

"ప్రసాద్ నీ గురించి చెప్తుంటే నిన్నెప్పుడు చూస్తానా అని తపించిపోయాను రాజీ! ఇన్నాళ్ళకి నా బంగారు తల్లిని కంటికి నిండుగా చూసుకున్నాను. ఇంత అందమైన సిరిగల తల్లి నా కోడలైతే నా కింతకంటే కావల్సిందేముంది" అంటూ అత్తయ్య ప్రేమగా నా బుగ్గలు నిమిరింది.

నేను సిగ్గుపడిపోయాను. తలెత్తి అత్తయ్యకేసి చూడలేకపోయాను.

"రైల్లో వస్తోంటే ఎందరి కళ్ళు నీ మీద పడ్డాయో తల్లీ! రాగానే దిష్టి తీశాను కాదు" అంటూ అత్తయ్య లేచింది.

"అమ్మా! నాక్కూడా తీయవే" అంటూ బావ ఎక్కడనుంచో వూడిపడ్డాడు.

అత్తయ్య నవ్వి—

"మీ రిద్దరూ పక్కపక్కనే కూర్చోండిరా! ఇద్దరికీ ఒకేసారి దిష్టి తీసేస్తాను" అంది.

"అబ్బ! ఇప్పుడేం వద్దులే అత్తయ్యా!" అంటూ అక్కడినుంచి లేవబోయాను. దిష్టితీస్తూ 'రాజీ! వెళ్ళకమ్మా టిఫిను తిందువు గానీ' అంటూ అత్తయ్య నన్ను కూర్చోబెట్టింది.

"ఇదిగో ఈ రొట్టె తినమ్మా" అంటూ ప్లేటు నా ముందు పెట్టింది.

ఇటువంటి రొట్టె నేనెప్పుడూ తినలేదు. కొద్ది కొద్దిగా తుంచుకు తినసాగాను.

"ఎలా వుంది?"

"చాలా బావుందత్తయ్యా!"

"ఏవిటీ? పల్లెటూరి ఫలహారం నీకు నిజంగా నచ్చిందా!" అన్నాడు బావ ఆశ్చర్యంగా నావేపు చూస్తూ.

"ఆ ఏదో పరవాలేదు. కానీ మా టిఫిన్లు ముందు ఇదెందుకూ పనికిరాదు బావా! అది మాత్రం నిజం" అన్నాను తల ఎగరేస్తూ.

"అవునవును మీ పట్నవాసం నాజూకు తిళ్ళు తింటే మనుషులు నీలాగే తయారవుతారు. ఇందాక ఎడ్లబండిలో చూడాలి అమ్మాయిగారి అవస్థ" అన్నాడు కొంటెగా.

నేను కోపంగా చూశాను బావవేపు.

"ఊరుకోరా ప్రసాద్! ఎందుకలా రాజీని ఏడిపిస్తావ్?"

"నేనేం ఏడవడం లేదత్తయ్యా! నాకింకా కొంచెం రొట్టె పెట్టవూ—చాలా రుచిగా వుంది" అన్నాను.

అత్తయ్య పెట్టింది.

నేను తింటుంటే అత్తయ్య, బావ నావేపు తృప్తిగా చూడసాగారు.

[సశేషం]

పెద్ద కథ

# ఈ దీపం ఆరిపోదు

చిన్నకోట సుశీలాదేవి

రాత్రి పైమెంతయిందో తెలీదు.

ఆరు బయట మంచం మీద పడుకున్నాను. అంతా నిశ్శబ్దంగా వుంది. వుండుండి దూరంగా ఎక్కడో కుక్కలు మాత్రం అరుస్తున్నాయి!

ఆకాశంలో అక్కడక్కడ చుక్కలు మెరుస్తున్నాయి. గుడ్డిగా వెన్నెల కాస్తోంది. నిన్న రాత్రి ఈ పాటికి నా గదిలో మంచం మీద పడుకుని నేను చేయబోయే ప్రయాణాన్ని గూర్చి ఆలోచిస్తున్నాను.

అప్పటికే సూట్ కేస్‌లో బట్టలన్నీ సర్దుకున్నాను. అయినా ఇంకా అనుమానమే.

ఏదైనా అవాంతరం వచ్చి ఈ ప్రయాణం ఆగిపోతుందేమోనని.

రైల్లో కూర్చునే వరకూ సందేహంగానే వుంది. కాని ఎటువంటి అడ్డూ లేకుండా వచ్చేశాను.

ఈ ప్రయాణం, ఇదంతా తలుచుకుంటుంటే అసలు నేనేనా ఇంత ధైర్యం చేసింది అని ఆశ్చర్యంగా వుంది!

నేను వెళ్లబోయేది కొత్తచోటుకి, అక్కడ ఎలావుండగలను అని ఆలోచించుకుంటూ వచ్చాను.

కాని, ఎక్కడా నాకేం కొత్తగా అన్పించలేదు. మా యింట్లో వున్నట్లుగానే వుంది!

ఇల్లు అనగానే అమ్మ, నాన్నగారూ జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకి నేనిలా అత్తయ్య దగ్గిరికి వచ్చానని తెలిస్తే ఏమంటారు? నన్ను తిడ్తారా? నా సాహసానికి మెచ్చుకుంటారా?

వున్నట్లుంటి వీధిలో కుక్కలు ఒక్కసారిగా అరిచాయి.

నా ఆలోచనలు చెదిరిపోయాయి. క్షణం తర్వాత కుక్కల అరుపులు ఆగిపోయాయి. మళ్ళీ నిశ్శబ్దం అలుముకుంది.

ఈ పల్లెటూళ్ళలో చీకటి పడగానే నిద్రపోతారనుకుంటాను. ఇదే తమ వూళ్లో అయితే రాత్రి తెల్లవార్లూ లారీల మోత చెవుల్ని బద్దలు కొడుతూ వుంటుంది. ఇక్కడెంతో ప్రశాంతంగా వుంది. నాకు ఆ లారీల మోతలు, హడావుడి, ఆ మనుషులను చూస్తోంటే పిచ్చెక్కుతున్నట్లుగా వుండేది. నాకెప్పుడూ యిలాంటి ప్రశాంత వాతావరణమే యిష్టం.

ఆకాశంలో చంద్రుడ్నీ, నక్షత్రాల్నీ చూస్తూ, చల్లని గాలి వీస్తోంటే, ఇక్కడ ఈ చక్కని పల్లెటూళ్లో ఎంతో హాయిగా వుంది!



ఇదే రాత్రి సమయంలో ఇంటి దగ్గరయితే గదిలో వేడి ఫాన్ మధ్య నిద్ర రాక తల్లడిల్లిపోతుందేదాన్ని!

ఏదో పక్షి వికృతంగా అరుస్తూ నా నెత్తిమీంచి వెళ్లింది, నేను భయంతో చటుక్కున లేచి కూర్చున్నాను.

అయిదు నిముషాలకుగానీ ఆ భయం నుండి తేరుకోలేకపోయాను. మళ్ళీ మంచం మీద పడుకోబోతుండగా—

"రాజీ! ఇంకా నిద్రపోలేదా?" అన్న బావ గొంతు విని తల త్రిప్పి చూశాను.

బావ మెట్లు దిగి వస్తున్నాడు.

"లేదు బావా! ఇప్పుడు పైమెంతయి వుంటుంది?"

"పదవుతుందేమో!"

"ఇంతేనా! ఈ పాటికి రోజూ యింట్లో అయితే ఇంకా చదువుకుంటూ వుంటాను...." అన్నాను.

బావ నా మంచం దగ్గిరికి వచ్చి నుంచున్నాడు. నుంచుని—


"రాజీ ఎలా వుంది మా వూరు?" అన్నాడు.

"ఏది ఇంకా పూర్తిగా చూడందే!" అని నవ్వాను.

బావ నిలబడి వుండటం చూసి — "కూర్చో బావా!" అన్నాను.

బావ మంచం పట్టి మీద కూర్చున్నాడు.

"రాజీ! నిన్ను చూసేంతవరకూ నువ్వొస్తావనే నమ్మకం కలగలేదు. స్టేషన్‌లో నిన్ను చూసి ఎంత సంతోషించానో తెలుసా?"



బావ అలా అనగానే స్టేషన్‌లోని దృశ్యం కళ్ల ముందు మెదిలింది. బావ వాళ్ళ వూళ్లో అయిదు నిమిషాల కంటె రైలు ఎక్కువ ఆగదన్నాడు. అందుకే నేను స్టేషన్ రాక ముందే లేచి డోర్ దగ్గిర నిలబడ్డాను. స్టేషన్‌లో రైలు ఆగగానే బావ ఎలా చూశాడో, ఎప్పుడు చూశాడోగానీ నా దగ్గిరికి పరిగెట్టుకు వచ్చి, నా చేతిని మృదువుగా పట్టుకుని, నా ముఖంలోకి చూస్తూ —

"వచ్చావా రాజీ!" అన్నాడు.

ఆ క్షణంలో బావ ముఖంలో కనిపించిన ఆనందం, వుత్సాహం, ఆ కళ్ళల్లో మెరుపు నా జన్మలో మరిచిపోలేను.

నేను రాకపోతే బావ ఎంత బాధపడి వుండే వాడో?

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ బావ -

"రాజీ! ఇక్కడ ఏ బెరుకూ లేకుండా మీ యింట్లో వున్నట్లే వుండు. నీకేం కావాలన్నా మొహమాట పడకుండా నన్నడుగు. అడుగుతావు కదూ!" అన్నాడు.

బావ ఆప్యాయతకి నా మనస్సు అదోలా అయి పోయింది. నేను అలాగేనంటూ తలూపాను.

తర్వాత బావ ఏం మాట్లాడలేదు.

ఇద్దరం మౌనంగా కూర్చున్నాం.

చల్లటిగాలి మమ్మల్ని పరామర్శించి వెళ్లింది. గాలి విసురుకి పైనుంచి నామీద ఏదో రాలింది.

ఒక్కసారి పరిసరాలు వింత సువాసనతో గుప్పుమన్నాయి.

"ఎక్కడినుంచి బావా! ఇంత మంచి వాసన వస్తోంది."

బావ పక్క మీద రాలిన పూలనే వాసన చూస్తూ —

"పొగడ పూలు రాజీ! వాసన చూడు" అంటూ తన చేతిలోని పూలను నా చేతిలో పోశాడు.

నేను వాసన చూశాను. నిజంగానే బావుంది.

చేతిలో వున్న పూలనే వాసన చూస్తూ కూర్చున్నాను.

ప్రయాణపు బడలిక, దానికితోడు చల్లటిగాలి, మత్తెక్కించే సువాసన, కళ్లు మూతలు పడు తున్నాయి. ఆవలించాను.

బావ నన్ను చూసి — "రాజీ! నిద్ర వస్తున్న ట్టుంది పడుకో!" అన్నాడు తను లేస్తూ.

నేను మంచం మీద పడుకున్నాను.

బావ నా కాళ్ళ దగ్గిర పడి వున్న దుప్పటితీసి నాకు కప్పుతూ —

"రాజీ! నేనీ పక్కనే పడుకుంటాను. నీకేం భయం లేదు. ఏదన్నా అవసరమైతే లేపు" అన్నాడు.

నేను పక్కకు తిరిగి చూశాను. నాకు కొద్ది దూరంలో మంచం, పక్క కనబడింది. అత్తయ్య లోపల పడుకున్నట్టుంది.

"చలేస్తుంటే చెప్పు లోపల వేస్తాను మంచం" అన్నాడు.

"ఉహూ! నాకిక్కడే బాగుంది పడుకుంటాను" అని కళ్లు మూసుకున్నాను.

*

నేను మళ్లీ కళ్లు తెరిచేసరికి పక్షులు ప్రభాత సేవికలు పాడుతున్నాయి. దొడ్లోంచి పశువుల అరుపులు వినిపిస్తున్నాయి. చలిగా అన్పించి కాళ్ళ

## లోకజ్ఞానం

1. ప్రపంచంలో అత్యధికంగా తేయాకు పంట పండే దేశం ఏది ?

2. సింధునాగరికత గురించిన తవ్వకాలు మొట్టమొదట ఎప్పుడు ప్రారంభ మయ్యాయి? సింధునాగరికత సమయంలోని ప్రజలకు తెలియని లోహం ఏది ?

3. మన దేశంలో రాష్ట్రాలు కాకుండా కేంద్రపాలిత ప్రాంతాలు కూడా వున్నట్లు మీకు తెలుసు. ఐతే ఈ కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకే ఒక్క ప్రాంతానికి ఉన్నత న్యాయస్థానం వున్నది. మరో ప్రాంతానికి అసలు ఉన్నత న్యాయస్థానమంటు లేనేలేదు. ఆ ప్రాంతాలు ఏవి ?

4. మాస్కోలో జరగనున్న ఒలింపిక్ హాకీ పోటీలలో స్త్రీల విభాగంలో పాల్గొనేందుకు ఆరు దేశాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఎన్నిక చేసింది. ఆ దేశాలు ఏవి ?

5. ప్రపంచం మొత్తం మీద గత సంవత్సరం మన దేశంలోనే అత్యధిక సంఖ్యలో చలనచిత్రాలు నిర్మించబడ్డాయి. మరి మన దేశంలోని ఏ భాషలో గత సంవత్సరం ఎక్కువ చిత్రాలు వచ్చాయో చెప్పగలరా ?

6. ఈ మధ్య మన దేశానికి చెందిన ఒక యువకుడు డెబ్బైరెండు గంటలసేపు ఒక గాజు గదిలో పాములతో వుండి ప్రపంచరికార్డు నెలకొల్పాడు. అతని పేరేమిటి ? ఎన్ని పాములతో అతనా గదిలో వున్నాడు ?

7. 'అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా'ని ఎవరు నియమిస్తారు ?

8. పెరు, ఓమన్, మొరాకో, మారిషియస్, లిబియా, ఫిన్‌లాండ్ రాజధానీ నగరాలు ఏవి ?

9. ప్రపంచంలో కల్లా అతి పురాతనమైన వ్యాపారసంస్థ ఏదో చెప్పగలరా ?

10. ప్రపంచంలో కల్లా లోతైన సరస్సు ఏది ?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి]

దగ్గిర వున్న దుప్పటి తీసుకుని గుండెలవరకూ కప్పుకున్నాను.

తెల్లటి వెలుగు మూలమూలలా వ్యాపించి అక్కడ వున్న చీకటిని తరిమి తరిమి కొడ్తోంది. ఆ వాతావరణం ఎంతో అద్భుతంగా వుంది!

మా ఇంట్లో ఇంత తొందరగా ఎప్పుడూ లేవ లేదు. రోజూ సూర్యుడొచ్చి నన్ను లేపాల్సిందే! పరీక్షలు వచ్చినప్పుడు మాత్రం రాత్రి పూట ఎక్కువసేపు చదువుకుంటూ వుండేదాన్ని.

అది చూసి అమ్మ 'రాత్రి త్వరగా పడుకుని తెల్లవారుఝామున లేచి చదువుకోరాదుటే! అప్పుడయితే చదువు వంటబడుతుంది'' అనేది.

- కాని నేను రాత్రి ఎంతసేపైనా మేలుకునేదాన్ని గానీ పొద్దున మాత్రం లేచేదాన్ని కాను.

ఇప్పుడనిపిస్తోంది. ఉషోదయం ఇంత బాగుంటుందని తెలిస్తే రోజూ లేచేదాన్ని కదా అని!

''రాజీ! లేచావా!''

పక్కకు తిరిగి చూశాను. బావ తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ వచ్చాడు. నేను లేచి కూర్చుని—''ఆ! మీ వూరు లేపేసింది బావా! నన్ను.'' అన్నాను నవ్వుతూ.

''మా వూరు-మనుషులకు మంచి అలవాట్లే నేర్పుతుందిలే'' అని బావ కర్ర తీసుకుని ఏదో చెట్టుకొమ్మ వంచుతున్నాడు.

''ఏమిటి బావా! అది'' అన్నాను.

''ఇదా! పళ్లు తోముకునే పుల్ల'' అంటూ కొమ్మకి వున్న ఆకుల్ని తీసేసి నోట్లో పెట్టుకున్నాడు. నాకు నా పెట్టెలో వున్న పేస్టు, బ్రెష్ జ్ఞాపకం వచ్చాయి. నేను వచ్చింది పల్లెటూరికి కాబట్టి నాకూ పల్లెటూరి వస్తువులే వుపయోగించాలనిపించింది.

''నాకోటివ్వు'' అన్నాను.

బావ నావేపు తిరిగి, ''ఓ యస్ అంతకన్నానా!'' అంటూ కోసిచ్చాడు. బావ చేసినట్లే నేనూ ఆ పుల్లని నోట్లో పెట్టుకుని నమిలాను. నోరంతా చేదయింది.

''అబ్బ! చేదుగా వుంది బావా!'' అన్నాను.

''చేదుగా వుంటేనే మంచిది. ఆ పుల్లతో పళ్లు తోమితే నీకు అరవై ఏళ్ళొచ్చినా పళ్లు వూడవ్'' అంటూ దొడ్లో నుయ్యి దగ్గిరికి వెళ్లాడు.

నేనూ బావ వెనకాలే వెళ్లి ఎలాగో అవస్థ పడుతూ ముఖం కడిగాననిపించాను. బావ ముఖం కడిగి నూతిలోంచి నీళ్ళు తోడుకుని మీద పోసుకో సాగాడు.

''ఇదేమిటి ఇక్కడేనా!'' అన్నాను ఆశ్చర్యంగా.

''నాకిది అలవాటే.''

బావ అలా స్నానం చేస్తోంటే నాకే సిగ్గనిపించింది, లోపలకు వెళ్ళాను.

వంటింట్లో అత్తయ్య మజ్జిగ అనుకుంటా చిలుకుతోంది.

నన్ను చూడగానే పని ఆపి ''రాజీ! లేచావా!'' అంది.

''ఆ! లేవడమేమిటి! ముఖం కూడా కడిగేశాను'' అన్నాను ఏదో ఘనకార్యం చేసినట్లు.

''అలా కూర్చో'' అని పీట వాల్చింది.

నేను కూర్చున్నాను.

అత్తయ్య పొయ్యి దగ్గిరికి వెళ్లి గిన్నెలోని పాలు గ్లాసులోకి ఒంపి పంచదార వేసి తెచ్చిచ్చింది.

నేను గ్లాసు అందుకుని కొద్దికొద్దిగా తాగుతున్నాను.

''పంచదార సరిపోయిందా రాజీ!'' అంది అత్తయ్య.

''ఆఁ'' అన్నాను.

ఇంతలో బావ పంచ, చొక్కా వేసుకుని లోపలకువచ్చి పీట వేసుకుని కూర్చున్నాడు.

అత్తయ్య అతని ముందు గిన్నె వుంచింది. బావ దాన్లో వున్న పెరుగూ అన్నం తినసాగాడు. అది చూసి నేను—

"పొద్దున్నే పెరుగు అన్నమా! ఎలా సహిస్తుంది బావా!" అన్నాను.

బావ తలెత్తి నావేపు చూశాడు. "ఎందుకు సహించదు! మీలా నాజూగ్గా తిని హాయిగా కుర్చీలో కాలు మీద కాలు వేసుకుని కూర్చోడం కాదుగా మా పని. ఎండలో చెమటలు కక్కు-కుంటూ పొలంలో పని చెయ్యాలి. కాఫీ తాగి వెళితే అరగంటకే సొమ్మొచ్చి పడతాను. ఇది తింటే ఒంటి గంటవరకూ పని చెయ్యొచ్చు" అన్నాడు బావ ముద్దలు మింగుతూ.

"రాత్రే పాలలో అన్నం వేసి తోడుపెడతాను! అదే తిని వెడతాడు" అంది అత్తయ్య.

నేను పాలు తాగి గ్లాసు కింద పెట్టాను. బావ కూడా అన్నం తినటం ముగించి చెయ్యి కడుక్కో-డానికి దొడ్లోకి వెళ్లాడు.

"అత్తయ్యా! బావ ఇప్పుడు పొలానికి వెడుతున్నాడా?"

"ఆఁ"

"నేనూ వెడతానత్తయ్యా వూరు చూస్తాను."

అత్తయ్య నవ్వింది "పల్లెటూరు చూసేదేముంటుందే?"

"పోనీ అది తెలుసుకోడానికైనా వెడతాను" అన్నాను

బావ లోపలకు వచ్చాడు.

"ఎక్కడికి రాజీ వెళ్లేది"

"రాజీ నీతో వచ్చి వూరు చూస్తుందిట"

బావ హేళనగా ఏదైనా అంటాడేమోనని ఎదురు చూస్తున్న నాకు—

"అలాగే రాజీ! చూద్దువు గానీ, కాని ఇప్పుడు కాదు. సాయంత్రం పాలేరుని పంపుతాను వాడితో పాటు రా!" అనడం చెప్పరాని ఆశ్చర్యాన్ని కలిగించింది!

వెంటనే నేను—

"అలాగే బావా! వస్తాను" అన్నాను వుత్సాహంగా. బావ చెప్పులు వేసుకుని "వస్తానమ్మా మధ్యాహ్నం భోజనం అక్కడికే పంపు" అని, 'వస్తా రాజీ!' అంటూ నా వైపు ఒకసారి చూసి బయటికి నడిచాడు.

"బావా! సాయంత్రం పాలేరుని పంపడం మర్చిపోకు."

నేను బావకు మళ్లీ గుర్తు చేశాను.

బావ నవ్వి "మర్చిపోను" అని వెళ్లిపోయాడు.

అత్తయ్య కత్తి పీట ముందేసుకుని కూరలు తరుగుతోంది.

రోజూ ఇంట్లో ఈపాటికి కాలేజీకెళ్ళే హడావుడిలో మునిగి వుంటాను. సెలవు రోజైతే ఏ ఫ్రెండింటికో, సావిత్రి ఇంటికో వెడతాను. ఇక్కడ అటువంటిదేమీ లేదు. పైగా ఇంత ఇంట్లో ఒక్కదాన్ని ఏం తోచడం లేదు!

"అత్తయ్యా! నేనూ కూరలు తరగనా!"

అత్తయ్య తలెత్తింది.

"ఇంకా నయమే! నువ్వు తరగడమేమిటి? హాయిగా కూర్చో" అంది.

వూరికే కూర్చుంటే అసలు తోచదు నాకు.

"ఇప్పుడే వస్తా" అని లేచి దొడ్లోకి వచ్చాను.

సూర్యుడు ఆకాశ వీధిలోకి చరచరా వచ్చేస్తున్నాడు.

నిన్న సరిగ్గా చూడలేదు గానీ దొడ్డి చాలా





# "లోధ్ర" టానిక్ వనితలకు మాత్రం!

ప్రకృతి సిద్ధమైన పద్ధతి ద్వారా ఆరోగ్యంగా ఉండడానికి
నెలలో ప్రతిరోజూ బాధలేని రోజుగా గడపడానికి
"లోధ్ర" టానిక్ తీసుకోండి! ఏ బాధా లేకుండా ఆరోగ్య
మయమైన జీవితాన్ని గడపండి.

78 సంవత్సరాల నుంచీ స్త్రీల విశ్వాసానికి
పాత్రమైన టానిక్.
"లోధ్ర" మందుల షాపులలో దొరుకుతుంది.

Sistas

ఉచితమైన వైద్య సలహాలకు క్రింది చిరునామాకు ఈ కూపనును
పూర్తిచేసి, మీ ఉత్తరంతోబాటు జతచేసి పంపండి.

పేరు : ____________

చిరునామా : ____________

____________

____________ PIN ____________

కేసరి కుటీరం (ప్రై) లిమిటెడ్

27, వెస్ట్‌కాట్ రోడ్, రాయపేట, మద్రాసు-600 014

ఏజంట్లు : శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్, విజయవాడ, సికింద్రాబాదు.

విశాలంగా వుంది. పచ్చని మొక్కలతో కళకళ లాడుతోంది. నూతి దగ్గిర్నించి ప్రతి మొక్క దగ్గరకు కాలువలు తవ్వి వున్నాయి.

నాకు మొక్కలంటే చాలా ఇష్టం. కాని మా ఇంట్లో మొక్కలు పెట్టుకునేందుకు అసలు స్థలం లేదు. నేనే సరదాగా తొట్లల్లో మొక్కలు పెట్టి పెంచేదాన్ని. ఇప్పుడు ఇన్ని మొక్కల్ని చూడ గానే ఎంతో వుత్సాహం కలిగింది. కాసేపు ఆ మొక్కల మధ్య తిరిగాను.

పూల మొక్కల కన్నా కాయగూరల మొక్కలే ఎక్కువగా వున్నాయి. ఆ తర్వాత నూతి దగ్గిరికి వచ్చి బక్కెట్‌తో నీళ్లు తోడి కాలవలో పోయ సాగాను. నీళ్లు కాలవ వెంబడే జలజలా ప్రవహించి మొక్కల్లోకి వెడుతున్నాయి. అవి అలా వెడుతూంటే నాకు బలే సరదాగా అనిపించింది.

అలా ఎంతసేపు పోశానో!

"అమ్మాయిగారూ! మీరు పోస్తున్నారేటండీ"

ఆ మాటకి తలెత్తి చూశాను ఎదురుగా పన్నెండేళ్ల కుర్రాడు నిలబడి వున్నాడు.

"మీరు లెగండి! నేను పోత్తాను"

"ఫరవాలేదులే"

"ఇంకా నయం! లెగండి! అమ్మగారు చూత్తే నన్ను తిట్టేస్తారు." అంటూ వాడు నా దగ్గిరికి వచ్చి తాడు లాక్కున్నాడు.

నేను చేసేదిలేక బక్కెట్ వాడికిచ్చి అక్కడి నుంచి కదిలి లోపలికొచ్చాను.

అత్తయ్య నన్ను చూసి—

"దొడ్లో ఏం చేస్తున్నావే రాజీ!" అన్నది.

"మొక్కలు చూస్తున్నానత్తయ్యా!"

"జడ వేస్తాను రా! వేడి నీళ్ళు పెట్టాను స్నానం చేద్దువు గానీ"

—"ఇంత ఎండగా వుంటే వేడి నీళ్ళు ఎందుకు అత్తయ్యా!"

"ఇంకా నయం చన్నీళ్ళతో చేస్తావేమిటి? జలుబు చేస్తుంది"

అత్తయ్య హాల్లోకి నడిచింది.

నేనూ అత్తయ్య వెనకే వెళ్లాను. అత్తయ్య హాల్లో బల్ల మీద కూర్చుంది.

"నేను వేసుకుంటాలే అత్తయ్యా!"

"ఏం! నేను బాగా వెయ్యననా!" అన్నది అత్తయ్య నవ్వుతూ.

"అబ్బే! నీకు శ్రమని...."

"మేనకోడలికి జడ వెయ్యడం కూడా శ్రమేనా! రా! రా!" అంది.

నేను వెళ్లి అత్తయ్య ముందు కూర్చున్నాను. అత్తయ్య నా జడ విప్పి నూనె రాయసాగింది.

"రాజీ, ఒకటడగనా!"

"అడుగు అత్తయ్యా!"

"మీ నాన్న నన్ను ఎప్పుడైనా తలుస్తాడా!"

ఆ ప్రశ్న వెనకాల వున్న ఆరాటాన్ని గ్రహించాను. అయితే జవాబు ఏం చెప్పాలి? నాన్నగారు ఇంతవరకూ ఒక్కసారి కూడా అత్తయ్య పేరు ఎత్తలేదు. నాన్నగారు ఏ విషయంలోనైనా పట్టుదల పట్టారంటే ఆయన్ని ఆ దేవుడు కూడా మార్చలేడు. అదంతా అత్తయ్యకి చెప్పి ఆవిడ మనసు కష్టపెట్టదలచుకోలేదు.

"ఆ నిన్ను ఎప్పుడు తలుస్తూనే వుంటారత్తయ్యా! అనవసరంగా కలతలొచ్చాయని బాధ పడుతుంటారు" అన్నాను.

అత్తయ్య ఆ మాటకి సంతోషపడిపోయింది.

"నాకు తెలుసు రాజీ! అన్నయ్య మనసు వెన్నముద్ద. ఆ రోజు కోపంలో నన్ను తిట్టడం గానీ తరువాత మనసులో బాధపడి వుంటాడు. అయినా నన్ను గూర్చి అంతగా అనుకునేవాడు ఒక్కసారి రమ్మని రాయకూడదూ? కనీసం ఆయన పోయారని వుత్తరం రాసినప్పుడైనా సమాధానం రాయలేదు."

ఈ ప్రశ్నలకు నేనేం జవాబు చెప్పను!

"ఏమో అత్తయ్యా! ఎందుకు రాయలేదో! అయినా రోజుకొక్కసారైనా నిన్ను తలుచుకోక మానరు" అన్నాను.

అబద్ధాలు ఎంత తియ్యగా వుంటాయి.

"పోనీలే తల్లీ! మనసులోనైనా ఆ మాత్రం అభిమానం వుంటే చాలు!"

క్షణం ఆగి అంది. "రాజీ! ప్రసాద్ నీ గురించి చెప్తోంటే నిన్ను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఎంత ఆరాటపడ్డానో తెలుసా?"

### వి. విజయలక్ష్మి



భగవంతుని లీలలు అర్థంచేసుకోవడం కష్టతరం. ఆయన దయామయుడంటారు. కాని కొంత మంది వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చూస్తాడు. అయితే అందులో కొంతమందిని — ఇంకొక రకంగా కనికరిస్తాడు.

పర్లాకిమిడి వాస్తవ్యురాలు కుమారి వెల్లంకి విజయలక్ష్మికి-రెండు కాళ్ళు ఉన్నాయి కాని ఆమె నడవలేదు. భూమి మీద కాళ్ళు మోపలేదు. ఎక్కడకైనా వెళ్ళాలంటే-ఎత్తుకుని తీసుకుని వెళ్ళ వలసినదే. 18 సంవత్సరాల వయస్సు గల విజయలక్ష్మికి కాళ్ళు లేకపోయినా దేవుడు చక్కటి కంఠమిచ్చాడు. మాధుర్యమైన గాత్రంతో ఆమె పాడుతూంటే శ్రోతలు పరవశులవుతారు. లలిత సంగీతంలో ఆమె అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తుంది. ఈమధ్య పలాసలో ఏర్పాటు చేయబడిన లలిత సంగీత పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్నది. హైద్రాబాద్‌లో వంశీ ఆర్ట్స్‌వారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన రాష్ట్ర స్థాయి లలిత సంగీత పోటీల్లో రెండవ బహుమతి పుచ్చుకున్నది. అంతకు ముందు, ప్రఖ్యాత కళా సంస్థల దగ్గర అనేక బహుమతులు అందుకున్నది ఆమె.

ఈమధ్య రాజమండ్రిలో గౌతమీ కల్చరల్ అసోసియేషన్ వారు నిర్వహించిన సభలో హిందీ పాట అమోఘంగా పాడినందుకు ఆమెకు బంగారు పతకం బహూకరింపబడింది!

విజయలక్ష్మి తండ్రి శ్రీ వి. రాఘవేంద్రరావు పర్లాకిమిడిలో న్యాయవాద వృత్తిలో వుంటున్నారు.

కాళ్ళు లేని కళామతల్లికి దిగులు లేదు-చింత లేదు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది-"ఒక చేతితో దేవుడు నాకు శాపం యిచ్చాడు-మరొక చేతితో ఆశీర్వదించాడు" అంటుంది – తన కంఠాన్ని నమ్ముకుని తన కాళ్ళ మీద నిలబడగలుగుతున్న విజయలక్ష్మి. —టి.వి.

నేను వచ్చిన తర్వాత అత్తయ్య ఈ మాట చాలాసార్లు అంది.

అత్తయ్య నన్ను ఎలా చూస్తుందో! నాన్నగారి మీద వున్న కోపం నా మీద చూపెడుతుందా? లేక నాతో మామూలుగా మాట్లాడుతుందా, ఇలా వూహించుకుంటూ వచ్చాను.

కాని అత్తయ్య యింత వెర్రి అభిమానం చూపిస్తుందని కలలో కూడా వూహించలేదు.

అత్తయ్య జడ వెయ్యడం పూర్తి చేసింది.

"ఎలా వుందో చూసుకో" అంటూ అద్దం అందించింది.

అద్దంలో చూసుకున్నాను.

"చాలా బాగా వేశావు అత్తయ్యా!"

"నీకు నచ్చింది కదా! అంతే చాలు! వెళ్ళి స్నానం చేసిరా" అంది.

నేను పెట్లోంచి బట్టలు తీసుకుని స్నానం చేసి వచ్చాను.

అత్తయ్య నన్ను చూసి, "అన్నం తింటావా రాజీ!" అంది.

నా వాచీలో టైము చూశాను.

తొమ్మిదయింది.

"ఇప్పుడేం భోజనం అత్తయ్యా! కాస్సేపాగి చేస్తాలే!"

"సరే నీ యిష్టం. బావ గదిలో బొమ్మల పుస్తకాలుంటాయి. చూస్తూ కూర్చో. నేను బట్టలు వుతుక్కు వస్తాను" అంది.

నేను "అలాగే" అన్నాను.

ముఖాన పౌడరు రాసుకుని బొట్టు పెట్టుకుని బావ గదిలోకి అడుగు పెట్టాను.

గది నీట్‌గా వుంది. కిటికీవారగా మంచం, దానిమీద పరుపు, పరుపు మీద తెల్లని దుప్పటి. ఒక మూలగా రెండు కుర్చీలు వాటిముందు టేబిల్.

టేబిల్ దగ్గిరగా పెద్ద రాక్. దాన్నిండా రకరకాల పుస్తకాలు. నేను దాని దగ్గిరగా వెళ్ళి ఆ పుస్తకాల పేర్లు చదివి ఆశ్చర్యపోయాను.

ప్రసిద్ధ రచయితల పుస్తకాలన్నీ వున్నాయి. బావ ఇన్ని పుస్తకాలు చదివాడా! రాక్ పైన సగం తెలుగు పుస్తకాలు, కిందివి ఇంగ్లీషు పుస్తకాలు.

ఒక ఇంగ్లీషు పుస్తకం తీసి పేజీలు తిప్పాను. పుస్తకంలో వాక్యాలు అక్కడక్కడ అండర్‌లైన్ చేసి వున్నాయి. ఆ వాక్యాలు చదివాను. చిన్నప్పటి నుంచీ కాన్వెంట్‌లో చదివిన నాకే అవి అర్థం కాలేదు. బావ అవన్నీ చదివి అండర్‌లైన్ చేశాడంటే బావకి చాలా బాగా ఇంగ్లీషు వచ్చి వుంటుంది.

బావని ఇంతవరకూ ఏదో సామాన్య చదువు చదివిన పల్లెటూరి వ్యక్తిగానే అంచనా వేశాను. ఆ పుస్తకాలు చూడగానే బావ మీద గౌరవం రెట్టింపయింది. ఒక నవల పుచ్చుకుని మంచం మీద వాలాను.

మళ్ళీ అత్తయ్య భోజనానికి పిలిచేవరకూ అలా చదువుతూనే వున్నాను.

పుస్తకాలంటే నాకు విపరీతమైన పిచ్చి. అవుంటే అన్నం, నీళ్ళూ అక్కర్లేదు.

అత్తయ్య పిలిచేసరికి అక్కడ పెట్టి లేచి వెళ్ళాను.

అత్తయ్య కంచంలో అన్నం పెట్టింది.

"నువు తినవా అత్తయ్యా!"

"ఇదిగో ప్రసాద్‌కి అన్నం పంపి తింటాను. ఇంకా పాలేరు రాలేదు. నువు కానీ" అంది నెయ్యి వడ్డిస్తూ.

నేను భోజనం మొదలు పెట్టాను. "వాడికి మల్లే నీకూ పుస్తకాలూ పిచ్చేమిటే! రెండుసార్లు పిలిస్తేగానీ పలకలేదు" అంది అత్తయ్య.

"బావ కూడా బాగా చదువుతాడా! అత్తయ్యా!"

"ఆఁ! రాత్రి పన్నెండు, ఒంటి గంటవరకూ చదువుతూనే వుంటాడు. 'పగలల్లా పనిచేసి వచ్చావ్. త్వరగా పడుకోకూడదూ' అని అంటే నవ్వి వూరుకుంటాడు. ఏమిటో! ఎలాగో వీడితో" అని అత్తయ్య అంటుంటే నేను ఆశ్చర్యపోయాను.

భోజనం చేసి మళ్ళీ పుస్తకం పుచ్చుకుని కూర్చున్నాను. చదువుతూ, చదువుతూనే ఎప్పుడో నిద్రపోయాను.

"రాజీ! అమ్మా రాజీ! లేలే!" అత్తయ్య లేపుతుంటే మెలకువ వచ్చింది.

చటుక్కున లేచి కూర్చున్నాను.

బయట ఎండ తగ్గినట్లుంది. లోపల కొద్దిగా చీకటిగా వుంది. అయితే నేను చాలాసేపే పడుకున్నానన్నమాట!

"ప్రసాదు పాలేరుని పంపాడు వెడతావా?" అంది అత్తయ్య.

బావ జ్ఞాపకం వుంచుకుని పంపాడే! అనుకుని "వెళ్తాను అత్తయ్యా" అన్నాను.

"అయితే ముఖం కడుక్కో కాఫీ తెస్తాను" అంది.

నేను పావుగంటలో తయారయ్యాను. వెళ్ళేటప్పుడు అత్తయ్య ఎన్నో జాగ్రత్తలు చెప్పింది.

నేను అన్నిటికీ తలూపి పాలేరు వెంట నడిచాను.

చుట్టూ చూస్తూ వుషారుగా నడుస్తున్న నేను దభాలున గోతిలో పడబోయి నిలదొక్కుకున్నాను అది చూసి—

"జాగ్రత్తగా నడవండమ్మా అన్నీ గోతులు" అన్నాడు పాలేరు.

హైహీల్స్ వేసుకొచ్చినందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

పరిసరాల్ని చూస్తూ సరదాగా నడవచ్చని బయలుదేరాను.

కింద గోతులే కాదు. చెత్తా చెదారం పేడ, వీటిలో అస్పష్టంగా వుంది. పల్లెటూరు ఎంతో అందంగా వుంటుందని చదివాను. కాని ఈ మట్టి రోడ్డెంతో అధ్వాన్నంగా వుంది. చీర పైకెత్తి పట్టుకుని అవన్నీ దాటుకుంటూ నడిచేటప్పటికి ప్రాణం పోయినంత పనయింది.

చీర వెనక మురికినీళ్ళు అంటుకుని చీరంతా పాడయింది. విసుక్కుంటూ నడుస్తున్నాను.

"అమ్మాయిగారూ! అదుగోనండీ! అయ్యగారు" అన్నాడు పాలేరు.

నేను తలెత్తి చూశాను. ఎదురుగా పొలంలో బావ ఏదో పని చేస్తున్నాడు.

నేనా గట్టుమీదే కూర్చున్నాను.

పాలేరు వెళ్ళి బావతో నేను వచ్చినట్లు చెప్పినట్టున్నాడు. బావ నావేపు చూసి చేతులు దులుపుకుంటూ నా దగ్గరికి వచ్చాడు.

"రాజీ! వచ్చావా!" అన్నాడు.

నేను బావ వేపు చూస్తున్నాను. ఆచ్ఛాదనలేని విశాలమైన వక్షస్థలం. పైకి ఎత్తి కట్టిన పంచ. ఒంటి మీద అక్కడక్కడ అంటుకున్న మన్ను. ముఖం మీద చిరుచెమట బావ రూపం అద్భుతంగా వుంది.

నేను తనవేపు చూట్టం చూసి సిగ్గుపడి గుండెల మీద చేతులు కట్టుకున్నాడు.

"ఏమిటీ! అలా చూస్తున్నావు నన్ను!"

అన్నాడు నవ్వుతూ.

నేనూ నవ్వుతూ ' నిన్ను కాదులే నీ వెనకవున్న సూర్యుడిని ' అన్నాను.

" ఓహో సూర్యుడిని చూడ్డానికా ఇంతదూరం వచ్చావు!"

" ఊహూ! నిన్ను చూడ్డానికే కానీ ఇక్కడి కొచ్చాకే సూర్యుడి అందాలు తెలిశాయి." అన్నాను నవ్వుతూ.

బావ నా పక్కన కూర్చున్నాడు. కూర్చుని —

" మా పల్లెటూరు బాగా మాటలు నేర్పిస్తోందే!" అన్నాడు.

" మాటలకేంగానీ చూడు నా బట్టలన్నీ కరాబు చేసింది " కాళ్ళు ఎత్తి పట్టి చీర చూపించాను.

బావ నొచ్చుకున్నాడు. " అయ్యో! ఎంత పని జరిగింది! దీనికి పరిహారంగా నీకో మంచి చీర కొనిస్తాలే " అన్నాడు.

" సరేగానీ! ఇదేనా మీ పొలం " అన్నాను చుట్టూ చూస్తూ.

" ఆ! ఇదే మొత్తం మూడెకరాలు. ఇవికాక ఒక ఎకరం మామిడితోట వుంది."

" పొలం నిండా మట్టి తప్ప మొక్కలు కన్పించవే "

ఆ మాటకు బావ ఫక్కున నవ్వాడు.

' ఇదేకాలం పిల్లా ' అన్నాడు వెటకారంగా.

" వేసవికాలం "

" ఇప్పుడు మట్టి కాక మొక్కలెలా వుంటాయి? వర్షాలుపడ్డాక గింజలేస్తాం మొక్కలొస్తాయి. ఈసారి కష్టపడి పండించి ఆ వచ్చే ఆదాయంలో ఇంకో ఎకరం కొనాలి ".

" పొలం పని కష్టమా బావా!"

" చెయ్యాలేకానీ ఏదీ కష్టం కాదు రాజీ! నీకు తెలీదు. జీవితంలో నేను ఇంతకన్నా ఎక్కువ కష్టాలేపడ్డాను. చేతిలో పైసా లేక, అందరిచేత మాటలుపడ్తూ ఎన్ని అవమానాలు పొందానో తెలుసా, డబ్బు లేకపోవడం వల్లనేకదా ఇన్ని బాధలు పడవలసివచ్చింది.

అప్పుడే అనుకున్నాను. నేనూ పెద్ద భూస్వామిని కావాలి. నన్ను తిట్టినవాళ్ళే నన్ను గౌరవించాలి. ఈ లక్ష్యంతోనే కృషి చేశాను. ఈనాటికి కొద్దిగా సాధించగలిగాను."

" అయితే బావా! ఈ పొలమంతా నువ్వు సంపాదించిందేనా!"

### లోకజ్ఞానం – సమాధానాలు

1. భారతదేశం.
2. క్రీ. శ. 1922 లో. సింధు ప్రజలకు తెలియని లోహం - ఇనుము.
3. ఢిల్లీ. ఢిల్లీకి మాత్రమే ఉన్నత న్యాయస్థానం వున్నది. గోవా, డయు, డమన్ ప్రాంతానికి ఉన్నత న్యాయస్థానమంటూ లేదు. అందుకు బదులుగా అక్కడ 'జూడీషియల్ కమీషనర్' ఆ వ్యవహారాలు చూసుకుంటూ వుంటారు. తతిమ్మా ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆయా రాష్ట్రాలలోని న్యాయస్థానాలువర్తిస్తాయి.
4. నెదర్లాండ్స్, పశ్చిమ జర్మనీ, అమెరికా, న్యూజిలాండ్, బ్రిటన్, సోవియట్ రష్యా.
5. తమిళం. ఆ భాషలో 140 చిత్రాలు విడుదలయ్యాయి. 133 తెలుగు చిత్రాలు, 131 మలయాళ చిత్రాలు, 114 హిందీ చిత్రాలు 1979 లో విడుదల అయ్యాయి. మొత్తం వివిధ భాషలలో కలిపి గత సంవత్సరం మన దేశంలో 714 చిత్రాలు విడుదలయ్యాయి.
6. నీలిమ్‌కుమార్ ఖైర్, పూనా వాస్తవ్యుడైన ఇరవైఎనిమిదేళ్ళ నీలిమ్‌కుమార్ పూనాలోని బి. జె. వైద్యకళాశాల క్రీడాస్థలంలో ప్రత్యేకంగా నిర్మించబడిన గాజు గదిలో వివిధ రకాలకు చెందిన 72 విష సర్పాలతో 72 గంటలసేపు గడిపి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. గతంలో దక్షిణ ఆఫ్రికాకు చెందిన పీటర్ స్నైమన్ 18 పాములతో 50 గంటలసేపు గడిపి నెలకొల్పిన రికార్డును నీలిమ్ కుమార్ ఖైర్ అధిగమించాడు.
7. రాష్ట్రపతి.
8. లిమా, మస్కాట్, రబత్, పోర్ట్‌లూయిస్, ట్రిపోలి, హెల్సింకి
9. ఇంగ్లండుకు చెందిన ఫావర్‌షామ్ ఆయిస్టర్ ఫిషరీ కంపెనీ. 1930 లో రూపొందించిన ఫావర్‌షామ్ ఆయిస్టర్ ఫిషింగ్ చట్టం ప్రకారం ఈ సంస్థ చాలాకాలం నుంచి అంటే క్రీ. శ. 1189 కి ముందు నుంచే తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లుగా వున్నది.
10. లేక్ బైకాల్ (రష్యా). ఈ సరస్సులోతు 6,365 అడుగులు. అంటే సముద్రమట్టంకన్న 4,872 అడుగులు క్రిందకి వున్నదన్నమాట.

" అవును రాజీ! నాన్న నేను పదిహేడేళ్ళ వయసులో వుండగా పోయారు. అప్పటికి మాకు ఒక ఎకరం పొలం మాత్రం వుంది. అదీ అప్పుల్లో వుంది.

" నాన్న పోయేనాటికి నేను కాలేజీలో చదువుతున్నాను. నాన్న పోయారని తెలీగానే ఇంటికి వచ్చాను. ఇంట్లో ఎవరూ లేరు. అమ్మ ఒక్కత్తే చీకట్లో నాన్న శవం ముందు కూర్చుని ఏడుస్తోంది. నేను వచ్చి బంధువులందరికీ టెలిగ్రాం ఇచ్చాను. కాని ఒక్కరూ రాలేదు. చేతిలో పైసా లేదు. ఏం చేయాలో — ఎక్కడికెళ్ళాలో తోచలేదు. వూరి పెద్దల సాయంతో ఎలాగో ఆ తతంగం పూర్తి చేశాను.

" కాని ఆ తర్వాత ఏం చెయ్యాలి? మండు టెండలో నడిరోడ్డు మీద నిలబడినట్టయింది. పొలం చూస్తే అప్పుల్లో వుంది. ఆదరించేవారు లేరు. కనీసం ధైర్యం చెప్పేవాళ్ళు కూడా లేకపోయారు. అమ్మ చూస్తే పుట్టెడు దుఃఖంలో వుంది. ఇక నన్ను నేనే ఓదార్చుకున్నాను. నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను.

" బంధువులందరూ ఈసడిస్తూ, హేళనచేస్తూ వుత్తరాలు రాశారు. ముఖ్యంగా మావయ్య ఎంత నిందిస్తూ రాశాడో తెలుసా రాజీ! అవన్నీ అమ్మకి చూపలేదు. ఇంకా బాధపడ్తుందని.

" నేనిక కాలేజీ చదువు మానేసి వ్యవసాయం మీద పడ్డాను.

" నిజంగా రాజీ! ఆ రోజుల్లో మానసికంగా నేనెంత బాధపడ్డానో మాటల్లో చెప్పలేను.

" సొంత వ్యవసాయం చేస్తూ సలహా కోసం పెద్దల్ని ఆశ్రయిస్తే వాళ్ళు సహాయం చెయ్యక పోగా నన్ను అవమానిస్తూ మాట్లాడేవారు. నేను చేసే ప్రతి పనికీ అడ్డు తగిలేవారు. అయినాసరే అన్నీ సహించాను. రాత్రీపగలూ కష్టపడి పని చేశాను. సంపాదించాను. పొలం మీది అప్పు తీర్చాను. పంట బాగా పండటంతో రెండెకరాల పొలం, ఒక ఎకరం మామిడితోట కొన్నాను. రాజీ! ఇప్పుడిలా పొలం కొన్నానని రెండు మాటల్లో చెప్తున్నానుగానీ—అప్పుడు నేను పడ్డ బాధ తల్చుకుంటే అది పగవాళ్ళకూడా వద్దనిపిస్తుంది."

బావ చూపులు పొలం మీద వున్నాయి. కొద్ది క్షణాలు ఆగి మళ్ళీ ఇలా అన్నాడు.

"రాజీ ఈ పొలాన్ని పదెకరాలు చెయ్యాలి. తోటని అయిదెకరాలు చెయ్యాలి. అదీ నా లక్ష్యం. ఈ లక్ష్యాన్ని నెరవేర్చగలననే అనుకుంటున్నాను."

బావ ముఖం మీద ఎర్రటి సూర్యకాంతులు. బావ చెప్తోంది ఆశ్చర్యంగా వింటున్నాను.

నా మనస్సులో బావ ఆకాశం అంత ఎత్తు ఎదిగాడు. జీవితంలో ఎదురైన కష్టాలను ఎదుర్కొని ధైర్యంగా నిలిచిన బావ ఒక మహా వ్యక్తిలా తోచాడు.

బావకి, అంత కష్టంలో కూడా 'సహాయం చెయ్యని నాన్నగారి మీద విపరీతమైన కోపం వచ్చింది.

ఆ క్షణంలో నాకు అన్పించింది "బావా! నువ్వు ధైర్యంగా వుండు. నేను నీకు తోడుగా, నీడగా వుండి నీ లక్ష్యసాధనలో తోడ్పడతాను" అని అనాలని.

కాని నేను చెప్పాలనుకున్న మాటను బావే అన్నాడు.

"రాజీ! నువ్విలా నా ప్రక్కనుంటే చాలు ఈ ప్రపంచాన్నే జయిస్తాను" అంటూ నా చేయి పట్టుకున్నాడు.

"వుంటాను బావా! తప్పక వుంటాను"

నా చేతిలో వున్న బావ చేతిని నొక్కుతూ అన్నాను.

ఇద్దరం మౌనంగా కూర్చున్నాం. నా మనస్సు భవిష్యత్తుని మార్చి వూహిస్తోంది. నేను బావ భార్యనై బావకి అండగా వుంటాను. బావా నేనూ ఈ పొలంలో కష్టపడి పనిచేస్తాం. బావని వెక్కిరించినవాళ్ళే బావని మెచ్చుకుంటారు. అప్పుడు బావ ఆనందంగా – "రాజీ! ఇదంతా నీ చలవే" అంటాడు.

బావ వేపు చూశాను.

బావ చూపు ఎక్కడో వుంది.

బహుశ బావ కూడా నాలాగే వూహిస్తున్నాడేమో!

ఊహ ఇంత మధురంగా వుంటే బావతో జీవితం ఇంకెంత మధురంగా వుంటుందో!

సంధ్యాకాంత చీకటికి భయపడి పారిపోతోంది.

ఆమె భయాన్ని చూసి చుక్కలు ఆకాశపు తలుపు చాటునుంచి తొంగిచూసి నవ్వుకుంటున్నాయి.

"అయ్యగారూ! కూరలు కోసేశానండీ".

పాలేరు మాటతో ఇద్దరం ఈ లోకంలోకి వచ్చాం.

"రాజీ! బాగా చీకటిపడింది. పద పోదాం. పొలాల్లో చీకటిపడ్డాక వుండటం ప్రమాదం!" అన్నాడు బావ లేస్తూ.

నేనూ లేచాను.

వూరంతా నిశ్శబ్దంగా వుంది. ఇళ్ళల్లోంచి గుడ్డి వెలుతురు తొంగి చూస్తోంది. వచ్చేటప్పుడులా కాక నేనెక్కడైనా పడిపోతే పట్టుకోడానికి బావ వున్నాడు. ఆ ధైర్యంతో గబగబా నడుస్తున్నాను. పది నిముషాల్లో ఇల్లు చేరుకున్నాం.

అత్తయ్య మా కోసం ఎదురుచూస్తూ వాకిట్లోనే నుంచుని వుంది.

"అమ్మయ్య! వచ్చారా! చీకటిపడింది. ఇంకా రాలేదేమిటా అని చూస్తున్నాను." అంది

పాలేరు కూరలబుట్ట అరుగు మీద పెట్టాడు. అత్తయ్య దానిని లోపలకు తీసికెళ్ళింది.

నేనూ లోపలికెళ్ళి స్నానం చేసి బట్టలు మార్చుకున్న తర్వాత బావా, నేనూ భోజనాలకి కూర్చున్నాం.

నాకి ఇంట్లో అంతా బాగానే వుంది గానీ రాత్రి పూట భోజనం చెయ్యాలంటేనే ప్రాణాంతకంగా వుంటోంది.

ఇక్కడ కింద కూచోడమైతే ఫర్వాలేదు సర్దుకో వచ్చు. కానీ గుడ్డిదీపం ముందు భోజనం చెయ్యాలంటేనే చాలా కష్టంగా అన్పించింది. లాంతరు వున్నా లేకున్నా ఒకటిగానే వుంది! కళ్ళు మూసుకుని తింటున్నట్టుగా వుంది. కంచంలో ఏం వున్నాయో లేవో కూడా తెలీకుండా వుంది. బావ మాత్రం చకచకా తినేస్తున్నాడు.

[సశేషం]

## మీనాదేవి



నాటకం ఒక కళ అయినట్లే అందులో రాణించి బాగా పేరుతెచ్చుకోవడం కూడా ఒక కళే. అలా పేరుతోబాటు పలు బహుమతులు కూడా తెచ్చుకున్న వనిత-కుమారి పి. మీనాదేవి. గత నాలుగు సంవత్సరాలుగా ఆమె ప్రఖ్యాత మోనో ఏక్టర్ డాక్టర్ చంద్రశేఖరంతో బాటు ఆంధ్రరాష్ట్రంలోనే కాక దేశంలోని పలు ప్రాంతాలలో నాటికలలో పాల్గొని ప్రముఖుల ప్రశంసలూ, బహుమతులు అందుకున్నారు.

నాటకాల్లో నటిస్తున్నా, చలనచిత్రాల్లో ప్రయత్నిస్తున్నా కూడా ఆమె తన విద్యాభ్యాసాన్ని మాత్రం విడనాడలేదు. ప్రస్తుతం ఆమె ప్రయివేటుగా బి.ఏ. చదువుతున్నారు.

రాజమండ్రిలో ఇంటర్మీడియేట్ వరకూ చదువుకున్న మీనాదేవి 1973లో మద్రాసు వచ్చి కి. శే. డాక్టర్ గాలి బాలసుందరరావుగారి మధుర కళానికేతన్ తరఫున-నాటకాలలో పాల్గొన్నారు. వాటిల్లో పేర్కొనదగినవి-ఆజ్ఞ, ఈ ఇల్లు అమ్మబడును, రక్తపిపాసి, విధి నిర్ణయం. ఈ నాటకాలలో అధికంగా ఆమె హాస్య పాత్రలనే పోషించారు. అప్పుడే ఆమె చెన్నపురి ఆంధ్ర మహాసభ నిర్వహించిన నాటక పోటీలలో ఉత్తమనటి బహుమతిని అందుకున్నారు. ఆ ప్రదర్శన తిలకించిన చంద్రశేఖరంగారు ఆమె నటన చూసి మెచ్చుకుని తన బృందంతో పాటు నాటకాలు వేయవలసిందిగా కోరారు. "నన్నొక నటిగా తీర్చిదిద్దిన ఖ్యాతి చంద్రశేఖరంగారికి దక్కుతుంది" అంటారు మీనాదేవి.

ఆ విధంగా ఆయనతోబాటు ఆమె–బలే పెళ్ళాం, దొంగాటకం, అపశ్రుతి, రిక్రియేషన్ క్లబ్ మొదలైన నాటకాల్లో పాల్గొన్నారు. అయితే ఆమెకు బాగాపేరు తెచ్చినవి-నిజం, బలే గండం, ఇల్లాలి ముచ్చట్లు ఏకపాత్రాభినయం. హాస్య పాత్రల్లో బాగా రాణిస్తున్న మీనాదేవికి కరుణారస పాత్రలు ధరించడం అంటే ఇష్టం. ప్రస్తుతం ఆమె నాలుగైదు తెలుగు చిత్రాలలోనూ, ఒక తమిళ చిత్రంలోనూ ప్రధాన భూమికలు ధరిస్తున్నారు.

అత్తయ్య నా అవస్థ గమనించినట్టుంది—

"ప్రసాద్! రేపు పెద్ద లైటు ఒకటి తెప్పించరా! రాజీ రాత్రిపూట అస్సలు భోజనమే చెయ్యడం లేదు" అన్నది.

బావ తలెత్తి చూశాడు. "అలాగా! ప్రొద్దున చెప్పకపోయావా అమ్మా! చౌదరిగారింట్లోంచి తెప్పించేవాడ్ని" అన్నాడు.

"ఫర్వాలేదులే బావా! అన్నిటికీ అలవాటు పడాలిగదా!" అన్నాను నవ్వుతూ.

నా మాటల్లో ఏం అర్థం స్ఫురించిందోగానీ బావ కళ్లు ఆ లైటు వెలుగులో తళుక్కుమనడం గమనించాను.

ఇద్దరం భోజనాలు పూర్తిచేసి లేచాం. అత్తయ్య ఇల్లు సర్దుకుంటోంది.

పాలేరు వాకిట్లో మంచాలు వేసి వెళ్ళాడు. నేను మంచం మీద కూర్చున్నాను.

బావ నా వెనక రాలేదు. ఏమయ్యాడా అనుకుంటూ చుట్టూ చూశాను.

బావ గదిలో లైటు వెలుగుతోంది. అంటే బావ చదువుకుంటున్నాడన్న మాట!

నాకు నిద్రరావడం లేదు. బావ ఏం చదువుతున్నాడో చూడాలన్పించింది. లేచి గదిలోకి వెళ్లాను. బావ గుడ్డిదీపం ముందే కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు.

నేను వెళ్ళి బావ కుర్చీ వెనకే నిలబడ్డాను. అయినా బావ గమనించలేదు.

బావ వీపు మీద నుంచి ముందుకు వంగి బావ చదివే పుస్తకాన్ని చూస్తున్నాను.

ఏదో ఇంగ్లీషు పుస్తకం. బావ చకచకా పేజీలు తిప్పుతున్నాడు. పుస్తకం చేత్తో పుచ్చుకుని హఠాత్తుగా బావ కుర్చీ వెనక్కి వాలాడు. ఆ వాలటంలో యాదాలాపంగా వున్నానేమో బావ తల నా కంఠం మధ్యలో ఆనింది.

ఈ హఠాత్సంఘటనకు బిత్తరపోయాను! ఏదో తత్తరపాటు కలిగింది. అతడి నుంచి తప్పుకోబోయాను. కాని బావ రెండు చేతులూ నా మెడ చుట్టూ వేసి ముందుకు తీసుకుని నా కళ్ళల్లోకి చూస్తూ—

"రాజీ!" అన్నాడు.

బావ స్పర్శ నరనరాల్లో విద్యుత్తు ప్రవహింపచేసింది. ఏదో వింత అనుభూతి శరీరాన్ని స్పందింపచేస్తోంది. ఇంతకు ముందు ఎప్పుడూ కలగని ఏదో హాయి మనస్సుని ఆవరించింది!

అలా ఎంతసేపు వున్నామో! ఇంతలో ఏదో శబ్దం అయింది.

నేను వులిక్కిపడ్డాను.

నా స్థితికి సిగ్గుపడి బావ చేతులు తప్పించుకుని వాకిట్లోకి పారిపోయాను.

మంచం మీద వాలి దుప్పటి ముసుగేసుకున్నాను.

*

బావ లేపుతుంటే మెలకువ వచ్చింది.

కళ్ళు విప్పి చూశాను. ఎర్రటి ఎండ మీద పడ్తోంది. ఛ! ఇదేమిటి ఇంతసేపు పడుకున్నాను. అనుకుని చటుక్కున లేచి కూర్చున్నాను.

బావ అప్పుడే అన్నిపనులూ కానిచ్చినట్టున్నాడు. పొలం వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. బావని చూడగానే రాత్రి సంఘటన జ్ఞాపకం వచ్చింది.

సిగ్గుతో శరీరం ముడుచుకుంది.

"రాజీ! సాయంత్రం తోటలోకి వెళ్దాం. పాలేరుని పంపుతాను. అతని వెంట వచ్చెయ్" అన్నాడు.

నేను తలూపాను.

బావ వెళ్లిపోయాడు.

నేను నా పనులు కానిచ్చి పూర్తి కాకుండా మిగిలిన నవలను చదువుతూ కూర్చున్నాను.

ఆ మధ్యాహ్నం పుస్తకం చదువుతుండగా అత్తయ్య వచ్చింది.

"రాజీ! పార్వతమ్మగారు వచ్చారు. నిన్ను చూస్తుందిట. ఒక్కసారి రామ్మా" అంది.

నేను తెల్లబోయాను. పార్వతమ్మ ఎవరు? ఆవిడకి నన్ను చూడాల్సిన పనేమిటో! బొత్తిగా అర్థం కాలేదు.

నాకు కొత్తవాళ్లతో మాట్లాడాలంటే బెరుకు. అసలు నేను ఇంట్లో వాళ్లతోనే అవసరానికి మించి మాట్లాడను! అది నా స్వభావం.

ఇక తెలీని వాళ్లతో ఏం మాట్లాడను! అందుకే నాకు చాలామంది గర్వం అనుకుంటూ వుంటారు. అయినా నేనేం చెయ్యగలను! నా స్వభావాన్ని మార్చుకోలేను గదా!



అయినా అత్తయ్య పిలిచింది కాబట్టి వెళ్ళాను.

హాల్లో ఇద్దరు ఆడవాళ్ళు కన్పించారు. ఒక పెద్దావిడ, ఇంకో అమ్మాయి.

ఆ పెద్దావిడే అనుకుంటా పార్వతమ్మగారు. నేను వచ్చి అత్తయ్య పక్క చాప మీద కూర్చున్నాను.

వాళ్లిద్దరూ నన్ను నఖశిఖ పర్యంతం పరీక్ష చేస్తున్నారు.

అది చూసి నేను మరీ కుంచించుకుపోయాను.

"నా మేనకోడలు రాజీ!" అని, "రాజీ ఈవిడ పార్వతమ్మగారని మనకు దూరపు చుట్టం. ఈ పిల్ల వారమ్మాయి శ్రీలక్ష్మి" అని పరిచయం చేసింది.

నేను నమస్కారం చేశాను.

"బాగుంది, బాగుంది" అంది ఆవిడ.

అవిడకి బాగున్నది ఏమిటో నాకర్థం కాలేదు.

నేను ఆ అమ్మాయివేపు చూస్తూ కూర్చున్నాను.

నా వయస్సే వుంటుంది. నల్లగా వుంది. అయినా కళగల ముఖం. తల్లీ కూతుళ్లిద్దరూ రకరకాల నగలు పెట్టుకున్నారు. అవేమిటో — వాటి పేర్లేమిటో—కూడా నాకు తెలీదు.

"ఏం చదువుతున్నావ్" అంది ఆవిడ.

చెప్పాను.

అమ్మా నాన్నగార్ల గూర్చి, అన్నయ్యల గూర్చి అడిగింది.

"మీ నాన్నగారే నిన్ను పంపారా" అంది. ఎందుకో ఈ ఆరాలన్నీ ఈవిడకి అనుకుని–

"అవును" అన్నాను.

ఆవిడింకేం ప్రశ్నలు వెయ్యాలా అని ఆలోచిస్తున్నట్టుంది.

"నువ్వేం చదువుతున్నావ్" అంటూ ఆ అమ్మాయిని పలకరించాను.

అందుకు పార్వతమ్మ —


"ఆ! ఆడపిల్లకు చదువెందుకు! మా అమ్మాయికి ఈ ఏడు చక్కటి సంబంధం చూసి ఎంత కట్నమైనా సరే ఇచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాం" అంది గర్వంగా.

ఆవిడ మాటలు నాకసహ్యాన్ని కలిగించాయి. చదువుకున్న పిల్లలకు పెళ్ళి అక్కర్లేదనేమో ఆవిడ వుద్దేశం.

ఆవిడకి అత్తయ్య జవాబు చెప్పింది.

"అలా అనకండి! ఆడపిల్లేమిటి! మగవాడేమిటి! అందరూ చదవాలి. చదువు ఒంట బట్టకపోతే పెళ్ళి ఎలాగూ తప్పదుగదా" అంది.

శ్రీలక్ష్మి సెవెన్త్ క్లాస్ అయిదుసార్లు తప్పితే ఇక ఆ పిల్లకు చదువురాదని మాన్పించారుట. ఆ సంగతి అత్తయ్య తర్వాత చెప్పింది.



పెద్ద కథ

# ఈ దీపం ఆరిపోదు

విన్నకోట సుశీలాదేవి

ఆ మాటలతో ఆవిడ ముఖం మాడిపోయింది.

కొన్ని క్షణాల తర్వాత నా వేపు చూస్తూ—

"ఎన్ని రోజులుంటావ్ అమ్మడూ" అంది.

దానికి అత్తయ్యే జవాబు చెప్పి వూరుకుంది.

ఆవిడ నన్నే గుచ్చి గుచ్చి చూస్తోంది. ఆవిడ చూపులు వెగటు కల్గిస్తున్నాయి.

అత్తయ్య నన్ను చూస్తూ – "రాజీ! నువ్వు, శ్రీలక్ష్మి కలిసి దొడ్లో మల్లె మొగ్గలున్నాయి కొయ్యండి" అంటూ అక్కడినుంచి పంపింది.

నేను హాయిగా వూపిరి పీల్చుకుని లేచాను. శ్రీలక్ష్మి కూడా లేచి నావెంట వచ్చింది.

ఇద్దరం దొడ్లో వున్న మల్లెపందిరి దగ్గిరి కెళ్ళాం. నేను కొంగులోకి మొగ్గలు కోస్తున్నాను.

హఠాత్తుగా శ్రీలక్ష్మి అంది – "నువు చాలా బాగుంటావు రాజీ!"

నేను బిత్తరపోయాను.

"అవునూ! నువు ప్రసాద్‌ని పెళ్లి చేసుకుంటా వుటగా. ఈ సంగతి విన్న దగ్గర్నించీ మా అమ్మ చాలా కోపంగా వుంది."

"ఏం! కోపం ఎందుకూ!"

"ఎందుకుండదూ! నువు లేకపోతే నన్నిచ్చి చేద్దామనుకుంది."

ఆ అమ్మాయి అలా సిగ్గు విడిచి చెప్తోంటే నేను తెల్లబోయి చూశాను.

"నువ్వు ఎలాగైనా చాలా అదృష్టవంతు రాలివిలే రాజీ! బోల్డు ఆస్తి; అందమూ వున్న ప్రసాద్‌ని చేసుకోబోతున్నావు. నా బాధంతా ఒక్కటే నువు లేకపోతే ఇవన్నీ నాకు దక్కేవి"

శ్రీలక్ష్మి దిగులుగా కూర్చుంది.

ఆ పిల్ల అన్న మాటలకు అసహ్యం బదులు జాలి కలిగింది.

తల్లితండ్రుల మూర్ఖత్వానికి పిల్లలు బలి అవుతూ వుంటారు.

ఆ అమ్మాయికి చిన్నప్పట్నించీ ప్రసాద్ నీ భర్త అని చెప్పి వుంటారు. ఆ లేత హృదయం మీద అదే ముద్రించిపోయింది. ఇప్పుడు కాదని తెలిస్తే ఆ అమ్మాయి తట్టుకోగలదా?

"విచారించకు లక్ష్మీ! నీలాంటి అందమైన మంచి పిల్లకు ఇంతకన్నా మంచి భర్తే వస్తాడు" అని అన్నాను.

"ఏం వస్తాడో! ఇక నుంచి ప్రసాద్ దగ్గిరున్న డబ్బంతా నీదే గదా!"

నేనేం మాట్లాడలేదు. పెళ్లి చేసుకోడమంటే – నగలు, డబ్బు, ఆస్తి కోసమా! ఆ పిల్ల పెరిగిన వాతావరణం నేర్పింది అంతవరకే.

ఇంతలో లోపలినుంచి—

'శ్రీలక్ష్మి' అన్న పిలుపు విన్పించింది. శ్రీలక్ష్మి ఇంట్లోకి వెళ్లింది.

అయిదు నిముషాల తర్వాత అత్తయ్య నా దగ్గిరి కొచ్చి—

"వెళ్లింది తల్లీ! అబ్బ! ఒకటే ప్రశ్నలు ఆవిడ వచ్చిందగ్గిర్నుంచీ కళ్లన్నీ నీ మీదనే. వుండమ్మా దిష్టి తీస్తాను." అని లోపలకు వెళ్లి మళ్లీ వచ్చి నా పక్కన కూర్చుంది.

నేను అత్తయ్యతో శ్రీలక్ష్మి చెప్పిందంతా చెప్పాను.

"అలాగా! మనసులో ఇంత ఆలోచన పెట్టు కుని రోజూ వస్తోందన్న మాట. నాతో ఎప్పుడూ ఈ విషయం అనలేదు. అలా అనుంటే అప్పుడే చెప్పేదాన్ని" అంది అత్తయ్య.

"పాపం శ్రీలక్ష్మి చాలా బాధపడుతోం దత్తయ్యా!"

నా మనస్సులో ఆ పిల్ల రూపే మెదిలింది.

'నేనున్నన్ని రోజులూ ఆ అమ్మాయిని ప్రతి రోజూ కలుసుకుని ధైర్యం చెప్పాలి' అను కున్నాను.

"ఏదీ పూలు ఎన్ని కోశావ్" అంటూ నా కొంగు చూసి, "ఇవేనా? నీకు జడ వేద్దామను కున్నానీ వేళ" అంది అత్తయ్య.

"ఛ జడేం బావుంటుంది?" అన్నాను.

"ఎందుకు బావుండదు! చక్కగా వుంటుంది. అయినా ఇవ్వాళ ఇంకేం వేస్తాను. రేపు పొద్దున్నే పాలేరుచేత పూలు కోయిస్తాను" అంటూ నా దగ్గర వున్న మొగ్గలు తీసుకుని మాల కట్టసాగింది.

కొద్దిసేపయ్యాక అన్నాను.

"అత్తయ్యా! నువ్వు సావిత్రీ వాళ్లింటికి ఎప్పుడూ రాలేదా?"

"లేదే! ఆయన పోయాక ఈ గుమ్మం దిగ లేదు. ప్చ్! ఆయనతోనే పోయింది మా వైభవ మంతా" అంది దిగులుగా.

నాకు బావ చెప్పిన మాటలు మనసులో మెదిలాయి.

"మామయ్య పోయాక బావ చాలా కష్టపడ్డాట్ట కదా అత్తయ్యా! మొన్న చెప్పాడు" అన్నాను.

అత్తయ్య పూలు కట్టడం ఆపి నా వేపు చూస్తూ–

"అవును రాజీ! ప్రసాద్ ధైర్యస్థుడు, పట్టుదల గలవాడు కాబట్టి సరిపోయింది. ఇంకో దైతే ఈపాటికి ఊరొదిలి పారిపోయేవాడు. నీకు చెప్పాడో లేదో మొదట్లో ప్రసాద్ చేసే ప్రతి పనికీ వూళ్లో వాళ్లు ఎంతగా అడ్డు తగిలేవారో తెలుసా! ఒక సంవత్సరం పంట బాగా పండింది. వూళ్లో వాళ్లు సహించలేక పంటకి నిప్పెట్టారు. సంవత్సరమంతా కష్టపడి పండించింది బూడి దయింది. ఆ దిగులుతో నేను రెండు నెల్లు పడక వేశాను. కాని బావ మాత్రం మనసులో ఏదైనా బాధపడ్డాదేమోగానీ పైకి మాత్రం నిశ్చలంగా వున్నాడు. ఆ మరుసటి సంవత్సరం పట్టుదలగా రెట్టింపు పండించాడు. ఆ తర్వాత ఇప్పుడిప్పుడు కాస్త వాడికి సహాయంగా వుంటున్నారు. గౌర విస్తున్నారు. ఇప్పుడు నాల్గురాళ్లు కూడబెట్టాడు గదా! ఇదివరకు వెక్కిరించిన వాళ్ళే ఈ రోజు బావకి వాళ్ల పిల్లల్ని ఇస్తామంటూ కబుర్లు చేస్తున్నారు. చూశావా రాజీ! మనుషులెంత స్వార్థ పరులో! వారి స్వార్థం కోసం మానాభిమానాలు కూడా విడిచేస్తున్నారు."

నేను మాట్లాడలేదు. బావ గొప్పతనాన్ని అంచనా వేస్తున్నాను.

"ప్రసాద్ ఇంత చేస్తున్నా, ఇంత వృద్ధిలోకి వస్తున్నా ఏదో విచారం వాడి ముఖంలో గూడు కట్టుకుని వుండేది. రాజీ! నిన్ను చూసి వచ్చాడు. అప్పటినుంచీ వాడి ఆనందం చెప్పనలవి కాదు. మొదటిసారి సావిత్రీ వాళ్లింట్లో నిన్ను చూశాట్ట కదా! ఆ రోజు వస్తూనే ఈ వార్త చెప్పాడు. 'అమ్మా! రాజీని చూశాను. ఎంత బాగుందో తెలుసా! రాజీ ఈ యింటి కోడలవుతుంది. మీ అన్నయ్య నిన్ను వెతుక్కుంటూ రావాల్సిందే! ఇంక దిగులు లేదమ్మా! ఈ రెండు కుటుంబాలు ఒకటవుతాయి. నీ కోర్కె తీరుతుంది' అంటూ చెప్పాడు.

ఆ తర్వాత వూరి నుంచి వచ్చినప్పుడల్లా నిన్ను గూర్చి ఏదో ఒకటి చెప్తుండేవాడు. అప్పటినుంచే ఎంతో ఎంతో హుషారుగా, వుత్సాహంగా వుంటు న్నాడు. వారం రోజుల క్రితం మునసబు కన్పించి ఏదో సంబంధం చెప్పబోతే—

'మీరేం చెప్పకండి బాబాయ్! నాకు మా

మామయ్య కూతురుంది. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను' అన్నాట్ట. రాజీ యిలా నువ్వు నట్టింట్లో తిరుగుతుంటే అప్పుడే పెళ్ళయి నా ఇంటికి కోడలిగా వచ్చేనట్టుందే!"

అత్తయ్య మాటలు వింటుంటే విచిత్రమైన అనుభూతి కలుగుతోంది. ఆ క్షణానే బావని పెళ్లి చేసుకుని అక్కడే వుండిపోవాలన్పించింది. ఆడపిల్ల యింతకన్నా ఏం కోరుకుంటుంది?

బావ ఆప్యాయత అనే చల్లటినీడలో, అత్తయ్య ఆదరణ అనే అమృతాన్ని తాగుతూ హాయిగా గడిపేస్తాను ఈ జీవితాన్ని, అత్తయ్య లోపలకు వెళ్లి నూనె దువ్వెన తెచ్చి, నాకు జడ వెయ్యడం ప్రారంభించింది.

'అత్తయ్యా! ఇవ్వాళ బావ తోట చూడ్డానికి రమ్మన్నాడు వెళ్ళనా' అన్నాను.

"వెళ్ళమ్మా! మామిడితోట, బాగానే కాసిందన్నాడు. ఇవ్వాళ రేపట్లో కాయల్ని దింపిస్తాడేమో!"

అత్తయ్య జడ వేసి జడలో మల్లెమొగ్గలు చెండు పెట్టింది.

నేను ముఖం కడుక్కుని ఇవతలకు వచ్చేసరికి పాలేరు వచ్చాడు.

వంటింటి దగ్గిరికి వెళ్ళి 'అత్తయ్యా! నేను వెడుతున్నాను' అని చెప్పాను.

గుమ్మం దాటుతోంటే అన్పించింది శ్రీలక్ష్మిని కూడా తీసికెడితే బాగుంటుందని.

నాకా పిల్లంటే ఎందుకో అభిమానం ఏర్పడింది. కొందరంటే అకారణంగా ద్వేషం కలుగుతుంటుంది. కొందరిని చూడగానే ఆప్యాయత కలుగుతుంటుంది.

'నీకు పార్వతమ్మగారిల్లు తెలుసా' అని పాలేరుని అడిగాను.

"ఆ తెలుసమ్మా" అన్నాడు. "అయితే ముందు వాళ్ళింటికి వెడదాం పద".

"అలాగేనండీ" అంటు నడుస్తున్నాడు.

ఒక్క రోజుకే ఈ రోడ్లు అలవాటయ్యాయి. ఇవ్వాళ తేలిగ్గానే నడుస్తున్నాను.

పాలేరు సందు తిరిగి "అదుగోనండీ! అదే పార్వతమ్మగారిల్లు" అని చూపాడు.

అటు చూశాను. ఒక పెంకుటిల్లు కన్పించింది. వెళ్లి ఇంటిముందు నిలిచాను.

ఇంట్లోకి వెళ్ళటానికి కొద్దిగా బెరుకుకలిగింది. పార్వతమ్మ అత్తయ్య ఇంటికి వచ్చినప్పుడు నన్ను వాళ్ళింటికి రమ్మని పిలవలేదు.

కనీసం ఆప్యాయంగానైనా మాట్లాడలేదు.

ఇప్పుడు ఇంట్లోకి వెడితే "ఎందుకొచ్చావ్!" అని అంటే

అసలే ఆవిడకి నామీద కోపంగా వుంది.

"ఇప్పుడెందుకి లేనిపోని గొడవలు?" అనుకుంటు ఆ ఇంటిని దాటి రెండడుగులు ముందుకు వేశాను. ఇంతలో వెనకనుంచి.

"రాజీ!" అన్న పిలుపు విని తలతిప్పి చూశాను.

శ్రీలక్ష్మి గుమ్మంలో నిలబడివుంది. నేను ఆగడం చూసి గబగబా మెట్లు దిగి.

"మా ఇల్లు ఇదే రా" అంది. నేను వెనక్కి తిరిగి.

"నేను తోటలోకి వెడుతున్నాను. నువ్వు వస్తావేమో! తీసుకెడదామని వచ్చాను" అన్నాను.

"మరి వెళ్ళిపోతున్నావే".

"వాకిట్లో నువ్వు కన్పించకపోతే, సరేగానీ



జెబినిస్సా

విలువిద్యలో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, గత ఒలింపిక్ పోటీలలో కాంస్య పతక విజేత అయిన వనిత – జెబినిస్సా రుస్తమోవా. 1970 లో విలు విద్య నేర్చుకోవడం ప్రారంభించినప్పటి నుంచి ఆమె పలు విజయాలను సాధించింది. ఈ విజయాల వెనుక అనేక వెలలపాటు చేసిన నిరంతర కృషి, అభ్యాసమూ వున్నాయి.

"ప్రారంభంలో గురి చూసి బాణం వదలడమన్నది చాలా సులభం అనిపిస్తుంది. అయితే అందుకు చురుకైన చూపు, అద్భుతమైన పనితనం, కండబలం కావాలి. ఒకొక్క షాట్ (బాణం) పదిహేను కిలోల బరువుంటుంది. అందువల్ల చక్కటి దేహ దారుఢ్యం చాలా అవసరం" అంటుంది జెబినిస్సా.

ఆమె రోజుకి నాలుగు వందల షాట్స్‌తో ప్రతిదినం అభ్యాసం చేస్తున్నది. ఇంతటి బరువుకి తట్టుకోవడానికి ఆమె శరీరధారుఢ్యం కోసం, రన్నింగ్, టెన్నిస్, ఈత మొదలైన క్రీడలలో తరచు పాల్గొంటూ వుంటుంది. విలువిద్యని ఆమె తన సోదరి మారినిస్సా రుస్తమోవాతో కలిసి అభ్యాసం చేస్తూ వుంటుంది.

ప్రపంచంలోని అత్యున్నత క్రీడాకారులు పాల్గొనే ఒలింపిక్ పోటీలలో పాల్గొనడానికి ఆయత్తమవుతున్న జెబినిస్సా ఈసారి బంగారు పతకాన్ని సాధించడానికి కృషి చేస్తున్నది.

వస్తావా" అన్నాను.

శ్రీలక్ష్మి వుత్సాహంగా 'ఆ! వస్తాను వుండు' అని లోపలకు వెళ్ళి క్షణంలో వచ్చింది.

"మీ అమ్మగారు ఏమన్నారు?" అన్నాను.

"మా అమ్మతో అసలు చెప్తేగదా!" అంది తేలిగ్గా.

"అదేమిటి? ఏమన్నా అంటారేమో?" "ఆ! ఏం అనదు! అంతగా ఏదన్నా అంటే ప్రసాద్ దగ్గిరికి వెళ్లాను అని చెప్తాను. అప్పుడేమీ అనదు"

ఇద్దరు నడుస్తున్నాం. శ్రీలక్ష్మి రోడ్డు మీద కనిపించే ప్రతివాళ్ళని పలకరిస్తోంది. అంతేకాదు "ఈ అమ్మాయి ఎవరో తెలుసా?" రాజ్యలక్ష్మి అని ప్రసాద్‌కి కాబోయే భార్య" అని చెప్తోంది.

నాకు బలేసిగ్గుగా అన్పించింది! "ఛ! వూరుకో లక్ష్మి ఎందుకలా చెప్పడం" అన్నాను.

"తప్పేం వుంది వున్న విషయం గనుక చెప్పాను! అయినా వాళ్ళకి ప్రసాద్ అంటే అసూయ. ఇలా చెప్పి వీళ్ళని ఇంకా ఏడిపించాలి."

చిన్న పిల్లలా అంటోంది. శ్రీలక్ష్మి నాకు పరిసరాల్ని పరిచయం చేస్తోంది.

అదిగో! ఆ కన్పించేదే మునసబు ఇల్లు. వాడు వట్టి వెధవలే.

అదిగో అది రామాలయం రాములవారి విగ్రహం ఎంత బాగుంటుందనుకున్నావ్!

అది వూళ్ళో వున్న మంచినీటి బావి. కాని ఆ నీళ్లు అందరికీ చాలవు.

ఇదిగో ఇటువక్క రెండుమైళ్లు వెడితే స్టేషన్ వస్తుంది. కానీ మధ్య అడివి వుంది. అందుకని అటువైపుగా ఎవరూ వెళ్ళరు.

"అదిగో అదే మామిడితోట" అటు చూశాను.

తోట చుట్టు ఫెన్సింగ్ వుంది. ముందున్న కర్రగేటు తీసుకుని లోపలకు వెళ్ళాం.

"వుండండమ్మా అయ్యగారికి చెప్పొస్తాను."

పాలేరు లోపలకు పరిగెట్టాడు. నేను చెట్లను చూస్తూ నిలబడ్డాను.

ఆ చెట్లు పచ్చని మేలిముసుగు వేసుకుని మమ్మల్ని ఆహ్వానించడానికి నిలబడ్డ కన్నెపిల్లల్లా వున్నాయి!

స్కూల్లో టీచరు పిల్లల్ని వరుసలో నిలబెట్టి నట్లు చెట్లు ఒక్కటి కూడా ఇటు, అటు కాకుండా లైనులో వున్నాయి.

ప్రతి చెట్టుకీ ఆకులెన్ని వున్నాయో కాయలూ అన్ని వున్నాయి, వేలాడుతున్న కాయల్ని చూస్తోంటే నోరూరింది.

ప్రతి చెట్టు క్రిందా నీళ్లు పోయడానికి అనువుగా గుండ్రంగా గోతులు తవ్వబడి వున్నాయి. కింద నేల ఒక్క ఆకు కూడా లేదు. చక్కగా శుభ్రం చేసి వుంది.

"రాజీ!"

ఎదురుగా బావ గబగబా వస్తున్నాడు. "వచ్చావా! రాజీ! రా! తోటలోకి వెళ్దాం"

"ఆ! నాతో పాటు శ్రీలక్ష్మి కూడా వచ్చింది బావా! అరె! ఏదీ!"

నా ప్రక్కన శ్రీలక్ష్మి లేదు. నా ఆలోచనల్లో పడి తనని గమనించనే లేదు.

ఆ మాట వినగానే బావ ముఖం చిట్లించాడు.

"ఆపిల్లనెందుకు తీసుకొచ్చావ్!"

బావ ముఖం చూడగానే వుడికించాలన్పించింది.

"నేను తీసుకురాలేదు బావా! నిన్ను చూడాలని తనే వచ్చింది"

"నన్ను చూడాలనా!"

"ఆ నువ్వంటే చాలా ఇష్టమట. అదుగో వస్తోంది"

శ్రీలక్ష్మి రెండు చేతులనిండా కాయలతో వచ్చింది.

శ్రీలక్ష్మిని చూడగానే బావ ఉత్సాహమంతా నీరుకారిపోయినట్లయిపోయింది.

"ఏవండోయ్! ప్రసాద్‌గారూ! మీకు చెప్ప కుండా కోసుకున్నాను ఏమనుకోకండీ" అని నా వేపు తిరిగి—

"చూశావా రాజీ! కాయలు ఎంత బావున్నాయో రండి కోసుకుతిందాం" అంది.

నేను బావ వేపు చూశాను - బావ నా వేపొకసారి చూసి వెనుదిరిగాడు.

కోపం వచ్చినట్టుంది బావకి. 'శ్రీలక్ష్మిని తీసుకొచ్చి పొరపాటు పనిచేశానా!' అనుకున్నాను.

బావ వెంట ఇద్దరం నడిచాం.

బావ చెట్లు దాటి తోట వెనక వున్న పాకలోకి దారితీశాడు.

అక్కడ మంచం వేసి "కూర్చో" అన్నాడు.

ఇద్దరం కూర్చున్నాం.

"చూశావా! రాజీ! ప్రసాద్‌గారి తోట ఎంత బాగా కాస్తుందో, మా తోటలో అన్నీ గోళీ కాయలే! అవును ప్రసాద్‌గారూ! మీ తోటకి ఏం ఎరువు వేస్తారు! నాకు చెప్పండి చాలు. ఈ దేవ రహస్యం నేనెవరికీ చెప్పను" అని కిలకిలా నవ్వింది.

బావ నా వేపు కోపంగా చూసి—

"తోటలో పనివుంది వస్తాను" అని వెళ్లి పోయాడు.

బావకి నిజంగా కోపం వచ్చింది. బావకి కోపం తెప్పించినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

శ్రీలక్ష్మి పాలేరుని అడిగి కత్తి తెచ్చి ముక్కలు చేసింది. రెండు ముక్కలు నాకిచ్చి —

"తిను" అంది.

నా ఉత్సాహమంతా పోయింది. ముక్కలు తినాలన్పించలేదు. శ్రీలక్ష్మి వాటిని కొరికి పరపరా నమిలేస్తోంది.

"పుల్లగా బలే బావున్నాయి. దీన్లోకి కొద్దిగా ఉప్పూ, కారం వుంటే ఇంకా బాగుంటుంది."

నేను అలాగే కూర్చున్నాను–బావ వెళ్లినవైపే చూస్తూ.

బావ తిరిగొచ్చే జాడలేవీ కన్పించలేదు.

"అదేం! నువు తినడం లేదే?"

"పులుపు తినలేను."

"అయితే అవి నాకిచ్చేయ్! ఇంటికెళ్లాక తింటాను" అని ముక్కలు తీసుకుంది.

అయిదు నిముషాలు గడిచాయి. నాకు విసుగ్గా వుంది. నేను లేచి నిలబడి—

"లక్ష్మి వెళ్లిపోదాం రా! చీకటి పడింది" అన్నాను.

"అప్పుడేనా?"

"ఆ! చీకటిపడ్తే అత్తయ్య తిడ్తుంది. రా! పోదాం" అన్నాను.

ఒళ్ళో కాయలు కొంగున మూట కట్టుకుంధి.

ఇద్దరం లేచి నడక సాగించాం.

బావ కన్పిస్తాడేమోనని చుట్టూ చూస్తూ మెల్లగా నడుస్తున్నాను.

కాని బావ ఎక్కడా కన్పించలేదు. తోట దాటాం.

మళ్ళీ వెనక్కి తిరిగి చూశాను. 'ఊహుఁ! బావ కన్పించలేదు! ఇద్దరం ఇంటి వేపు నడిచాం.

*

"రాజీ! శ్రీలక్ష్మిని ఎందుకు తీసుకొచ్చావ్!"

రాత్రి భోజనాలయ్యాక వాకిట్లో కూచునుండగా అడిగాడు బావ.

నేను నవ్వుతూ—"తనే వస్తానంది బావా!" అన్నాను.

"వస్తాననగానే నువ్వు 'రామ్మా!' అంటూ ఆహ్వానించి తీసుకొచ్చావ్! అంతేనా!" అన్నాడు వెటకారంగా.

"కానీ బావా! శ్రీలక్ష్మికి నువ్వంటే చాలా యిష్టం తెలుసా?"

"అలాగా! అయితే ఏం చెయ్యమంటావ్?" అన్నాడు కోపంగా.

దానికి వెంటనే ఏం సమాధానం చెప్పాలో నాకు తోచలేదు.

మాట్లాడకుండా కూర్చున్నాను.

"ఛ! నా మూడంతా చెడగొట్టావ్!"

"సారీ! బావా! ఈసారి ఒక్కదాన్నీ వస్తాను సరేనా" అన్నాను మెల్లగా.

బావ నవ్వాడు.

"ఆ మాటన్నావు బావుంది."

ఇంతలో రెండు వర్షపు చినుకులు పైనుంచి రాలాయి.

"అరె! వర్షం వచ్చేట్టుందే!" అన్నాడు.

నేను పైకి చూశాను.

ఆకాశంలో నక్షత్రాలు లేవు. నల్లగా మబ్బులు పట్టాయి. రివ్వున గాలి విసిరింది.

'వర్షాలు పడ్తాయేమో రేపు కాయలు కోయించేయాలి.' స్వగతంలా అనుకున్నాడు బావ.

బావ అంటుండగానే చినుకులు ప్రారంభమయ్యాయి.

బావ మంచాలు ఎత్తి లోపల పడేశాడు.

"గాలికి కాయలు రాల్తాయేమో?"

బావ భయపడుతున్నాడు.

"వర్షం వస్తోందేమిటిరా!" అంది అత్తయ్య.

"అవునమ్మా! కాయలు ఇవ్వాళ కోయిస్తే బాగుండేది"

బావ మనసంతా వాటిమీదే వున్నట్టుంది.

"ఏం ఫర్వాలేదు లేరా! అకాల వర్షం ఎంతసేపుంటుంది? ఇదంతా రేపింతకింత ఎండ కాయడానికే."

నేను పక్క వేసుకుని మంచం మీద వాలాను. బావ అలాగే కూర్చున్నాడు.

నోటికందివచ్చిన తిండి మట్టిపాలవుతూంటే ఎవ్వరికైనా బాధే. అందులోనూ బావ రాత్రనక, పగలనక నిద్రాహారాలు మాని కష్టపడ్డాడు.

భగవంతుడా! బావకేం కష్టం కలిగించకు. అతని పంటను నాశనం చెయ్యకు. బావ బాధపడుతూంటే చూడలేను.

ఆలోచిస్తూ పడుకున్నాను.

ఎప్పుడు నిద్రపట్టిందోగానీ అర్ధరాత్రి మెలకువ వచ్చింది. దీపం ఆరిపోయినట్లుంది. కటిక చీకటి. బైట వర్షం కొద్దిగా పడుతున్న చప్పుడవుతోంది.

దానికితోడు ఏవేవో వింత వింత శబ్దాలు వినబడుతున్నాయి.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో వుండుండి వినవచ్చే ఆ శబ్దాలు భయాన్ని కల్గిస్తున్నాయి. చీకటిగా

[లోకజ్ఞానం – సమాధానాలు]

1. ఒలింపస్ లోయ. దక్షిణ గ్రీకు దేశంలోని పెలోపొన్నెసస్ ప్రాంతంలో వుంది.

2. 1896లో. సరిగ్గా 1500 ఏళ్ళక్రితం ఈ పోటీలు ఎక్కడ జరిగేవో అదే స్థలంలో అంటే ఒలింపస్ లోయలో పునఃప్రారంభించబడ్డాయి. ఫ్రాన్స్ దేశానికి చెందిన రాజకుటుంబీకుడు పియర్రీ డి కాబెర్టిన్ 1894లో వివిధ దేశాల క్రీడా సంఘాలను సమీకృతపరచి ఈ పోటీలు జరగడానికి తోడ్పడ్డాడు.

3. నాలుగు సంవత్సరాల కొకసారి జూలై నెలలో జరుగుతాయి. ప్రాచీన కాలంలో కూడా ఇప్పటిలాగే జూలై నెలలోనే జరిగేవి. ఒక పోటీ నుండి మరో పోటీకి మధ్య వుండే నాలుగేళ్ళ కాలాన్ని 'ఒలింపియడ్' గా వ్యవహరిస్తారు. ఒలింపిక్ పోటీలు అంతకు ముందే ప్రారంభమైనా ఒలింపియడ్స్‌ని మాత్రం క్రీ. పూ. 776 నుంచే లెక్కగడుతున్నారు. 1936 లో పదకొండవ ఒలింపియడ్స్ జరిగాయి. రెండవ ప్రపంచయుద్ధం రావడంతో 1948 లోనే ఆ తరువాతి ఒలింపిక్స్ జరిగాయి. అయినా ఆ పోటీలు పద్నాల్గవ ఒలింపియడ్స్‌గానే వ్యవహరించబడ్డాయి. అనుకున్న ప్రకారం నాలుగేళ్ళ కొకసారి ఈ పోటీలు జరిగినా జరగకపోయినా 'ఒలింపియడ్స్' సంఖ్య మాత్రం మారుతూనే వుంటుంది.

4. ఎలిస్‌కి చెందిన కొరోయిబస్. క్రీ. పూ. 776 లో. ఇతను ఏ క్రీడలలో విజయాలు సాధించాడో తెలియడం లేదు కాని ఒలింపిక్ పోటీలలో తొలి విజేతగా ఇతని పేరు చరిత్రలో లిఖించబడింది. క్రీ. పూ. 776 నుంచి 'ఒలింపియడ్స్' లెక్కగట్టడానికి కారణం కూడా ఇతని విజయాలేనని అంటారు.

5. మార్జొరి గెస్ట్రింగ్. అమెరికా దేశస్థురాలైన మార్జొరి 1936 లో స్ప్రింగ్‌బోర్డ్ క్రీడలో బంగారు పతకాన్ని సాధించింది. అప్పుడు ఆమె వయసు 13 సంవత్సరాల 9 నెలలు.

6. సి. కూపర్. గ్రేట్ బ్రిటన్‌కు చెందిన ఈమె 1900 వ సంవత్సరంలో పారిస్ నగరంలో జరిగిన ఒలింపిక్ పోటీలలో టెన్నిస్ సింగిల్స్‌లో విజయం సాధించి బంగారు పతకం పొందింది. వనితలు ఈ పోటీలలో పాల్గొనడమన్నది కూడా ఆ సంవత్సరంతోనే ప్రారంభమయ్యింది.

7. ఏడుసార్లు. 1928 (ఆమెస్టర్ డామ్), 1932 (లాస్ ఏంజెల్స్), 1936 (బెర్లిన్), 1948 (లండన్), 1952 (హెల్సింకి), 1956 (మెల్బర్న్), 1964 (టోక్యో)లలో జరిగిన పోటీలలో బంగారు పతకాన్ని పొందింది.

8. 26 మైళ్ళ 385 గజాలు లేక 42.19 కిలోమీటర్లు.

9. 1952 లో. హెల్సింకిలో జరిగిన ఈ పోటీలలో రష్యాకు తొలి పతకాన్ని ఒక వనిత సాధించి పెట్టడం విశేషం. 'డిస్కస్‌త్రో'లో ఎన్. పొనొమర్యోవా రోమష్కోవాకు ఈ పతకం లభించింది.

10. పావో జొహన్నెస్ నర్మి. ఫిన్‌లాండ్ దేశస్థుడైన నర్మి 1920, 24, 28 ఒలింపిక్ పోటీలలోని వివిధ పరుగు పందాలలో మొత్తం 9 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు గెలుపొందాడు. 1924 లో మాత్రమే అతను 5 బంగారు పతకాలు పొందాడు. అయితే అత్యధిక సంఖ్యలో బంగారు పతకాలు పొందిన వ్యక్తి–అమెరికాకు చెందిన రాయ్ సి. ఎవ్రి. ఇతను లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్‌లలో 1900–1908 మధ్య పది బంగారు పతకాలు గెలుపొందాడు.

వుండటం వలన అత్తయ్య, బావ ఎక్కడ పడుకున్నారో కనిపించటం లేదు. దాహం కూడా వేస్తోంది. విపరీతమైన వుక్కగా వుంది. నేను లేచి కూర్చున్నాను.

ఇంతలో దొడ్లో ఏదో పెద్ద మోతయింది. నేను కెవ్వున అరిచాను.

"రాజీ! ఏమయింది?" బావ లేచి నా దగ్గిరికి పరిగెట్టుకు వచ్చాడు.

నేను వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. భయంతో నాలుక పిడుచకట్టుకుపోయింది.

బావ నా రెండు బుజాలు పట్టుకుని కుదుపుతూ అడుగుతున్నాడు.

"రాజీ! ఏమయింది? ఎందుకరిచావ్."

"మరే బావా! బయట.... దొడ్లో....ఏదో చప్పుడయింది."

ఎలాగో శక్తి కూడదీసుకుని చెప్పాను.

"అలాగా" బావ నన్ను వదిలి "అమ్మా! అమ్మా" అని పిలిచాడు.

"ఏమిటి ప్రసాద్! ఎందుకురా?"

"లాంతరు వెలిగించమ్మా తొందరగా" అన్నాడు.

అత్తయ్య వెలిగించింది. బావ లాంతరు తీసుకుని దొడ్లోకి పరిగెత్తాడు.

అత్తయ్యా, నేనూ వెనకే వెళ్ళాం. దొడ్లో దృశ్యం చూసి అలాగే నిలబడిపోయాను.

పశువుల పాక ఒక పక్కకు ఒరిగిపోతోంది. దాని కింద వున్న పశువులు దిక్కుతోచక అటూ, ఇటూ పరిగెడుతున్నాయి.

బావ లాంతరు కింద పెట్టి గబగబా దాని దగ్గిరికెళ్ళి ఒరిగిపోతున్న స్తంభాన్ని బుజం మీద నిలబెట్టుకున్నాడు. అలా నిలబడిన బావని చూడగానే ఆనాడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన కృష్ణుడు జ్ఞాపకం వచ్చాడు.

"అమ్మా ఒక సరుగు బాదు అందుకో" అన్నాడు.

అత్తయ్య సరుగు బాదు తీసుకొచ్చి ఇచ్చింది.

అది పాకకి పోటీ పెట్టి గొయ్యి తీసి బాదు పాతాడు.

పాక నిలబడింది.

బావ చేస్తున్న పనిని నేను ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాను.

బావ పని పూర్తిచేసి చెయ్యి కడుక్కుని నా దగ్గరికి వచ్చి–

"రాజీ! ఏమిటలా నిలబడిపోయావ్!" అన్నాడు.

బావ శరీరం నిండా చెమట పట్టింది. బావని దగ్గరికి తీసుకుని కొంగుతో ఆ చెమట తుడవాలనిపించింది.

"అమ్మా కాసిని మంచినీళ్ళివ్వు!" అన్నాడు.

అత్తయ్య లోపలకు వెళ్ళింది.

అదే సరైన సమయమని–

"చాలా శ్రమపడ్డావ్ బావా!" అంటూ బావ ముఖాన్ని కొంగుతో తుడిచాను.

బావ నా రెండు బుజాలు పట్టుకుని దగ్గరికి తీసుకున్నాడు. నా ఒళ్ళు ఝల్లుమంది.

"రాజీ!" అంటూ ఏదో చెప్పబోయాడు.

"ఇవిగోరా మంచినీళ్ళు" అంటూ అత్తయ్య వచ్చింది.

బావ చటుక్కున నన్ను వదిలి దూరంగా జరిగాడు.

తినబోతున్న విస్తరిని నోటి దగ్గర నుంచి తీసేసినంత నిరాశ కలిగింది!

బావ మంచినీళ్ళు తాగిం తర్వాత అందరం లోపలికొచ్చాం.

"రాజీ! నువు గనుక లేవకపోతే ఈ పాటికి పశువులు చచ్చివుండేవి. ఆ మూగజీవుల ప్రాణాలు కాపాడావు రాజీ!"

"రాజీ! అసలు నీకెలా మెలకువ వచ్చింది" అంది అత్తయ్య.

"ఆ మోతకి లేవలేదత్తయ్యా! అంతకు ముందే లేచాను. దాహం వేసింది. నిన్ను పిలిచి మంచినీళ్ళు అడుగుదామనుకుంటుండగా ఆ శబ్దం విన్పించింది."

"మరి ఇందాకట్నించీ అడగవేం" అంటూ బావ లేచి మంచినీళ్ళు తెచ్చిచ్చాడు.

తాగాను.

"అంతా రాములవారి దయరా! పడుకోండి తెల్లారబోతున్నట్లుంది" అంది అత్తయ్య.

అత్తయ్యా, బావా పడుకున్నారు.

నేనూ మంచం మీద వాలాను.

నా కళ్ళ ముందు తన బుజం మీద పాకని నిలబెట్టుకున్న బావే కన్పిస్తున్నాడు.

అది పాకలా అన్పించలా. పడిపోతున్న జీవన రథాన్ని పైకెత్తుతున్నట్లుగా అన్పించింది.

ఆ గొడ్లని రక్షించినట్లుగానే నా జీవితాన్ని కూడా రక్షిస్తాడు. బావ నీడలో వుంటే చాలు. ఏ పిడుగులూ, తుపానులూ జీవితంలో రావు.

ఎటువంటి కష్టాలనూ, బాధలనైనా పర్వతం మేఘాల్ని అడ్డగించినట్లు అడ్డగిస్తాడు. నా జీవితాన్ని బావ చేతిలో వుంచి నిశ్చింతగా వుంటాను.

తృప్తిగా కళ్ళుమూసుకున్నాను.

*

ఉదయం నేను లేచేసరికి బావ లేడు. అత్తయ్యనడిగితే తోటలోకి వెళ్ళాడంది.

'కాయలు ఏమయ్యాయో చూడటానికి వెళ్ళుంటాడు.' అనుకుంటూ ముఖం కడుక్కునే ప్రయత్నంలో మునిగాను.

వర్షం పూర్తిగా వెలిసింది. ఆకాశం నిర్మలంగా వుంది. 'బయటకి రానా! వద్దా' అన్నట్లు సూర్యుడు మబ్బు చాటు నుంచి తొంగి చూస్తున్నాడు.

నేను ముఖం కడుక్కుని పాలు తాగుతూంటే బావ వచ్చాడు.

వస్తూనే "అమ్మా కాయలన్నీ బాగానే వున్నాయి" అన్నాడు ఆనందంగా.

"నిజంగానా" అంటూ అత్తయ్య కూడా సంతోషపడింది.

"ఈ పూట కాయలన్నీ కోయించేస్తాను" అన్నాడు.

నా వేపు తిరిగి, "కాయలు కోయించి త్వరగా వచ్చేస్తాను రాజీ!" అని స్నానం చేసి అన్నం తిని బావ తోటకి బయలుదేరాడు.

నేను స్నానం చేసి పుస్తకం పుచ్చుకుని కూర్చున్నాను.

నేను వచ్చినట్లు వూరంతా తెలిసిపోయినట్లుంది.

ఆ రోజంతా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు నన్ను చూడ్డానికి రాసాగారు.

వాళ్ళు అలా చూస్తోంటే నాకు సిగ్గుగా అన్పించసాగింది.

ప్రతివాళ్ళముందు కూర్చోటం, వాళ్ళు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం, వాళ్ళు నన్ను నఖశిఖ పర్యంతం పరీక్ష చెయ్యడం.

ఆ రోజల్లా ఆ యాతన అనుభవించాను.

కరణంగారి భార్య వెళ్ళాక అత్తయ్య దగ్గిర

కూర్చుని–

"అత్తయ్యా! ఇంకెవరినీ రావద్దని చెప్పు. నా కిదంతా అసహ్యంగా వుంది" అన్నాను.

అత్తయ్య నన్ను దగ్గిరికి తీసుకుని—

"పిచ్చి పిల్లా! వాళ్ళు వస్తామంటే రావద్దని ఎలా చెప్పను!" అంది.

"ఏమో బాబూ! నాకు చిరాగ్గా వుంది."

"కాస్సేపు ఓర్చుకో! నా తల్లివి కదూ! ఈ బంగారు బొమ్మని చూసి అందరూ కుళ్లి కుళ్లి ఏడ్వాలి." అంది అత్తయ్య నా తల నిమురుతూ.

"వుండు దిష్టి తీస్తాను" అని లేవబోయింది. నేను వారిస్తూ—

"రోజూ ఎందుకులే అత్తయ్యా! నేను వూరు వెళ్ళేముందు ఏకంగా ఒకేసారి తీద్దువుగాని."

ఇంతలో పనివాడు వస్తే అత్తయ్య లోపలకు వెళ్లింది.

నే నొక్కదాన్నే కూర్చున్నాను.

ఆ రోజల్లా బావకి మామిడికాయలు దింపించడంతోనే సరిపోయింది.

ఆ రాత్రి పడుకోబోయే ముందు అత్తయ్య అంది—

"ప్రసాద్! రేపు రాములవారి గుళ్లో పూజ చేయించాలి. పొద్దున పూట పొలం వెళ్లకు."

"అలాగేనమ్మా! రేపట్నించి అసలు పొలం వెళ్ళటం లేదు. రాజీ వచ్చినప్పట్నించి నాకు పొలంలో పనితోనే సరిపోయింది. ఇక ఇంట్లోనే వుంటాను." అన్నాడు బావ.

మర్నాడు పొద్దున్నే మమ్మలిద్దర్నీ లేపింది అత్తయ్య.

నాకు వేడి నీళ్ళు పెట్టి తలంటి పోసింది.

తొమ్మిదింటికల్లా అత్తయ్య వంట పని పూర్తి చేసి తయారయింది.

నేను ఎర్రంచున్న తెల్ల చీర కట్టుకున్నాను. అది అమ్మ చీర. నాకు ఆ చీరంటే ఎంతో ఇష్టం. అందుకే వచ్చేటప్పుడు ఆ చీరను తెచ్చుకున్నాను.

బావ పైజామా, లాల్చీ వేశాడు.

ఇంటిని పాలేరుకి అప్ప చెప్పి ముగ్గురం బయలు దేరాం.

వూళ్ళో జనం మమ్మల్ని వింతగా చూస్తున్నారు. నేను కొంగు బుజం నిండా కప్పుకుని నడుస్తున్నాను.

"ఏమిటా తలొంచుకుని నడవడం? కొత్త పెళ్లికూతుర్లా! తలెత్తు" అన్నాడు బావ.

"ఉహూ" అంటూ ఇంకా వంచేశాను.

"అలాగే తలొంచుకు నడు–అదిగో ఆ వచ్చే ఆవు నీ మీద పడుతుంది" అన్నాడు.

నేను చటుక్కున తలెత్తి చుట్టు చూశాను. ఎక్కడా ఏ ఆవూ లేదు. బావ నవ్వుతున్నాడు.

నాకు ఉక్రోషం వచ్చింది.

"చూడత్తయ్యా!" అన్నాను.

"ఏమిట్రా! రోడ్డు మీద గోల" అని మందలించింది అత్తయ్య.

నేను చీర ఎత్తి పట్టుకుని తెల్ల చీర ఎక్కడ పాడవుతుందోనని మెల్ల మెల్లగా అడుగులు వేస్తున్నాను.

"ఏమిటి బావా! మీ రోడ్లింత అధ్వాన్నంగా వున్నాయి?"

"మరి పల్లెటూరు ఇంకెలా వుంటుంది?" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఇంక నేనేం మాట్లాడలేదు.

అయిదు నిమిషాల్లో గుడి చేరాం.

చిన్నగుడి.

గుడి ముందు పెద్ద పందిరి వేసి వుంది. లోపలి కెళ్ళాం.

లోపలంతా నిశ్శబ్దంగా వుంది. గుడి లోపలి నుంచి మాత్రం మంత్రాలు వినిపిస్తున్నాయి.

గుడి చుట్టు ప్రదక్షిణం చేశాం. లోపల వున్న వాళ్ళు బయటికి వచ్చారు. వాళ్ళ పూజ అయి పోయినట్టుంది.

[సశేషం]

### టాట్యానా




సాధారణంగా క్రీడలలో ఉత్సాహం, ప్రవేశం వున్న వనితలకు వివాహం అయ్యేసరికి క్రమ క్రమంగా ఆ ఆసక్తి మరుగున పడిపోతుంది. సరైన ప్రోత్సాహం లభించకపోయేసరికి–ఒకప్పుడు తాము క్రీడాకారిణులమన్న సంగతే 'మరిచి పోతారు'! చాలా కొద్దిమంది వనితలే వివాహం అయినా, కుటుంబ బాధ్యతలు నిర్వహించవలసి వచ్చినా, వాటికి ఒక ప్రక్క న్యాయం చేస్తూ, మరో ప్రక్క వీలు కల్పించుకుని వివిధ రంగాలలో తమకున్న ప్రావీణ్యాన్ని మెరుగుపరచుకోడానికి కృషి చేస్తుంటారు. మాస్కో ఒలింపిక్స్‌లో పాల్గొం టున్న సోవియట్ వనిత టాట్యానా కజన్‌కినా– అటువంటి వనితలలో ఒకరు! పరుగు పందాలలో పలు బహుమతులు గెల్చుకున్న టాట్యానాకు '78 నవంబర్‌లో ఒక ఆడపిల్ల పుట్టింది. ఐనా– ఈ సంవత్సరం ఒలింపిక్స్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని, గత సంవత్సరాంతం నుంచే, ఆమె మళ్ళీ అభ్యాసం ఆరంభించింది!

ఇరవైఐదేళ్ల టాట్యానా – '76 లో మాంట్రియల్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొని 800 మీటర్లు, 1,500 మీటర్ల పరుగుపందాలలో బంగారు పతకాలు సాధించింది. 800 మీటర్ల పందెంలో ఆమె తీసుకున్న వ్యవధి ఒక నిమిషం-54.94 సెకన్లు! ఇది ప్రపంచంలో ఒక కొత్త రికార్డుగా క్రీడాభిమానులు ప్రశంసించి–ఆమెను మెచ్చుకున్నారు. సరిగ్గా ఈ పోటీలో పాల్గొనడానికి ముందు 1,500 మీటర్ల దూరాన్ని మూడు నిమిషాల ఏభైఆరు సెకన్లలో పూర్తి చేసి, ఆమె మరో ప్రపంచ రికార్డును కూడా స్థాపించింది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ అమెచూర్ ఎథ్లెటిక్ యూనియన్ వారు టాట్యానాను ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తించి, ఆమెకు గౌరవ డిప్లొమాను బహుకరించారు.

టాట్యానా - లెనిన్‌గ్రాడ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థిని. ఆమె భర్త అలెగ్జాండర్ కోవలెంకో లెనిన్‌గ్రాడ్ యూనివర్శిటీలో లేబొరేటరీ అధిపతిగా పని చేస్తున్నారు.

# ఈ దీపం ఆరిపోదు

పెద్ద కథ

విన్నకోట సుశీలాదేవి

ఆ తర్వాత మేము లోపలికెళ్ళాం. అత్తయ్య పూజ చేయించింది.

అరగంట తర్వాత ప్రసాదం తీసుకుని బయట పడ్డాం.

"కాస్సేపు కూర్చుని వెడదాం" అంది అత్తయ్య.

ముగ్గురం మండపం మీద కూర్చున్నాం.

అత్తయ్య కొబ్బరికాయ కొట్టి ముక్కలు చేసి మా ఇద్దరికీ ఇచ్చింది!

"రాజీ! అంతసేపు కళ్ళు మూసుకుని కూర్చున్నావు ఏమని ప్రార్థించావేమిటి దేవుడిని?" అన్నాడు బావ కొంటెగా నావేపు చూస్తూ.

నేను కొబ్బరి కొరుకుతూ సమాధానం చెప్పబోయేంతలో —

"బాబుగారూ! మీరిక్కడ వున్నారా! నర్సిగాడు సంచీడు కాయలు పట్టుకొని పారిపోతున్నాడండీ!" అంటూ ఎవరో వ్యక్తి వచ్చి చెప్పాడు. బావ గబుక్కున లేచి నిలబడ్డాడు.

"రాస్కెల్! నమ్మి కాయలు అప్పచెప్తే ఎంత పని చేశాడు." అంటూ బయటికి పరిగెట్టాడు. నేనూ అత్తయ్యా తెల్లబోయాం.

ఇద్దరూ ఇంటికొచ్చాం.

నేను బట్టలు మార్చుకుని హాల్లో వున్న బల్ల మీద కూర్చున్నాను.

అత్తయ్య వచ్చి "రాజీ! నువ్వు భోజనం చేస్తావా!" అంది.

నాకు తినాలన్పించలేదు.

బావ ఒక్కడే వెళ్ళాడు. ఏం గొడవవుతోందో? నా మనసంతా అటే వుంది!


"లేదత్తయ్యా! నేను బావ వచ్చాక తింటాను" అన్నాను.

అత్తయ్య 'సరే' నంది.

"అత్తయ్యా! నర్సిగాడు మంచివాడు కాదా! అటువంటివాడిని ఎందుకు పనిలో పెట్టుకున్నారు?"

"మంచివాడేనే! ప్రసాద్‌కి కుడిభుజంలా కూడా వుండేవాడు. వాడికి ఏపని అప్పచెప్పినా నమ్మకంగానే చేసేవాడు. ఇప్పుడెందుకీ బుద్ధి పుట్టిందో?"

నేనెక్కడో చదివిన మాటలు జ్ఞాపకం వచ్చాయి.



ప్రతి మనిషిలోనూ మానవత్వం, రాక్షసత్వం రెండూ వుంటాయి. సామాన్యంగా మానవుడు మంచితనంతోనే ప్రవర్తించాలని ప్రయత్నిస్తాడు. కాని పరిస్థితులు, వాతావరణం అతనిలోని రాక్షసుడిని నిద్రలేపుతూ వుంటాయి. అలా ఒకసారి చెడుపని చేస్తే అదే అలవాటయి ఆ రాక్షసుడు అతనిలోని మనిషిని పూర్తిగా చంపేస్తాడు.

ఇప్పుడు ఏ పరిస్థితులు నర్సిగాడిచేత అలా చేయించాయో?

ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఇంతలో బయట ఏదో గోల విన్పించింది.

నేనూ, అత్తయ్యా బయటికి వచ్చాం.

బావ వస్తున్నాడు. అతని వెనక ముగ్గురు వ్యక్తులు వున్నారు. బావ వచ్చి అరుగు మీద కూర్చున్నాడు. వాళ్ళ ఎదురుగా చేతులు కట్టుకుని నిలబడ్డారు.

"నర్సిగా! నువ్వు దొంగతనం చేశావంటే నేను నమ్మలేకుండా వున్నాను! నిన్ను నమ్మి అన్ని కాయలు నీ చేతిలో పెట్టాగదా! ఇదేనా నువ్వు చెయ్యాల్సినపని!"

బావ మాటలు పూర్తికాకుండానే నర్సిగాడు గొల్లున ఏడుస్తూ బావ కాళ్ళ మీద పడిపోయాడు.


"బాబుగారూ! చమించండి. బుద్ధి తక్కువయి చేశాను."

"అదే ఎందుకు చేశావని! నీకు ఏం తక్కువ చేశానని ఇలా చేశావ్!"

"మీరేం తక్కువ చేయలేదు బాబూ! నా బతుకే సిల్లికుండలాటిది. ఎంత నీరు పోసినా అడుగు నుంచి కారిపోతునే వుంటుంది బాబూ! నా కష్టాలు ఈ కట్టెతోనే పోవాల" అని వలవలా ఏడ్చాడు.

నాకు కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. బావ కూడా చలించినట్లున్నాడు.

నర్సిగాడి రెండు చేతులూ పుచ్చుకుని లేవదీశాడు.



"నర్సీ! నీకు వచ్చిన కష్టమేమిటిరా?"

"ఏం చెయ్యను బాబూ! అన్నీ కష్టాలే ఇచ్చిన డబ్బు సాల్లేదని కూతుర్ని అల్లుడు తన్ని తగిలేశాడు. పెళ్ళానికి ఎప్పుడూ రోగమే. కొడుకు ఏదో తవ్వితల కెత్తుతాడని పొరుగూరికి పంపి సదివిచ్చాను బాబూ! ఆడిప్పుడు అటు సదూకి ఇటు కూలీకి దేనికీ పనికిరాకుండాపోయాడు. మిగతా పిల్లలు సిన్నోళ్లు. కర్చెక్కువ. సంపాదన తక్కువ. రెండ్రోజుల కితం సిన్నోడికి జరం వచ్చింది బాబూ! ఆడికి మందిప్పిద్దామంటే సేతిలో పైసా లేదు. అందుకని బుద్ధితక్కువై...".

అంటూ ఏడ్చాడు.

"నర్సిగా ఎంత పని చేశావ్‌రా! నీకేం కావాలన్నా నన్నడగమని చెప్పానుగదా!"

"బాబూ! మీ దగ్గర ఇప్పటికే ఎంతో తీసుకున్నాను."

"నర్సిగా! కష్టాలనేవి అందరికీ వుంటాయి. అటువంటి సమయంలోనే మనిషి ధైర్యంగా వుండి నీతికి నిలబడాలి. ఇప్పుడు చూడు—నువు చేసిన ఈ పని వలన నీమీద వున్న నమ్మకం అంతా పోగొట్టుకున్నావు. ఇకనుంచి ఇటువంటి పనులు చెయ్యకు. ఏం కావాలన్నా నన్నడుగు ఇస్తాను. సరేనా?"

నర్సిగాడు అలాగేనంటూ తలూపాడు.

"రేపు పొద్దున వచ్చి నీకెంత కావాలో తీసుకో. నీ కొడుకుని మా ఇంట్లో వుంచుకుంటాను. ఆచారిగారికి నేను చెప్పానని చెప్పి మందు తీసుకుని పిల్లాడికి వేయించు వెళ్లు."

నర్సిమ్ములు బావ కాళ్లపైబడి దణ్ణం పెడుతూ— "మీ రుణం ఎలా తీర్చుకోనుబాబూ." అన్నాడు.

"ఇకనుండి నమ్మకంగా వుండి మంచిగా ప్రవర్తించు. అదే నువ్వు చూపే కృతజ్ఞత" అంటూ బావ నర్సిగాడ్ని లేవదీశాడు.

అందరూ బావకి నమస్కారం చేసి వెళ్ళిపోయారు.

నేను ఆశ్చర్యంగా బావనే చూస్తున్నాను.

నిజంగా బావలాటి వాళ్ళుంటారా? తప్పు చేసిన వాడిని ఆదరించాడు. అతడు ఏ పరిస్థితులలో ఆ తప్పు చేశాడో కనుక్కున్నాడు. ఆ పరిస్థితులను మెరుగుపర్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

లోకంలో తప్పు చేసిన వాళ్ళకు శిక్షలు వేస్తుంటారు. ఆ తర్వాత వాళ్ళని బయటికి వదిలేస్తారు.

మళ్ళీ వాళ్ళు అవే తప్పులు చేసి మళ్ళీ జైళ్ళకు వస్తుంటారు. వాళ్ళకి అలా శిక్షలు వెయ్యకుండా వాళ్ళ పరిస్థితులను బాగుచేస్తే మళ్ళీ వాళ్ళు అటువంటి పనులు చెయ్యరు. అందరూ బావలాటి వాళ్ళుంటే....

"రాజీ! మంచునే నిద్రపోతున్నావా!"

"లేదు! నీ గురించే ఆలోచిస్తున్నాను."

"ఏమిటో అంత ఆలోచన."

"నిన్ను నర్సిగాడు దేవుడన్నాడు గదా! నీలో అంత దైవాంశ ఏం వుందా — అని."

బావ నవ్వి—"ఓ అదా! ఆకలవుతోంది ముందు అన్నం తిందాం. ఆ తర్వాత తీరిగ్గా ఆలోచిద్దువుగాని పద పద" అన్నాడు.

ఇద్దరం లోపలికెళ్ళి భోజనం దగ్గర కూర్చున్నాం.

*

అమ్మ ఇచ్చిన గడువు తీరిపోయింది. నేను రేపు వూరు వెళ్ళిపోవాలి. వెళ్ళే ముందు శ్రీలక్ష్మిని ఒక్కసారి చూడాలనిపించింది. సాయంత్రం నాలుగు గంటలకు బావ తోటలోకి వెళ్ళిపోయాక నేను అత్తయ్యతో చెప్పి శ్రీలక్ష్మి ఇంటికి బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి శ్రీలక్ష్మి ఇంట్లో సందడిగా వుంది. ఇంటి నిండా ఆడవాళ్ళు కన్పించారు. నేను వెళ్ళనా! వద్దా! అని సంశయిస్తోనే మెట్లు ఎక్కాను.

హఠాత్తుగా లోపలినుండి ఘొల్లున ఏడ్పు విన్పించింది. నేను ఆశ్చర్యపోతూ గుమ్మం దగ్గిరకెళ్ళాను. లోపలి దృశ్యం చూసి స్థాణువులా నిలబడిపోయాను. హాల్లో కుర్చీల్లో ఇద్దరు ఆడవాళ్ళు, ఇద్దరు మగవాళ్ళు కూర్చుని వున్నారు. పార్వతమ్మ వాళ్ళల్లో ఒకావిడ కాళ్ళమీద పడి ఏడుస్తోంది.

"వదినగారూ! అన్యాయం చెయ్యకండి! మీరు కోరిన కట్నం ఇస్తాను. అమ్మాయిని చేసుకోండి. దాన్ని కాదని నలుగురిలో తలవంపులు చెయ్యకండి. ఇవి చేతులు కావు. కాళ్ళనుకోండి."

ఆవిడని ప్రాధేయపడుతోంది.

ఆవిడ "అబ్బే! మాకు కట్నం కాదండీ పిల్ల ముఖ్యం. అమ్మాయి, అబ్బాయికి నచ్చాలి! ఏరా అంతేగా?" అని పక్కకు తిరిగి కొడుకుతో కాబోలు అంటోంది.

ఆ కుర్రాడు గంగిరెద్దులా తలూపుతున్నాడు.

'వస్తాం' అంటూ వాళ్ళు లేవబోయారు.

కాని పార్వతమ్మ వాళ్ళ కాళ్ళు పట్టుకుని లేవనీయడం లేదు. ఆవిడ విదిలించి వేస్తోంది.

నాకాదృశ్యం చూస్తూంటే కడుపులో దేవినట్లయింది.

ఇక అక్కడ వుండలేక ఇంటికి తిరిగి వెళ్ళిపోదామనుకుని వెనక్కి తిరిగి మెట్లు దిగబోతుండగా—

"రాజీ" అన్న పిలుపు విన్పించింది — అది శ్రీలక్ష్మి గొంతు.

ఎక్కడినుంచా అని చుట్టూ చూశాను.

"ఇక్కడ - ఇటు" అరుగు మీద నిలబడి పిలుస్తోంది. నేనటు చూడగానే నన్ను దగ్గిరకి రమ్మని సైగ చేసింది. నేను వెళ్ళాను.

నన్ను లోపలికి తీసికెళ్ళి గదిలో కూర్చోబెట్టింది.

అప్పుడు చూశాను శ్రీలక్ష్మిని సరిగ్గా. పట్టుచీర కట్టింది. ఒంటినిండా నగలు పెట్టుకుంది.

"లక్ష్మి? మీ అమ్మగారు ఆవిడ కాళ్ళమీదపడి ఏడుస్తున్నారెందుకు ఆవిడ ఎవరేమిటి!" అనడిగాను.

"ఆవిడా! వాళ్ళబ్బాయి నన్ను పెళ్ళి చేసుకుంటే ఆవిడకి నేను కోడల్ని అవుతాను. ఆవిడ అత్తగా




"నాలో ఎటువంటి ఆందోళన వున్నా అది నా శాంత వివాహం జరగడానికి నెలరోజుల ముందరే తగ్గిపోయింది."

—అన్నారు శ్రీ గుప్తా,* పాఠశాల ఉపాధ్యాయుడు, కాన్పూర్ బ్రాంచిలో ఎకౌంట్ హోల్డర్.

ఇండియన్ బ్యాంక్ రొఖ్ఖం సర్టిఫికెట్టు పథకంవలన శ్రీ గుప్తా వలె మీరు మీ అదృష్టాన్ని పెంపొందించుకోవచ్చు. ఆ వాస్తవ గాథ చూడండి.

"ఒక పెళ్ళి సంబంధం కుదర్చాలంటే లక్ష మాటలతో పని అనే సామెతవుంది. అయితే అది 'లక్ష రూపాయల' పని అని నేనంటాను. తగిన ఏర్పాట్లన్నీ చేసుకున్నా. నా ఏకైక కుమార్తె శాంత వివాహానికి ముందర నాకూ అలాగే అనిపించింది. 10 సంవత్సరాల క్రితం నేను చేసిందేమిటంటే, నేను రూ. 4000కి ఒక రొఖ్ఖం సర్టిఫికెట్టు కొన్నాను. అప్పుడు అది ఓ రోజున కలసి వస్తుందనుకున్నాను. శాంత వివాహం హఠాత్తుగా జరగవలసిరావడంతో అది నిజంగానే కలసివచ్చింది. నాలో ఎటువంటి ఆందోళన వున్నా అది నా శాంత వివాహం జరగడానికి నెలరోజుల ముందరే తగ్గిపోయింది"

శ్రీ గుప్తా అనుభవంతో లాభం పొందండి

శ్రీ గుప్తా వలె ప్రయత్నం ప్రారంభించండి. మీ దగ్గరిలోనున్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచి మానేజర్‌ని చూడండి. మీకు సలహా యివ్వడానికి సరియయిన వ్యక్తి ఆయనే.

*అసలు పేర్లు రహస్యంగా వుంచాలనే వుద్దేశంతో ఇక్కడ పేర్లు కల్పించబడ్డాయి.

ఇండియన్ బ్యాంక్

(భారత ప్రభుత్వ యాజమాన్య సంస్థ)

మీ సుఖసమృద్ధికి సహకారి

SAA/IB/774/TEL

రవుతుంది. అమ్మ అలా చెయ్యమనే ఏడుస్తోంది.''

నేను తెల్లబోయాను.

"దానికి ఏడవడమెందుకు?''

"నీకు తెలీదు రాజీ! పెళ్లిచూపుల కొచ్చి నచ్చలేదని వెళ్లిపోతే ఎంత అవమానం! రేపు ఈ పల్లెటూళ్లో అమ్మ తలెత్తుకుని తిరగ్గలదా! అదీ కాక నాకు వెంటనే పెద్ద సంబంధం చూసి పెళ్లిచేసి మీ అత్తయ్యను గర్వంగా చూడాలని వుంది అమ్మకు. అందుకే ఎలాగైనా ఈ సంబంధం చెయ్యాలని అమ్మ తాపత్రయం''

"అందుకని! వాళ్లు వద్దంటూంటే అలా కాళ్లు పుచ్చుకుని బతిమలాడటం ఎందుకు? ఆవిడేమో విదిల్చికొడ్తోంది''

"ఏం చేస్తాం రాజీ! మనం ఆడపిల్లలం! ఎన్ని అవమానాలైనా సహించాలి''

ఆ మాటంటేనే నాకు కోపంవస్తుంది.

ఆడపిల్లలైనంత మాత్రాన అంత హీనమై పోవాలా!

"రాజీ! అమ్మ రెండ్రోజుల్నుంచీ నామీద ఎంత కోపంగా వుందో తెలుసా! నన్ను ఒకటే తిట్టిపోస్తోంది. నేను దరిద్రపు దాన్నట. నాకు పెళ్ళయ్యే యోగమే లేదట. ఇప్పుడీ పెళ్లి కాకపోతే ఇంకెంత తిట్టుందో?''

శ్రీలక్ష్మి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

ఆ పిల్ల తనకు పెళ్లి కాదని ఏడుస్తోందో—అమ్మ తిట్టుందని ఏడుస్తోందో తెలీలేదు!

"లక్ష్మీ! ఏడవకు! అయినా ఈ అబ్బాయేం బావున్నాడని. నీకింతకన్నా చక్కటివాడు వస్తాడు. విచారించకు.''

శ్రీలక్ష్మిని అంతకన్నా ఎలా ఓదార్చాలో నాకు తెలీలేదు.

లక్ష్మి కళ్లు తుడుచుకుంది. "లక్ష్మీ నేను రేపు వెళ్లిపోతున్నాను.''

"రేపేనా!''

"ఆ! వచ్చి వారం అవుతోందిగా వెళ్ళాలి.''

శ్రీలక్ష్మి నా చెయ్యి పుచ్చుకుంది.

"నువ్వూ వెళ్లిపోతావా!'' అని జాలిగా అడిగింది.

నాకు బాధ వేసింది.

కానీ ఏం చెయ్యగలను?

"లక్ష్మీ? రేపు అత్తయ్య ఇంటికి రాకూడదూ!''

"ఉహూ! అమ్మ పంపదు. ఇవ్వాళ వాళ్లు వెళ్లిపోయాక వుంటుంది నా పని. అమ్మ నన్ను ఇవ్వాళ కొట్టినా కొట్టొచ్చు. రాజీ! అమ్మకి కన్పించకుండా నన్నెక్కడైనా దాచేయకూడదూ.''

లక్ష్మి అలా దీనంగా అడుగుతూంటే నా గుండెలు పిండినట్లయింది.

ఆ క్షణంలో పార్వతమ్మ మీద విపరీతమైన కోపం వచ్చింది. శ్రీ లక్ష్మికి ధైర్యంగా ఏదో చెప్పబోయాను.

ఇంతలో లోపలినుంచి—

"శ్రీలక్ష్మీ'' అన్న పిలుపు విన్పించింది.

నేను చటుక్కున లేచి నుంచున్నాను.

"లక్ష్మీ! ఎవరో పిలుస్తున్నారు. నేను వెళ్తాను. మళ్లీ కలుస్తామో లేదో! నన్ను జ్ఞాపకం వుంచుకుంటావ్ కదూ!'' అన్నాను.

శ్రీలక్ష్మి కళ్లు రెండూ సెలయేటి వూటలయ్యాయి.

నాకూ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

మూడు రోజుల పరిచయానికి ఎంతటి అనుబంధం ఏర్పడింది!

మళ్లీ లోపల్నుంచి పిలుపు విన్పించింది.

నేను కంగారుపడుతూ "వస్తా లక్ష్మీ'' అంటూ అక్కడనుంచి వచ్చేశాను.

ఇంటికి వచ్చానన్న మాటేగానీ కూచున్నా, పడుకున్నా, పార్వతమ్మ ఆవిడ కాళ్ళమీదపడి ఏడుస్తున్న దృశ్యమే నా కళ్ళముందు మెదలసాగింది.

కూతురి పెళ్లి కోసం తల్లితండ్రులు బాధపడ్తారని తెలుసు. కాని ఇంతగా దిగజారి కాళ్లు పట్టుకుని బ్రతిమిలాడడమే అసహ్యంగా వుంది.

పెళ్లి ఒక్క ఆడపిల్లకేనా! మగాడికి అక్ఖర్లేదా?

పార్వతమ్మలాటి వాళ్లుండబట్టే, తామేదో అమ్మాయిల్ని వుద్ధరించడానికి పెళ్ళాడుతున్నట్లు. తాము లేకపోతే వాళ్ళ బ్రతుకే లేదన్నట్లు ప్రవర్తిస్తున్నారు, ఈనాటి పెళ్లికొడుకులు.

ఆడపిల్ల ఎంత తేలికయింది!

ఆమెకొక వ్యక్తిత్వం లేదు, ఆశలు లేవు, ఆశయాలు లేవు, పుట్టిన దగ్గర్నించీ పెళ్లి కోసం ఎదురు చూడ్డం; ఆ తర్వాత గానుగెద్దులా జీవించడం!

ఆలోచిస్తోంటే గుండె బరువెక్కింది. రాత్రి ఎప్పటికో నిద్ర పట్టింది.

*

తెల్లవారింది.

మెలకువ వచ్చినా అలా పడుకునే వున్నాను. ఈ రోజు సాయంత్రమే నా ప్రయాణం.

ఆ మాట అనుకోగానే విపరీతమైన బాధ కల్గింది. ఈ వూరి నుంచి వెళ్ళాలని లేదు. ఈ పరిసరాలూ, వాతావరణం నాకెంతో నచ్చాయి, ముఖ్యంగా బావని వదిలి అసలు వెళ్ళాలని లేదు.

కాలం ఇలా ఆగిపోతే ఎంత బావుంటుంది!

చుట్టూ చూశాను.

సూర్యుడు అప్పుడే పైకి వచ్చినట్లున్నాడు. ఎదురుగా ఆకుల మీద ఎర్రటి కిరణాలు.... చెట్ల ఆకులు మెల్లగా కదులుతున్నాయి.

ఇలా ఆలోచిస్తూ పడుకుంటే మనసు పాడవుతుందని లేచి యింట్లోకి వెళ్ళాను.

ఇంట్లో బావ కన్పించలేదు. అత్తయ్య వంట పనిలో వుంది. ముఖం కడుక్కు వచ్చాను. అత్తయ్య నాకు పాల గ్లాసు అందిస్తూ—

"రాజీ! నువ్వు వెళ్ళిపోతూ వుంటే నాకు కాలూ, చెయ్యీ ఆడటం లేదే! ఏ పనీ చెయ్య బుద్ధి కావటం లేదే!'' అంది విచారంగా.

నా పరిస్థితీ అలాగే వుంది. కాని ఏం చెయ్యను?

"బాధపడకత్తయ్యా! మళ్ళీ ఎప్పుడైనా వస్తాను గదా!''

"ఎప్పుడైనా కాదే! శాశ్వతంగా ఈ ఇంట్లో వుండటానికే రావాలి.''

నేను సిగ్గుపడి తలొంచుకున్నాను. క్షణం ఆగి అన్నాను—"బావా లేడా! అత్తయ్యా?''

"వాడా! పొద్దున్నే లేచి ఎక్కడికో వెళ్ళాడు. భోజన సమయానికి వచ్చేస్తానన్నాడు. రాత్రి నిద్ర పోనట్టుంది వాడి ముఖమంతా పీక్కు పోయిందే!'

బావ ఎంత బాధపడుతున్నాడో! అక్కడినుంచి లేచి దొడ్లోకి వచ్చాను. కాసేపు మొక్కల మధ్య తిరిగాను. ఆ తర్వాత అత్తయ్య దగ్గర కూర్చుని కబుర్లు చెప్పాను. అత్తయ్య వంట పూర్తిచేసి నాకు తలంటి పోసింది.

పదకొండు గంటల ప్రాంతంలో వచ్చాడు బావ.

స్నానం చేశాడు.

ఇద్దరం భోజనం చేశాం.

అత్తయ్య ఆ రోజు నాకిష్టమైన గారెలూ, పాయసం చేసింది.

భోజనమయ్యాక బావ అన్నాడు.

"రాజీ! నిద్రపోతావా!"

"ఊహూ!" అన్నాను.

"కాస్సేపు నా గదిలో కూర్చుందాం! రా" అని పిల్చాడు.

బావ వెంట నడిచాను. ఇద్దరం గదిలో కూర్చున్నాం. బావ ఏమన్నా మాట్లాడుతాదేమోనని చూస్తున్నాను. కాని బావ నా ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు. నేను బావ వేపే చూస్తున్నాను. నాకూ ఎన్నో మాట్లాడాలని వుంది. కాని పెదవులు విడివడటంలేదు. ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం చూసుకుంటూ కూర్చున్నాం.

మేము మాట్లాడుకోకపోయినా మా కళ్ళు ఎన్ని కబుర్లు చెప్పుకున్నాయో!

మా మనసులు ఎన్ని అనుభూతులు పంచుకున్నాయో!

అలా ఎంతసేపు కూర్చున్నామో తెలీదు.

"అదేమిట్రా! అలా వులుకూ, పలుకూ లేకుండా కూర్చున్నారు!" అంటూ వచ్చింది అత్తయ్య.

మేమిద్దరం వులిక్కిపడ్డాం.

బావ లేచి బయటికి వెళ్ళిపోయాడు. నా గుండెల్లోంచి దుఃఖం పెల్లుబికి వస్తోంది.

జీవితాంతం అలా బావవేపు చూస్తూ కూర్చుండిపోతే! అంతకంటె ఇంకేం కావాలి! నా మనస్సును అదుపులో పెట్టుకోలేకపోతున్నాను. అత్తయ్య ఏదో అడుగుతోంది కాని నేను సమాధానం చెప్పలేక పోయాను.

"నిద్రవస్తోందత్తయ్యా!" అంటూ అక్కడి నుంచి లేచి నా గదిలోకి వచ్చి మంచం మీద వాలాను.

ప్రేమ ఎంత మధురమైనది!

ఏదైనా వీలైనంత త్వరలో బావని పెళ్ళి చేసుకుని ఈ ఇంటికి కోడలిగా రావాలి.

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను.

తిరిగి నాల్గు గంటలకు మెలకువ వచ్చింది. ఆరింటికి రైలు.

నేను లేచి గబగబా తయారయ్యాను.

నేను ముఖం కడుక్కురాగానే అత్తయ్య నా దగ్గిరికొచ్చి—

"రాజీ! ఈ చీర కట్టుకో" అంది.



## మారియా

క్రీడారంగంలో ఎప్పటికప్పుడు కొత్తవారు ప్రవేశిస్తూనే వుంటారు. ఆ విధంగా ఆటల్లో కొంత కొత్తదనం, ఆకర్షణ కనిపిస్తూనే వుంటాయి. సోవియట్ రష్యాలో జిమ్నాస్టిక్స్‌లో తురిష్చెవా, కొర్బుట్, సాదీ మున్నగు వనితలు మంచి పేరు తెచ్చుకుని, నిష్క్రమించడంతో, మరి కొందరు కొత్తవారికి స్థానం లభించింది. వాళ్ళల్లో 'తార' స్థాయికి చేరుకున్న వనిత మారియా ఫిలటోవా.

చిన్నప్పుడు కిండర్‌గార్టెన్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే, మారియాకు జిమ్నాస్టిక్స్ మీద ఆసక్తి ఏర్పడింది. '68 లో ఆమె – లెనినిస్క్ – కుజెనెట్‌స్కీలో యువతీ యువకులకై ప్రత్యేకంగా స్థాపించబడిన ఆటల పాఠశాలలో చేరింది. కొంత కాలానికి ఆ పాఠశాలే - సైబీరియా అంతటికీ - జిమ్నాస్టిక్ కేంద్రంగా రూపొందింది.

ఇంటర్నేషనల్ జిమ్నాస్టిక్ ఫెడరేషన్ అధ్యక్షుడు యూరీటిటోవ్ - ఆ కేంద్రాన్ని చూసి, "జాతీయ విజేతలు, ఒలింపిక్ ఛాంపియన్‌లు ఇక్కడి నుంచే ఎక్కువగా వస్తారన్న నమ్మకం నాకు ఏర్పడుతోంది!" అన్నారు. ఆయన చెప్పినట్లుగానే, ఆ కేంద్రంలో తన ప్రావీణ్యానికి మెరుగులు దిద్దుకున్న మారియా - ఇప్పుడు జిమ్నాస్టిక్స్‌లో 'ప్రపంచతార' అయింది!

'76 లో జిమ్నాస్టిక్స్‌లో ఆమె తన జట్టుతో పాల్గొని ఒలింపిక్ ఛాంపియన్ అయింది. '77 లో జాతీయస్థాయిలో - బంగారుపతకం సాధించింది. 77, 78 సంవత్సరాలలో జరిగిన పోటీలలో పాల్గొని ప్రపంచకప్‌ను గెల్చుకుంది. స్ట్రాస్‌బూర్గ్ (ఫ్రాన్స్)లో జరిగిన ప్రపంచ పోటీలలో కూడా ఈమె నాయకత్వంలో పాల్గొన్న జట్టు బంగారు పతకం సాధించింది. మాస్కోలో జరుగనున్న ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న మారియాకు - ముందు ముందు మరెన్నో బహుమతులు గెల్చుకోగలనన్న నమ్మకం పూర్తిగా వుంది!

నేను కొత్త చీర కట్టుకుని అత్తయ్య కాళ్ళకు నమస్కారం చేశాను.

"సుమంగళిగా పిల్లా పాపలతో నూరేళ్ళు వర్ధిల్లు" అని దీవించి అత్తయ్య నన్ను తీసుకుంది. నా నుదుటి మీద ప్రేమతో ముద్దు పెట్టుకుని—

"బావకు చూపించిరా" అంది.

"ఎక్కడున్నాడు?"

"అడుగో! ఆ గదిలో"

నేను గదిలోకి అడుగుపెట్టాను. బావ కిటికీ దగ్గర నిలబడి బయటికి చూస్తున్నాడు.

నేను వంగి బావ కాళ్ళపై చేతులుంచాను. బావ చట్టున వెనక్కి తిరిగాడు.

"రాజీ! ఏమిటా పని?" అన్నాడు.

నేను లేచి – "ఏం లేదు బావా! పెద్దవాడివి కదా! కొత్తచీర కట్టుకున్నాను. నమస్కరిస్తున్నా" అన్నాను.

"ఓహో! మరి ఏమని దీవించను?" అన్నాడు బావ సీరియస్‌గా.

"అది నీ యిష్టం."

"పెద్ద చదువులు చదివి, ఇంకా పెద్ద వుద్యోగం చేసి నాలాటి వాళ్ళచేత కాళ్లు పట్టించుకోవాలి" అన్నాడు.

నేను ఫక్కున నవ్వాను.

బావ ముఖం చిట్లించాడు.

"ఏం బాగా లేదా!"

"ఊహుం!"

"పోనీ నేనొక్కడినే నీ కాళ్లు పట్టాలి. ఇది బాగుందా!"

"ఆఁ బాగుంది నీకు మల్లే!" అన్నాను వెక్కిరింపుగా.

బావ తన వంక చూసుకుంటూ—

"నాకేం పెళ్ళికొడుకులా వున్నాను" అన్నాడు.

బావ వేపు చూశాను. బావ నిజంగా పెళ్లికొడుకులానే వున్నాడు. తెల్లటి గ్లాస్కో పంచ, పైన తెల్లటి సిల్కు లాల్చీ. మెరిసిపోతున్నాడు. నేను చూపు మరల్చుకోలేకపోయాను.

"ఎలా వున్నాను! రెప్ప వాల్చక చూస్తున్నావ్! అంత బాగున్నానా!"

"ఆఁ! బాగున్నావు. పెళ్లికూతురు ఒక్కటే తక్కువ."

"నువ్వున్నావుగా ఎలాగూ పట్టు చీర కట్టుకున్నావు. కాసేపు ఆ పాత్ర ధరించు." అన్నాడు నా కళ్ళల్లోకి చూస్తూ.

"ఊఁ! అందుకే కట్టుకున్నాను పట్టు చీర" జారిపోతున్న పమిట చెంగుని పైకి తోసుకుంటూ అన్నాను.

"ఎందుకు కట్టుకున్నా చీర మాత్రం నీకు చాలా బాగుంది. రాజీ! నిన్నిలా చూస్తుంటే...." అంటూ బావ దగ్గిరగా వచ్చి నిలబడ్డాడు. బావ వూపిరి నాకు వెచ్చగా తగుల్తోంది. గాలిలో ఆకులా వణికాను.

బావ చటుక్కున—

"రాజీ!" అంటూ దగ్గిరికి లాక్కుని హృదయానికి హత్తుకున్నాడు. నేను రెండు చేతులూ బావ చుట్టూ వేసి బావని అంటుకుపోయాను. తియ్యని అనుభూతి నరనరాల్లో పాకింది. మనసు ఎక్కడెక్కడో విహరిస్తోంది.

బయటి నుంచి "రాజీ!" అని అత్తయ్య పిలవడంతో ఇద్దరు వులిక్కిపడ్డాం. బావ రెండు చేతులతో నా ముఖం పట్టుకుని పెదవులపై గట్టిగా ముద్దు పెట్టుకుని వదిలేశాడు.

నేను రెండు నిముషాలకుగానీ తిరిగి ఈ లోకంలోకి రాలేకపోయాను. శరీరమంతా నిస్సత్తువగా అన్పించింది. మనసంతా శూన్యంగా వుంది. బావ హృదయంపై తల పెట్టుకుని పడుకోవాలని వుంది.

అత్తయ్య గదిలోకి వచ్చి—

"రాజీ! అలా నిలబడిపోయామే–పద పద! మళ్లీ వర్షం వస్తుంది" అంది.

బావ బండీ తీసుకు వచ్చాడు. పాలేరు బండీలో సామాన్లు పెట్టాడు.

"వెళ్ళొస్తానత్తయ్యా!" అన్నాను.

అత్తయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నా చేయి పట్టుకుని—

"రాజీ! ఈ చీకటింట్లో దీపంలా తిరిగావు! త్వరలో వచ్చి ఈ యింట్లో దీపం వెలిగించాలి. రాజీ! ఈ దురదృష్టవంతురాలైన అత్తయ్య కోసమైనా త్వరగా వస్తావు కదూ!" అంది అత్తయ్య.

"వస్తానత్తయ్యా తప్పక వస్తాను. నేను మాత్రం వుండగలనా?" అన్నాను.

బావ "రాజీ!" అని పిలుస్తున్నాడు వాకిట్లోంచి.

నేను అత్తయ్యతో మళ్ళీ ఒక్కసారి చెప్పి వెళ్లి బండీలో కూర్చున్నాను.

బండి కదిలింది.

అత్తయ్య బండివేపే చూస్తోంది.

వియోగం యెంత బాధ కలిగిస్తుందో మొదటి సారిగా తెలిసింది!

బండి నెమ్మదిగా కదుల్తోంది. నేను తిరిగిన ప్రదేశాలు, నేను పొందిన అనుభవాలు కళ్ళ ముందు కదుల్తున్నాయి. దూరంగా చెట్లు గాలికి కదుల్తోంటే నన్ను వెళ్ళొద్దని బతిమాలుతున్నట్లుగా వుంది.

ఈ గాలినీ, సంజ కాంతిలో తళతళలాడే కాలువనీ, చుక్కలతో మెరిసే ఈ ఆకాశాన్నీ వదిలి వెళ్ళాలని లేదు.

ఈ ఆకులో ఆకునై, కొమ్మలో కొమ్మనై వుండిపోతే ఎంత బాగుంటుంది!

ఈ వూరిని మర్చిపోలేను. అత్తయ్య అనురాగాన్ని మర్చిపోలేను. బావ! బావ ఈరోజు ఇచ్చిన తియ్యటి ముద్దుని జన్మంతా మరిచిపోలేను. ఆ అనుభవం తలుచుకోగానే శరీరం ఒక్కసారి స్పందించింది. తల తిప్పి బావవేపు చూశాను. బావ బండివాడి ప్రక్కన కూర్చుని బయటికి చూస్తున్నాడు.

స్టేషన్ వచ్చింది. బావ దిగి నాకు చేయి అందించాడు. నేను దిగాను. ఇద్దరం స్టేషన్లోకి వెళ్ళాం. స్టేషనంతా నిశ్శబ్దంగా వుంది.

సూర్యుడు పడమటి ఇంటివేపు వెళ్ళిపోతున్నాడు. స్టేషన్ వెనక్కి వెళ్ళి అక్కడ చెట్టు కింద వున్న సిమెంటు బెంచీ మీద కూర్చున్నాను. బావ వచ్చి—

"రాజీ! బండీ అరగంట లేటుట" అన్నాడు నా ప్రక్క కూర్చుంటూ.

బండీవాడా సామాన్లు నా ప్రక్కనే పెట్టి వెళ్ళిపోయాడు.

"రాజీ! అలా వున్నావేం"

"ఏం లేదు" అన్నాను తలొంచుకుని.

"ఇందాకటి దానికి బాధపడుతున్నావా! అయాం సారీ! ఆవేశం ఆపుకోలేకపోయాను."

"ఛ! అదేం లేదు బావా! ఈ వూరు వదిలి వెళ్తున్నందుకే బాధగా వుంది" అన్నాను బావవేపు చూస్తూ.

నవ్వాడు బావ. "అమ్మయ్య బ్రతికించావ్! నామీద కోపమేమో అనుకున్నాను. పోనీ, అంత నచ్చితే వుండి పోకూడదూ!" అన్నాడు నావేపు చూస్తూ.

"ఇంకా నయం. అమ్మ వూరుకోదు."

"ఊరుకోదా! సమయం రానీ చెప్తాను. ఎవరు వూరుకున్నా వూరుకోకపోయినా నిన్ను...." అంటూ నా చేతిని పట్టుకుని దగ్గిరికి లాక్కున్నాడు.

ఇందాక బావ కళ్ళల్లో కనిపించిన ఆవేశం, కోర్కె మళ్లీ కన్పించాయి.

"బావా! ఏమిటిది ఎవరైనా చూస్తారు!"

"ఆ! ఎవరు చూస్తారు చుట్టూ అరణ్యమేగా. చూసినా ఫర్వా లేదు లే. మొగుడూ పెళ్ళాలనుకుంటారు" అంటూ బావ నా ముఖాన్ని దగ్గరికి లాక్కుని నా పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు.

నా శరీరం స్పృహ తప్పినట్లయింది. చుట్టూ వున్న చరాచర ప్రపంచం మాయమై ఏ లోకం లోనో నేనూ బావే వున్నట్లనిపించింది! అలా ఎంతసేపున్నామో! దూరంగా రైలు కూత విన్పించింది.

బావ ఒక్కసారిగా చేతులు వదిలేసి-"లే రాజీ! రైలు వచ్చేస్తోంది." అన్నాడు.

జారిపోతున్న పమిటని సరిచేసుకుంటూ-వెధవ రైలు ముంచుకు పోతున్నట్లు ఇప్పుడే రావాలా! అని విసుక్కున్నాను.

"రాజీ! త్వరగా రా! ఇక్కడ రైలు ఎక్కువ సేపు ఆగదు" అన్నాడు.

నిద్రలో నడుస్తున్నట్లు నడిచి రైలెక్కాను. బావ కూడా నాతోపాటే రైలెక్కాడు. వూరు చేరేసరికి వుదయం ఎనిమిదయింది. బావ నా సామాన్లు దింపి నన్ను రిక్షా ఎక్కించి___

"రాజీ! వెళ్ళగలవా!" అన్నాడు.

"వెళ్తాను బావా!" అన్నాను.

"నేను మళ్ళీ మధ్యాహ్నం వెళ్ళిపోతాను. రాజీ! మళ్ళీ ఎప్పటికి కలుస్తామో!" బావ నాచేయి పట్టుకుని మెల్లగా నొక్కాడు.

నాకళ్ళల్లో నీళ్లు తిరిగాయి. మనసంతా దిగులుతో నిండిపోయింది. ఏదో శూన్యంలోకి తోసివేసినట్లని పించింది.

రిక్షా నెమ్మదిగా కదిలింది_నన్నూ, నా బావనీ వేరు చేస్తూ.

*

ఏదో బిగ్గరగా నవ్వులు విన్పించాయి. నేను వులిక్కిపడి బరువైన ఆలోచనల్లో నుండి బయట పడ్డాను. సరోజ ఎందుకో బిగ్గరగా నవ్వుతోంది.

అయితే వీళ్ళు సినిమా నుంచి వచ్చారన్న మాట. ఇక్కడ నేనున్నానన్న జ్ఞానం కూడా లేకుండా ఎంతగా నవ్వుకుంటున్నారు! కాని వాళ్ళను గూర్చి ఆలోచించి ప్రశాంతంగా వున్న నామనస్సుని పాడు చేసుకోదల్చలేదు!

ఇన్నేళ్ళూ విధి చేతిలో కీలుబొమ్మలా ఆడాను. ఇప్పుడు కూడా అంతే! ఎలా జరగాలని వుందో అలాగే జరుగుతుంది.

మళ్ళీ కళ్ళు మూసుకున్నాను. మనస్సు మళ్ళీ ఆ పాత అనుభూతులనే నెమరు వేస్తోంది.

*

మనిషి జీవితం యాభై ఏళ్ళుండవచ్చు. అరవై



బీట్ రూట్ లోనూ-దాని ఆకుల్లోనూ ఎంతో విలువైన పోషకాహారాలు వున్నాయి. ముఖ్యంగా అందులోని కోలిన్ (Cholin) ఊపిరితిత్తుల ఆరోగ్యానికి చాలా మంచిది. గుండెజబ్బులు గలవారికి, రక్తంలో కొలెస్టెరాల్ ఎక్కువగా వున్నవారికి ఇది ఎంతో ఆరోగ్యదాయకమని డాక్టర్ల తీర్మానం.

ఏళ్ళుండవచ్చు. కాని అంతటి జీవితంలోనూ అతడు నిజంగా అనుభూతిని పొందేదీ నిజమైన ఆనందాన్ని పొందేదీ ఏ కొద్ది క్షణాలు మాత్రమే!

అలాగే ఇంత జీవితంలోనూ నేను నిజంగా ఆనందం పొందినవి, ఆ వారం రోజులే.

అవి చల్లనివేళ జ్ఞాపకం చేసుకోదగిన కమ్మని జ్ఞాపకాలు. మరిచిపోలేని మధుర భావనలు. ఏమీ తోచనప్పుడు మనసు దిగులుగా వున్నప్పుడు వాటిని తలచుకుంటాను. నాలో నేనే సంతృప్తిపడు తుంటాను. అందుకే అవి ఇప్పటికీ నిన్న, మొన్న జరిగినంత కొత్తగా వున్నాయి.

బావా వాళ్ళు వూరు నుంచి వచ్చాక శెలవు రోజు లన్నీ భవిష్యత్తుని గూర్చిన రంగుల స్వప్నాలు కంటూ, పేకమేడలు కడ్తూ గడిపేశాను.

ఆ రోజు ఆదివారం.

ఉదయం నేను లేచేసరికి తొమ్మిదయింది. పాలు తాగి పేపరు తెచ్చుకుందామని నాన్నగారి గదిలోకి వెళ్ళబోయాను. లోపలినుంచి ఏవో మాటలు విన్పిస్తున్నాయి. నేను గుమ్మంలోనే ఆగి పోయాను.

నాన్నగారు అంటున్నారు___

"వీలైనంత త్వరలో ఆ సంబంధాన్ని సెటిల్ చెయ్యండి. అది అన్ని విధాలా బాగుంది."

"అలాగేనండీ!" అవతలి వ్యక్తి సమాధానం ఇచ్చాడు.

ఏదో పెళ్ళి విషయంలావుంది. ఎవరికో? పెద్దన్నయ్యకే అయివుంటుంది. నేను వెనక్కు తిరిగి వంటింట్లోకి వచ్చాను.

అమ్మ కూరలు తరుగుతోంది. నాకు నాన్నగారు మాట్లాడే విషయం తెలుసుకోవాలని ఆరాటంగా వుంది. అమ్మ ప్రక్కనే కూర్చుని గిన్నెలోంచి కాయలు తీసి అమ్మకి అందిస్తున్నాను.

రెండు నిముషాలయ్యాక___

"అమ్మా! నాన్నగారు ఎవరికి సంబంధాలు చూస్తున్నారు పెద్దన్నయ్యకా" అన్నాను.

అమ్మ తలెత్తింది.

"కాదు రాజీ! నీకే ఆడపిల్లవి ముందు నీకు కాకుండా అన్నయ్యకు పెళ్ళేమిటి?" అంది.

నేను అదిరిపోయాను.

"నాకు పెళ్ళా!"

నాన్నగారి మాటల్నిబట్టి చూస్తోంటే పెళ్ళి త్వరలోనే నిశ్చయమయేట్టుంది. ఇక లాభంలేదు. వెంటనే నా మనసులోని మాటను చెప్పేయాలి.

Vemakoti Seeta Rama Sastry
WRITER
RAMAKRISHNA NAGAR
SRIKAKULAM.

అమ్మకి దగ్గరగా జరిగి___

"అమ్మా" అన్నాను మెల్లగా.

అమ్మ చేస్తోన్న పని ఆపి నా ముఖంలోకి చూసింది.

"రాజీ! ఏమన్నా చెప్పాలనుకుంటే చెప్పమ్మా నా దగ్గర భయం ఎందుకు!" అంది.

అమ్మ మాటల్తో నాకు ధైర్యం కల్గింది.

"అమ్మా! నేను బావని చేసుకుంటానమ్మా" అన్నాను.

అమ్మ ఆశ్చర్యంగా చూసి___

"బావనా" అంది.

"అవునమ్మా! అనుకోకుండా బావని కలిశాను. బావ చాలా మంచివాడమ్మా" అంటూ బావని గూర్చి చెప్పాను. కాని అమ్మ "అది కాని పని రాజీ! మీ నాన్నగారికి వాళ్ళంటే ఎంత కోపమో నీకు తెలీదు. నువ్వు పుట్టినప్పుడు మీ అత్తయ్య నిన్ను చూడ్డానికి వచ్చింది. కాని మీ నాన్నగారు ఆవిడని ఇంట్లోకి రానియ్యలేదు. నువు ఇంటి గడప తొక్కడానికి వీల్లేదు అని మీ అత్తయ్యను శాసించిన మీ నాన్న బావతో నీ పెళ్ళి చేస్తారంటే నాకు నమ్మకంలేదు రాజీ!"

అమ్మ మాటలు వింటోంటే నా గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి. నాకు కంగారుగా వుంది. ఇప్పుడు నేనేం చెయ్యాలి! నాన్నగారు ఒప్పుకోరు. ఒప్పుకోకపోతే ఇంకెవరితోనో నా పెళ్ళి అయి పోతుంది. ఆ తర్వాత....ఆలోచించలేకపోయాను.

నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. నా కళ్ళల్లో నీళ్లు చూసి అమ్మ చటుక్కున లేచి నా దగ్గరికి వచ్చింది.

"రాజీ! ఏడవకమ్మా! నాన్నగారితో నేను చెప్తానుగా."

అమ్మ అలా అంటోంటే నా దుఃఖం ఇంకా ఎక్కువైంది. అమ్మ భుజం మీద తలపెట్టి ఏడ్చాను.

"రాజీ ఏడవకు తల్లీ! నాకే కనుక స్వేచ్ఛ వుంటే నువ్వు కోరుకున్న వ్యక్తి నా శత్రువైనా సరే ఆతన్ని నీకిచ్చి పెళ్ళి చేసేదాన్ని. నాన్నగారు పట్టుదలగల మనిషి. అయినా నేను నచ్చచెప్తానుగా వూరుకో రాజీ!"

అమ్మ సముదాయించసాగింది. నేను సర్దుకున్నాను. అమ్మ మాటల్తో కాస్త ధైర్యం కలిగింది. ఇంతవరకూ నేను కోరింది ఏదీ కాదనలేదు నాన్నగారు. నేను పుట్టిన తర్వాతనే వ్యాపారంలో బాగా కలిసొచ్చిందిట అందుకే నాన్నగారు నాకు ఎప్పుడూ ఏ కష్టమూ కలిగించలేదు. ఇప్పుడు కూడా నా మనస్సును కష్టపెట్టే విధంగా నాన్నగారు ప్రవర్తించకపోవచ్చు!

ఇలా అనుకోగానే నా మనస్సు కుదుటపడ్డది.

ఆ రాత్రి భోజనాలయ్యాక నాన్నగారు తన గదిలోకి వెళ్ళబోతూ—

"రాజీ! భోజనం చేశాక నా గదిలోకి ఒకసారి రావమ్మా" అన్నారు.

నేను గతుక్కుమన్నాను.

నాన్నగారు ఎందుకు రమ్మంటున్నారో అర్థం అయింది. అమ్మ చెప్పి వుంటుంది.

ఏం మాట్లాడుతారో?

అన్నం ఎలాగో తిన్నాననిపించి నాన్నగారి గదిలోకి వెళ్ళాను. నాన్నగారు మంచంమీద కూర్చుని ఏదో చదువుకుంటున్నారు. నా అడుగుల చప్పుడు విని తలెత్తి చూసి—

"రాజీ! రామ్మా" అని పిలిచి చేతిలోని పుస్తకం పక్కన పెట్టారు.

నేను వెళ్ళి ప్రక్కన కూర్చున్నాను.

"రాజీ! నీకొక కథ చెప్తాను వింటావా! అంటూ మొదలెట్టారు." దాదాపు పాతికేళ్ళ కిందటి మాట ఇది. అప్పుడు మీ తాతయ్య అంటే మా నాన్న ఒక చిన్న రైతు. పల్లెటూళ్ళో వ్యవసాయం చేసుకుంటూ వుండేవారు. ఆయనకి ఇద్దరే పిల్లలు. నేనూ మీ అత్తయ్య. నేను కాలేజీలో చదువుకుంటూ వుండేవాడిని. ఒకరోజు ఇంటినుంచి టెలిగ్రాం వచ్చింది అర్జంటుగా రమ్మని. వెంటనే బయలుదేరి వచ్చాను. నేను వచ్చేసరికి జరగవల్సిన ఘోరమంతా జరిగిపోయింది.

నా చెల్లెలు, నాన్నగారు తెచ్చిన సంబంధాన్ని కాదని, తను ప్రేమించిన వ్యక్తిని రిజిష్టర్ మారేజ్ చేసుకుంది. నాన్నగారు ఆ షాక్‌కి తట్టుకోలేక గుండాగి మరణించారు.

అమ్మ మతిచలించి మంచం ఎక్కింది. ఇక అప్పటి నా స్థితి ఎలా వుంటుందో వూహించు. ఇక ఆ వూళ్ళో వుండలేక పొలం అమ్మి పట్నం వచ్చి వ్యాపారం పెట్టాను. పట్నం వచ్చిన కొద్ది కాలానికే మా అమ్మ మరణించింది.

ఆ తర్వాత మీ అమ్మతో వివాహం. నువ్వు పుట్టాకనే వ్యాపారం కూడా అభివృద్ధి చెందటం జరిగింది.

రాజీ! చిన్నప్పుడు నాకెటువంటి ఆశలుండేవో తెలుసా! నేను బాగా చదువుకోవాలి. పెద్ద ఉద్యోగం చెయ్యాలి. అనుకుంటూ వుండేవాడిని. కాని నా ఆశలు నెరవేరలేదు.

నాన్న చెల్లికి మంచి సంబంధం చెయ్యాలి. ఎంతో వైభవంగా వివాహం చెయ్యాలి అనుకుంటూ వుండేవారు.

అమ్మ కొడుకూ, కోడలుతో కూతురూ అల్లుడుతో ఇల్లు కళకళలాడాలని కోరుకుంది.

కాని ఏ ఒక్కరి ఆశలూ నెరవేరలేదు. కుటుంబం చిన్నాభిన్నమైంది. ఎందుకలా అయింది?

ఎవరి వలన అయింది?

నాన్నగారు ఆగారు. నాన్నగారి కథ వింటుంటే ఆనాడు బావ చెప్పిన కథ జ్ఞాపకం వస్తోంది.

"మీ అత్తయ్య వలనే. ఏరోజైతే అమ్మ చనిపోయిందో ఆ రోజే అనుకున్నాను నా చెల్లెలు కూడా చచ్చిందని. ఇన్నాళ్ళు నాకొక చెల్లెలుందనే విషయమే మర్చిపోయాను.

రాజీ! ఇన్నాళ్ళకు నువ్వు మళ్ళీ చెల్లెల్ని జ్ఞాపకం చేశావ్! కాని నాకు చెల్లెలు జ్ఞాపకం రావడంలేదు.

దాని వలన ఈ ఇంటికి జరిగిన అనర్థం జ్ఞాపకం వస్తోంది.

రాజీ! నువ్వు అతన్ని చేసుకుంటే మా అమ్మా, నాన్నకు పట్టినగతే నాకూ పడుతుంది. అది నీకిష్టమైతే అలాగే చేసుకో తల్లీ! ఇంతే నేను చెప్పేది. నువ్వు చదువుకున్నదానివి. ఆలోచించు నీకు నాన్న కావాలో? ఆ వ్యక్తి కావాలో?"

అని నాన్నగారు వెనక్కు వాలి కళ్ళు మూసుకున్నారు.

నా తల గిర్రున తిరిగిపోసాగింది. అక్కడి నుంచి లేచి ఎలా నా గదిలోకి వచ్చి, నా మంచం మీద వాలానో నాకే తెలీదు.

"రాజీ! నీకు నాన్నకావాలా! ఆ వ్యక్తి కావాలా!"

ఆ మాటే వెయ్యి గొంతులతో గదంతా ప్రతిధ్వనిస్తున్నట్లు అనిపించింది.

నాకు గుండెల్లోంచి దుఃఖం పొంగుకు వచ్చింది.

నాకు నాన్నగారూ కావాలి. బావా కావాలి.

ఎవరు లేకపోయినా బ్రతకలేను. ఎలా ఈ సమస్యని పరిష్కరించడం?

బావా! నువ్వసలు ఎందుకు కలవాలి? కల్సినా నాలో స్నేహం ఎందుకు చెయ్యాలి! నన్నెందుకిలా బాధపెట్టాలి! నా గుండెల్లో ప్రేమని ఎందుకు రగిలించాలి!!

నాన్నని కాదని బావని చేసుకోలేను. బావని వదిలి వేరొకర్ని వివాహం చేసుకోలేను.

ఏం చేయాలి?

ఆవేదనతో నా గుండెలు పగిలిపోతాయా! అనిపించింది.

ఆ క్షణాన ఆత్మహత్య చేసుకోవాలనే ఆవేశం కలిగింది. కాని ఏదో పిరికితనం నన్నాపింది.

ఒకవేళ నాన్నగారు తొందరపాటులో అలా అన్నారేమో! రేపు మెల్లగా చెప్తే అర్థం చేసుకుంటారేమో!

ఇంకా ఎక్కడో నాలో ఆశ మినుకు మినుకుమంటోంది. నాన్నగారు అప్పటికూడా కాదంటే బావని రప్పించి ఆలోచించవచ్చు అనుకున్నాను.

ఒక పక్కనుంచి దుఃఖం, ఒక పక్కనుంచి ఆలోచనలు మనసుని తినేస్తోంటే ఎప్పటికో నిద్ర పట్టింది.

తెల్లారి లేచి నాన్నగారి గదిలోకి వెళ్ళాను. కాని నాన్నగారు కనపడలేదు. అమ్మని అడిగాను. సంబంధం ఖాయం చేసుకురావడానికి రాజమండ్రీ వెళ్ళారని చెప్పింది.

వున్న ఒక్క ఆశా ఆరిపోయింది.

ఆ రోజల్లా అన్నం తినలేదు.

అమ్మ బతిమాలింది.

కాని నాకు తినాలనిపించలేదు.

[సశేషం]




## పెద్ద కథ:

# ఈ దీపం ఆరిపోదు

విన్నకోట సుశీలాదేవి

అమ్మ నన్ను ఏవో మాటల్తో ఓదార్చబోయింది.

"అమ్మా! నన్నిలా కాస్సేపు ప్రశాంతంగా వుండనీ" అన్నాను ఏడుస్తూనే.

అమ్మ ఏమనుకుందో ఏమో నా పైపొకసారి చూసి అక్కడినుంచి వెళ్ళింది.

నా బాధ నన్ను వదలలేదు.

నా జీవితంలో ఇంతవరకూ నాకే సమస్య గానీ, కష్టం గానీ రాలేదు. అసలవి ఎలా వుంటాయో కూడా తెలీదు.

మొట్టమొదటిసారిగా వచ్చిన ఇంత పెద్ద షాక్‌ను తట్టుకోలేకుండా వున్నాను.

పోనీ బావని పిలిపిస్తే?

బావ వచ్చి ఏం చేస్తాడు?

తనతో రమ్మంటాడు.

నేను వెళ్ళగలనా !

నా కంత ధైర్యం వుందా !

అలా వెళ్ళిపోతే నాన్నగారు ఏమౌతారు ?

ఆలోచనల్తో నాకు పిచ్చెక్కేట్టుంది.

ఆ రోజల్లా ఏడుస్తూనే వున్నాను.

నాన్నగారు వూరి నుంచి వచ్చారు. అమ్మా, నాన్నగారు ఏవేవో మాట్లాడుకున్నారు. నాన్నగారు హడావుడిగా తిరుగుతున్నారు. నేను ఏం పట్టించుకో లేదు. ఈ లోకంతో సంబంధం లేని వ్యక్తిలా వున్నాను.

నాన్నగారు వీలైనంత త్వరలో నాకు పెళ్ళి చెయ్యాలని చూస్తున్నారు. నేను విధి ఆడించే ఆటకు తలవొగ్గదల్చుకున్నాను. అంతకన్నా ఏం చేయగల్ను !

*

ముహూర్తం వారం రోజుల్లోకి వచ్చింది.

ఒకరోజు సావిత్రి నా దగ్గిరికి వచ్చి "ప్రసాదు వచ్చాడు. సాయంత్రం ఆరుగంటలకి పార్కుకి రమ్మన్నాడు రాజీ !" అంది.

ఆ మాట వినడంతోనే నాకు మిన్ను విరిగి మీద పడినంత పనయింది.

బావ నన్ను కల్సుకోడానికి వచ్చాడు. కాని బావని ఎలా కలుసుకోను ! అతనికి నా ముఖం ఎలా చూపను !

"రాజీ ! తప్పక రమ్మన్నాడు" అని సావిత్రి మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయింది.

తప్పక రమ్మన్నాట్ట ! రాకపోతే బావే ఇక్కడికి వచ్చినా వస్తాడు. అతడు అటువంటి వాడు కూడా. అది మరీ ప్రమాదం. దీనికన్నా దావని పార్కులో కలుసుకోటమే నయం.

బావ తనని తిడ్తాడు. అసహ్యించుకుంటాడు. తను చేసిన మోసానికి తనింక పడాల్సిందే.

పోనీ బావ తిడుతోంటేనన్నా తన బాధ కొద్దిగా తగ్గుతుందేమో ?

సాయంత్రం వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

ఆరవుతోండగా అమ్మతో సావిత్రి ఇంటికని చెప్పి పార్కుకి బయలుదేరాను. గేటు దగ్గిరే బావ ఎదురయ్యాడు.

నన్ను చూసి-"వచ్చావా రాజీ !" అన్నాడు ఆప్యాయంగా.

బావ ముఖంలో ఆనాడు స్టేషన్‌లో కన్పించిన ఆనందం, వుత్సాహం కన్పించాయి.

నేను గుండెల్లోంచి వచ్చే దుఃఖాన్ని అణచు కున్నాను.

ఇద్దరం లోపలికెళ్లి చెట్ల మధ్య వున్న బెంచీ మీద కూర్చున్నాం.

బావ నా వైపే చూస్తున్నాడు కన్నార్పకుండా. బావ చూపులు నా ఒళ్ళంతా గిలిగింతలు పెడ్తు న్నాయి. బావ నా చేయి పట్టుకుని పెదవుల తాకించు కుని నా కళ్ళల్లోకి చూస్తూ—

"రాజీ ! సావిత్రి చెప్తే నిజమనుకుని హడలి పోయాను. నిన్ను చూశాక ఇప్పటికి మనస్సు కుదుటపడ్డది" అన్నాడు.

"దేన్ని గూర్చి బావా నువు మాట్లాడేది !"

"అదే నీ పెళ్లిని గూర్చి ! సావిత్రి ఎందుకలా అబద్ధం చెప్పిందో ! ఇంటికెళ్లి అడగాలి ! బహుశ నన్నేడిపించాలని చెప్పిందేమో ?"

బావ అమాయకత్వానికి జాలి వేసింది. ఇటు వంటి బావకి ఎలా నిజం చెప్పడం ? నిజం చెప్పి ఎలా అతన్ని బాధించడం ! కాని చెప్పక తప్పదు. "బావా ! సావిత్రి చెప్పింది నిజమే !" అన్నాను మెల్లగా.

బావ చటుక్కున నా చేయి వదిలేశాడు.

"నిజమా" అన్నాడు.

"అవును బావా ! నిజమే !"

"అయితే నీకు నిజంగానే పెళ్ళా !" మళ్ళీ అడిగాడు.

అవునన్నట్లు తలూపాను.

"రాజీ !" బిగ్గరగా అరిచాడు.

"రాజీ !.........ఎంత ధైర్యంగా చెప్తున్నావ్ ! నువు....నువ్వేనా మాట్లాడేది !...." బావ తడబడి పోతున్నాడు. కోపం, దుఃఖం అతని గొంతుని నొక్కి పడ్తున్నట్లున్నాయి.

"బావా ! నా మాట విను మన పెళ్ళి నాన్నగారి కిష్టం లేదు ! ఏం చెయ్యను !"

"ఇటువంటి పరిస్థితి వస్తుందని నాకు ముందే తెలుసు రాజీ ! అందుకే ఆనాడన్నాను ఈ రెండు కుటుంబాలు కలిసి వుండాలని నీకుంటే నువ్వు ధైర్యం చెయ్యక తప్పదని. అప్పుడు తలూపావుగా గంగిరెద్దులా" కోపంగా అన్నాడు.

నాకు తెలుసు బావ ఇలా అడుగుతాడని.

"అవును బావా ! అన్నాను....కాని"....

బావ పళ్ల పటపటా కొరికాడు.

"కాని తీరా ఆచరణలోకి వచ్చాక చెయ్యలేక పోతున్నావు అంతేనా !"

నేనేం చెప్పను సమాధానం!

"రాజీ ! నువ్వింత మోసగత్తె వనుకో లేదు. అప్పుడెన్ని మాటలు చెప్పావ్ ! నన్ను ప్రేమించి నట్లు నటించి నాతో ఆడుకున్నావ్. ఇప్పుడు మీ నాన్న తెచ్చిన సంబంధాన్ని చేసుకుంటున్నావ్ నిన్ను....నిన్ను"

ఆవేశంతో బావ నా కంఠాన్ని రెండు చేతుల్తో పట్టుకున్నాడు.

నాకా క్షణంలో చావబోతున్నాననే భయం కలగలేదు. ఆనందం కలిగింది. బావ చేతుల్లో చావడం కంటె నాకు కావల్సిందేముంది ?

కాని బావ చేతులు వదిలాడు.

"ఛీ ! నిన్ను చంపి నా చేతుల్ని మలినపర్చుకో లేను రాజీ ! ఒక్కటి జ్ఞాపకం వుంచుకో ! నన్నింత బాధపెట్టినందుకు నా వుసురు తగలక మానదు. నా కోపం నీ జీవితానికి శాపం అవుతుంది.

"రాజీ ! నేను జీవితంలో ఎన్నో కష్టాలను భరిం చాను. కాని ఎప్పుడు కన్నీరు కార్చలేదు. క్రుంగి పోలేదు. మొదటిసారిగా జీవితంలో ఓడిపోయాను రాజీ ! ఇది తిరుగులేని ఓటమి. నా జీవితమే నేటితో ముగిసిపోయింది."

బావ చేత్తో ముఖం కప్పుకున్నాడు. బహుశ రాబోతున్న దుఃఖాన్ని ఆపుకుంటున్నాడేమో !

నా కళ్ళల్లో కూడా నీళ్లు తిరిగాయి. ఆ క్షణాన బావతో వెళ్లిపోవాలన్పించింది. కాని నా కళ్ళ ముందు నాన్నగారు మెదిలారు.

"మీ అత్తయ్య మా నాన్న కొంపని కూల్చింది. నువ్వు నా ఇంటిని కూలుస్తావా" అని అడుగుతున్నట్లనిపించింది.

నేనేం చెయ్యాలి !

బావని వదులుకోలేను.

నాన్నగార్ని ఎదిరించలేను.

బావ దగ్గిరికి వచ్చి అతని చెయ్యి పట్టుకుని-

"బావా ! నువ్వు నన్ను తిట్టు, కొట్టు, కాని అలా బాధపడకు. నేను చూడలేను బావా ! చూడ లేను" అంటు భోరుమని ఏడ్చాను.

బావ నా ఏడ్పు చూసి కరిగిపోయినట్లున్నాడు.

"రాజీ! ఏడవకు. ఏదో తొందరపాటులో తిట్టాను. ఆ పెళ్లి చేసుకుని నువ్వైనా సుఖంగా వుండు. నూరేళ్లపాటు హాయిగా జీవించు"—

బావ రుద్ధకంఠంతో అన్నాడు.

నాకు అంత దుఃఖంలోనూ నవ్వు వచ్చింది.

"సుఖం! ఈ జీవితానికి సుఖం నీతోనే పోయింది బావా! ఇప్పుడీ పెళ్లి జరిగేది ఈ శరీరానికి మాత్రమే. నా మనస్సెప్పుడో చచ్చిపోయింది. బావా! నీకు తీరని ద్రోహం చేశాను. కాని ఏం చెయ్యను! నువ్వొక పిరికిదాన్ని ప్రేమించావ్!"

బావ లేచి నిలబడ్డాడు.

"రాజీ! మొదటి నుంచీ నేను దురదృష్ట వంతుడినే. నీతో స్నేహం కుదిరాక నన్ను అదృష్టం వరించిందని ఆశపడ్డాను. కాని విధి నన్ను వంచించింది. ఏం చేస్తాం. మనకు రాసిపెట్టిందింతే. నువ్వు తెగించి నాతో రాలేవు. చేసుకున్నవాడితోనైనా సుఖంగా వుండు! వస్తా" అని వెనుదిరిగి చూడకుండా వెళ్లిపోయాడు బావ. నేనలాగే నిల్చుండిపోయాను. పార్కులో చీకటిపడింది. నా జీవితంలో కూడా చీకటిపడింది.

*

"అమ్మగారూ! ఏంటండీ ఏడుస్తున్నారు!" రావులమ్మ కుదుపుతూ అడుగుతోంది. స్పృహలోకి వచ్చాను. కళ్లు తెరిచాను. ఎదురుగా రావులమ్మ కనపడింది.

"కాఫీ తెస్తా నుండండి" అంటూ వెళ్లిపోయింది.

నా మనసంతా దిగులుగా వుంది. గడిచిపోయిన గాథలు మానని పుండ్లయి బాధపెడ్తున్నాయి.

అప్పుడప్పుడు నాకన్పిస్తుంది. బావతో ఆనాడు తెగించి వెళ్లుంటే ఏమయేది?

నా జీవితం ఎంతో ఆనందంగా గడిచేది. స్వర్గధామం అయ్యేది.

కానీ నాకా అదృష్టం ఏదీ?

నా ముఖాన దేవుడు ఈ రాత రాసుంటే అలా ఎందుకు జరుగుతుంది?

ప్రపంచమంతా శూన్యంగా వుంది. ఇంకా నేను బ్రతికుండటం ఎందుకు?

ఎవరికోసం బ్రతకాలి?

నేనెవరికక్కావాలి!

నా గురించి తలచేవారైనా వున్నారా!

ఇలా ఆలోచనల్తో క్షణం క్షణం విలపించే కన్నా ఒక్కసారి చస్తే అందరికీ హాయి. అవును నేను చావాలి. చావాలి.

"అమ్మగారూ! కాఫీ అంది" రావులమ్మ చెయ్యి పుచ్చుకు లేవదీసింది. కాఫీ తాగాను. తాగి మళ్ళీ పడుకున్నాను.

*

రావులమ్మ వచ్చి—

"అమ్మగారూ! సరస్వతమ్మగారు వస్తున్నా రమ్మా!" అంది.

కళ్ళు తెరిచాను.

సరస్వతమ్మగారు అంటే పద్మ వాళ్ళ అమ్మ.

ఎందుకు వస్తోందో?

ఆవిడ లోపలికి వచ్చింది. నన్ను చూస్తూ—

"ఏమ్మా! ఎలా వుంది!" అంటూ పలకరించింది.

నేను నవ్వాను. అదే సమాధానమన్నట్లు ఆవిడ వచ్చి నా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. చేతిలోని పళ్ళు టేబిల్‌పైన పెట్టింది.

"ఈ నాల్గురోజుల్లోనూ బాగా చిక్కావమ్మా' మందులవీ జాగ్రత్తగా పుచ్చుకుంటున్నావా."

"మందులు పుచ్చుకుంటూనే వున్నానండీ" అన్నాను నా వరకూ తప్పేమీ లేనట్లు.

"ఏవిటో! ఈ మాయదారి రోగాలు చిన్న వాళ్ళకే వస్తున్నాయి" అంది విచారంగా.

నేనేం మాట్లాడలేదు.

క్షణం ఆగి ఆవిడ "లక్ష్మీ! చిన్నదానివయినా నీకు నమస్కారం చెయ్యాలని వుంది తల్లీ!" అంటూ రెండు చేతులూ ఎత్తింది.

నేను వారిస్తూ "ఏమిటండీ! ఎందుకూ!" అన్నాను. "అదేవమ్మా! నువ్వు మా పద్మ జీవితాన్ని కాపాడావ్! నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను."

"అదా" అన్నాను నవ్వేస్తూ.

"పద్మ రెండ్రోజుల క్రితం మోహన్ విషయం చెప్పి అతన్ని తప్ప వేరెవర్నీ చేసుకోనని కూర్చుంది. ఆయనకి ఇంటి సంగతి పట్టదు. నేనా ఆడదాన్ని సరే నీ ఇష్టం అన్నాను. నువ్వు కనుక అడ్డుపడకపోతే దాని జీవితం నాశనం అయ్యేదేనమ్మా."

ఆవిడ కళ్ళనుండి నీళ్ళు చెంపలమీదికిరాలాయి. "ఛ! పూరుకోండి. భగవంతుని దయ వల్ల గండం గడిచిందిగా."

ఆవిడ కొంగుతో ముఖం తుడుచుకుంది. "ఆ దేవుడే నీ రూపంగా వచ్చాడు. కాని ఇంత మంచి తల్లివి. నీకీ రోగమేమిటో అనేదే నా బాధ" అంది ఆవిడ.

నా మంచితనాన్ని మీరన్నా గుర్తించారు. అంతే చాలు.

"పిన్నిగారూ! పద్మ మంచిపిల్ల కాకపోతే కొద్దిగా అమాయకురాలు. లోకం పోకడ బొత్తిగా తెలీదు. ఇక ఫర్వాలేదు. నిప్పు ముట్టుకుంటే కాల్తుందని తెలిసిందిగా—ఇక దానికి దూరంగా వుంటుంది లెండి."

"పద్మకి తొందర్లోనే మంచి కుర్రాడిని చూసి పెళ్ళి చేసేస్తాను. దానికి పెళ్ళయితే ఇక నాకు నిశ్చింత."

నాన్నగారు కూడా ఒకప్పుడు ఇలాగే అన్నారు.

"గోపాలం చాలా మంచివాడమ్మా అతనితో నీ పెళ్ళి జరిగితే ఇక నాకు నిశ్చింత."

నాన్నగారేమిటి! ప్రతి తండ్రీ అలాగే అంటాడు. తన కూతురి జీవితం ఆనందమయం కావాలనే కోరుకుంటాడు. కాని ఎంతమంది జీవితాలు ఆనందంగా నడుస్తున్నాయి. ఎంతమంది సుఖపడ్తున్నారు!

ఆవిడ హఠాత్తుగా గొంతు తగ్గించి చుట్టు చూస్తూ—

"మీ ఆయనా, సరోజా ఇందాక ఒకే రిక్షాలో ఎక్కడికో పోతున్నారు. అయినా అమ్మాయ్! నువ్విలా వాళ్ళని వదిలేస్తే ఎలా? ఒక కంట కని పెట్టి వుండాలి" అంది.

నాకు నవ్వు వచ్చింది. వాళ్ళేమన్నా చిన్న పిల్లలా నేను కంట కనిపెట్టేందుకు! "అందుకనే, అమ్మాయ్! మొగుణ్ణి గుప్పెట్లో పెట్టుకోవా లంటారు మన పెద్దవాళ్ళు." గుప్పెట్లో కాదండీ! గుండెల్లో దాచుకోవాలి. గుప్పెట్లో పెట్టుకుంటే వేళ్ళు తప్పించుకుని వెళ్ళిపోతారు. గుండెల్లో దాచుకుంటేనే ఎక్కడికీ కదలరు. అలా దాచుకోడమే నాకు చేతకాలేదు.

"ఏమ్మా మాట్లాడవ్."

"ఏం మాట్లాడనండీ!"

ఆవిడ ఆశ్చర్యపోయినట్లు చూసింది. "నువ్వింత

అమాయకురాలివి కాబట్టే వాళ్ళలా ఆడుతున్నారు'' అంది ఆవిడ బుగ్గలు నొక్కుకుంటూ.

"పోనీండి పిన్నిగారూ! నేను రోగిష్ఠిదాన్ని య్యాను. ఆయన సుఖం ఆయన చూసుకుంటు న్నారు తప్పేముంది!''

"అదేమిటమ్మా! నువ్వు నాల్గు రోజులు మంచం ఎక్కావని ఇంక దాని వెంట పడతాడా? మగాడు మంచం ఎక్కితే ఆడది ఇంకోళ్ళతో పోతోందా?''

ఆవిడలోని ఈ విప్లవ భావానికి నేను విస్తు పోయాను.

"లక్ష్మీ! నేను పక్షవాతంతో ఆరు నెలలు మంచం దిగకపోయేసరికి మా వారు ఇంకో ఆవిడని పెళ్ళి చేసుకున్నారు. ఆ దేవుడి దయవల్ల నా రోగం నయమైందనుకో!''

"నిజమా! పిన్నిగారూ!''

"అవునమ్మా! కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడ్తుందన్నట్లు ఈ విషయం చెప్తే నేనే నలుగురిలో నవ్వుల పాలౌతాను.''

"భార్య వుండగా ఇంకో స్త్రీని వివాహం చేసు కోడం నేరం. మీ వారి మీద కేసు పెట్టక పోయారూ!''

"ఇంకా నయం నా మెడలో తాళి కట్టిన వ్యక్తి మీద కేసు పెట్టడమా! నావల్ల కాదు. వాళ్ళకేం కల్లీ మగమహారాజులు ఎన్ని ఆటలైనా ఆడతారు. నాలాటివాళ్ళు నోర్మూసుకుని పడివుండాల్సిందే!''

"పిన్నిగారూ! మీరు చెప్పిన స్థితిలోనే నేనూ వున్నాను. మీ మాటలే నాకూ వర్తిస్తాయి ఏం చేస్తాం. స్త్రీల కన్నీటి గాథలన్నీ ఒకేలా వుంటాయి.''

"అవునమ్మా! అంతే తల్లీ! మనకు ఒట్టి ఆవేశమే కానీ, ఆచరణ లేదు. నా విచారమంతా ఒక్కటే. మాలాటివాళ్ళకు ఈ బాధలు ఎలాగూ తప్పలేదు. కాని నీలాటి చదువుకున్న పిల్లలకు కూడా ఈ కష్టాలేమిటో! కాలం మారిందంటారు. ఏం మారిందమ్మా!''

నేనేం మాట్లాడలేదు.

ఆవిడ అన్నమాటలే నా మనసులో తిరుగు తున్నాయి. కాలం మారింది. కాని ఆడదాని జీవితం మారలేదు. ఇక మారదేమో కూడా!

ఆవిడ కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయింది. ఆవిడ అంత ప్రేమతో నన్ను చూడ్డానికి వస్తే కాఫీ కాదు పచ్చి మంచినీళ్ళయినా ఇవ్వలేక పోయాను. నా ఇంట్లో నాకే ఆమాత్రం స్వతంత్రం లేకపోయింది. నా బ్రతుకు ఎంత అధ్వాన్నమై పోయింది!

"అమ్మగారూ! పెద్దమ్మగారు వచ్చారమ్మా!'' రావులమ్మ పరిగెట్టుకు వచ్చి చెప్పింది.

ఆ మాట వినగానే నాలో సంతోషపు కెరటం వువ్వెత్తున లేచింది.

అమ్మ - అమ్మ వచ్చింది!

ఇంక నాకు ఏ దిగులూ లేదు. నిశ్చింతగా వుండొచ్చు.

అమ్మ ఒడిలో తల పెట్టుకుని నా బాధలన్నీ మర్చిపోతాను.

ఇన్నాళ్ళూ నా గుండెల్లో దాచుకున్న ఆవేద నంతా చెప్పుకుని శాంతి పొందుతాను.

అమ్మ దగ్గిరికి పరిగెట్టుకు వెళ్ళాలనిపించింది. లేవబోయాను.

గుండె పట్టేసింది.

"అమ్మా'' అనుకుంటూ వెనక్కి వాలాను.

అబ్బ! ఏమిటింత నొప్పిగా వుంది! అమ్మ వచ్చిందన్న సంతోషంలో చస్తానా ఏమిటి?

పోనీ అమ్మ ఒడిలో తల పెట్టుకుని హాయిగా మరణిస్తాను.

తనకు పెళ్ళయి కాపరానికి వస్తోంటే అమ్మ అంది.

"రాజీ! స్త్రీ జీవితంలో పెళ్ళి ఒక పెద్ద మలుపు. ఆ మలుపు అవతల లోయలున్నాయా! పూలతోటలున్నాయా! ఎవ్వరూ చెప్పలేరు. అది ఆ స్త్రీ అదృష్టం మీద ఆధారపడి వుంటుంది. నీవరకూ నువ్వు గతమంతా మర్చిపోయి గోపాల్‌తో కాపరం చెయ్యి. నువ్వెప్పుడూ కళకళలాడుతూ పిల్లా పాపలతో హాయిగా వుండటం నేను చూడాలి. అదే తల్లిగా నా కోరిక రాజీ.''

కాని అమ్మ కోరిక తీరలేదు.

అమ్మ తనని చూసి ఏమంటుంది. 'రాజీ! నీ జీవితం ఎలా అయిపోయిందే' అని బాధ

### తేనె

'బామ్మగారి పేజీ'లో బామ్మగారు ఈమధ్య 'తేనె' ప్రాశస్త్యం గురించి వివరించారు. గత సంచికలో ఒక పాఠకురాలు 'ఉత్తరాలు' పేజీలో మరికొన్ని విశేషాలు చెప్పారు. అలాగే, 'తేనె' గురించి నాకు తెలిసినవీ, సేకరించినవీ మరికొన్ని విషయాలు తెలియజేస్తున్నాను.

తేనె చాలా ప్రాచీనకాలం నుంచే ఉపయోగించ బడుతోంది. క్రీ. పూ. 2400 సం॥లో ఈజిప్టులో నిర్మించబడిన సూర్య దేవాలయంలో (The Temple of the Sun) తేనె తుట్టెలను వివ రించే చిత్రాలు వున్నాయి.

కృత్రిమమైన తేనె తుట్టెలను కలపతో తొలి సారిగా 1851 సం॥లో అమెరికాకు చెందిన లేంగ్స్ ట్రోత్ అనే ఆయన తయారుచేశాడు. తేనెటీగలకు పువ్వుల రంగు, వాసన, ఏవి పువ్వులు, ఏవి కాలంలో ఎక్కడెక్కడ పుష్పిస్తాయి అన్న విషయాలు తెలుసు.

తొమ్మిది పౌండ్ల తేనెను సేకరించాయంటే అందులో ఒక పౌండు తేనెను నిలువచేస్తాయి. ఇందు కోసం—మూడుసార్లు ప్రపంచాన్ని ప్రదక్షిణం చేస్తే ఎంతదూరం అవుతుందో అంతదూరం తిరుగవలసి వుంటుంది.

పువ్వుల్లోని తేనెలో నీళ్ల ఎక్కువగా వుంటాయి. ఆ నీటి నిష్పత్తిని తగ్గించటం వల్ల తేనెలో చక్కెర సాంద్రత ఎక్కువవుతుంది. పూతేనెను ఎండలో పెట్టటం తర్వాత తుట్టెకు దావున చేరి రెక్కలను విసరడం ద్వారా తేనెలోని నీళ్ల ఆవిరి అవుతాయి. ఆ తర్వాత అందులో 80 శాతం చక్కెర, 20 శాతం నీళ్ళూ వుంటాయి.

తేనెటీగల తలలలో ఒకరకమైన గ్రంథులు వుంటాయి. ఇవి చక్కెర లనబడే సుక్రోసును-గ్లూకోజు గాను, ఫ్రక్టోస్ గానూ మారుస్తాయి. ఈ మార్పు 30° C ఉష్ణోగ్రతలో జరుగుతుంది. హైందవులు తేనెను పవిత్రంగానూ, బలవర్ధకమైన ఆహారంగానూ, ఔషధంగానూ భావిస్తారు. పిల్ల లకు ఆహారంగా ఇవ్వవచ్చు. రొట్టెలు, కేక్స్, ఇతర ఫలహారాలు చేసుకోవచ్చు. ఇందులోని సి విటమిను అలసట పోగొట్టి మంచి ఉత్సాహం కల్గిస్తుంది.

వాయువు, కడుపులో పుండు వున్నవారికి తేనె మంచిది.

నిమ్మరసం, తేనె మిశ్రమాన్ని జలుబు నివారణకు ఉపయోగించవచ్చు.

కత్తి గాయాలు, బొబ్బలు తేనె రాయడం వల్ల తొందరగా ఆరిపోతాయి. —బాల

వస్తుందా!

నాకు కష్టం వస్తే అమ్మ భరించలేదు. అందుకే ఇప్పటివరకూ నా బాధలేమీ అమ్మకు చెప్పలేదు. కాని ఇప్పుడు ఇలా....ఇలా....అమ్మ ముందు ..

"రాజీ" అమ్మ పిలుస్తోంది.

అమృతమయమైన పిలుపు! నాకు జన్మ వచ్చిన దగ్గర్నుంచీ వింటున్న పిలుపు! నా గుండెల్లో ఇప్పటికీ వినవస్తున్న పిలుపు.

కళ్ళకు నీటిపొర అడ్డువచ్చి అమ్మ సరిగ్గా కన్పించడంలేదు. అమ్మ నన్ను కౌగిలించుకుని బావురుమంది.

"రాజీ! ఎలా అయిపోయావే తల్లీ! ఇంత ముంచుకువస్తున్నా ఇన్నాళ్ళు ఒక వుత్తరమ్ముక్కన్నా రాయలేదేమే!"

ఏమని రాయను! ఎలా రాయను! అమ్మ నా శరీరాన్ని ఆప్యాయంగా నిమురుతోంది.

"ఎంత చిక్కిపోయావే! రాజీ! గుర్తుపట్టలేనంతగా మారిపోయావ్! డాక్టరు వస్తున్నాడా! మందులు పుచ్చుకుంటున్నావా!"

అమ్మ అభిమానానికి నా మనస్సు కరిగిపోయింది.

ఇన్నాళ్ళూ నా గుండెల్లో దాగిన బాధనీ, ఆవేదననీ అమ్మతో చెప్పుకోవాలి.

అమ్మ ఎప్పుడు నా కాపరాన్ని గూర్చి అడిగినా బాగానే వుందమ్మా అని చెప్తూ వచ్చాను. అమ్మ తృప్తిపడేది.

ఇక ఈ కష్టాల్ని అమ్మకు చెప్పుకుంటే గాని వుండలేను. ఈ బాధని నేనొక్కదాన్ని భరించలేను.

"అమ్మా...." అంటూ నోరు తెరవబోయాను. ఇంతలో బయట అడుగుల చప్పుడు విన్పించింది. ఆయన లోపలికి వచ్చారు.

"అత్తయ్యగారూ! ఎప్పుడొచ్చారండీ!" అన్నారు నవ్వుతూ.

"ఇప్పుడే నాయనా!"

"ప్రయాణం అదీ సుఖంగా జరిగిందాండీ"

"ఆ! జరిగింది."

"రాజీ! మీ అమ్మగారికి వుత్తరం వ్రాశావా ఏమిటి!" అన్నారు నన్ను చూస్తూ.

"అవును బాబూ! రాసింది. ఆ వుత్తరం చూసేసరికి నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు" వెంటనే బయలుదేరి వచ్చాను."

"మంచి పని చేశారు. నేను ఎప్పటినుంచో మీకు వుత్తరం వ్రాయమంటున్నా! ఎక్కడా! నా మాటసలు వింటేనా ఇక నేనే రాద్దామనుకుంటుండగా మీరే వచ్చారు" అని నావేపు తిరిగి-

"రాజీ ఎలా వుందీ" అన్నారు. నేను పలకలేదు.

నేను మాట్లాడకపోవటం చూసి అమ్మవేపు తిరిగి —

"మీ అమ్మాయి నా మాట బొత్తిగా వినడంలేదండీ! వేళకి మందు వేసుకోదు. మీరొచ్చారు ఇక దాని బాధ్యత మీదేనండీ" అన్నారు.

"అలాగే బాబూ!" అంటోంది అమ్మ.

ఈ సంభాషణ, ముఖ్యంగా ఆయన నటన చూస్తోంటే నాకు మంటెక్కిపోతోంది. ఎంత బాగా నటిస్తున్నారు! అదీ నా ముందు! ఆయన ధైర్యానికి మెచ్చుకోవచ్చు.

ఇక ఆయన గూర్చి ఏం చెప్పినా అమ్మ నమ్ముతుందా! 'నీకాయనంటే ఇష్టం లేదు. అందుకే నీకు ఆయనలో అన్నీ లోటులే కన్పిస్తున్నా'యని నన్నే తిట్టుంది.

"అత్తయ్యగారూ! కాఫీ ఫలహారాలు తీసుకున్నారా!"

"లేదు బాబూ! తీసుకుంటాను"

"తీసుకోండి! మళ్ళీ వస్తాను. వస్తా రాజీ! పనుంది. విశ్రాంతి తీసుకో" అని వెళ్ళిపోయారు.

అమ్మ నా దగ్గర కూర్చుంది. "రాజీ! నిన్నిలా చూడగానే నాకెన్నో అనుమానాలొచ్చాయే కాని అల్లుడుగారు చాలా మంచివాడేనే."

అవునమ్మా! ఆయన చాలా మంచివారు. నేనే చెడ్డదాన్ని.

అసలాయనలో ఏదో ఆకర్షణ శక్తి వుంది. మనుషుల్ని ఇట్టే లోబర్చుకుంటారు.

అమ్మకి నేను చెప్పాలనుకున్న నా ఆవేదనంతా నా మనసులోనే దిగమింగుకున్నాను.

"రాజీ! విచారించకు తల్లీ! నీ జబ్బు త్వరలోనే నయమౌతుంది."

నేను నవ్వాను.

"నువ్వొచ్చావుగా ఇక నాకేం భయంలేదమ్మా! రైల్లో ఒంటరిగా ఏం అవస్థ పడ్డావో! ముందు కాస్త ఫలహారం చేసిరామ్మా!"

"ఒంటరిగా రాలేదే! నాతో మీ బావ కూడా వచ్చాడే" అంది అమ్మ సాదాగా. కాని ఆ మాటలు నాకు షాక్ కొట్టినట్లయింది.

"ఏమిటీ! బావ వచ్చాడా!"

"అవునే! నీ వుత్తరం వచ్చినపుడు బావ మన ఇంట్లోనే వున్నాడు. నేను బయలుదేరుతూంటే తనూ వస్తానన్నాడు."

నాకు అమ్మ చెప్పే మాటలేవీ విన్పించడంలేదు.

బావ వచ్చాడు! నన్ను చూడ్డానికి వచ్చాడు. ఎన్నాళ్ళకి....ఎన్నేళ్ళకి.

"అమ్మా! బావ ఏడమ్మా!"

"పిలుస్తానుండు" అమ్మ లోపలకు వెళ్ళింది.

నా గుండె దడదడలాడిపోతోంది. శరీరమంతా ఒక విధమైన వుద్రేకంతో స్పందిస్తోంది. బయట అడుగుల చప్పుడు విన్పించింది. నా గుండె తీవ్రంగా కొట్టుకుంటోంది. ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ బావని చూడబోతున్నాను. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని గుమ్మంవేపు చూస్తున్నాను.

అమ్మ వెనకాల బావ.

బావ నెమ్మదిగా లోపలకు వస్తున్నాడు. ఇదివరకు కన్నా కొద్దిగా ఒళ్ళు చేశాడు. ఒక చేతిలో కర్రపోటీ పెట్టుకుని కొద్దిగా పక్కకి వంగి నడుస్తున్నాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. బావ మిలిటరీలోకి వెళ్ళి కాలు పోగొట్టుకున్నాడని.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బావ వచ్చి నా దగ్గిరగా వున్న కుర్చీలో కూచున్నాడు. నా వేపే చూస్తున్నాడు.

"రాజీ!"

ఎన్నాళ్ళకు విన్నాను బావ నోట్లోంచి ఆ పిలుపు.

నన్నందరూ రాజీ! అనే పిలుస్తారు. కాని బావ పిలుస్తూంటే ఎంతో మధురంగా వుంటుంది.

"రాజీ! ఎలా అయిపోయావ్."

తలెత్తి చూశాను.

బావ కళ్ళల్లో నీళ్ళు.

"రాజీ! నిన్నిలా చూస్తాననుకోలేదు."

"నా జీవితంలో అనుకోనివి చాలా జరిగాయి బావా! అందులో ఇదొకటి! పోనీగానీ నువ్వు బాగున్నావా! బావా!"

"ఆ!"

"అత్తయ్యా!"

"అమ్మ కూడా బాగానే వుంది" అన్నాడు.

ఇంతలో రావులమ్మ అమ్మకీ, బావకీ కాఫీ ఫలహారాలు తెచ్చింది.

సరోజ ఇచ్చివుండదు. ఆయన పంపించి వుంటారు.

ప్రస్తుతం ఆయన అత్తగారిని మంచి చేసుకునే ప్రయత్నంలో వున్నారు.

అమ్మా, బావ కాఫీ టిఫిను తీసుకున్నారు.

"అమ్మగారూ! మందు తాగుతారా!" రావులమ్మ అంది.

అమ్మ తాగుతున్న కాఫీగ్లాసు కింద పెడ్తూ అంది—

"ఏం మందివ్వాలో చెప్పు నేనిస్తాను."

అమ్మని వారించాను.

"తొందరేంలేదమ్మా!"

అమ్మ కాఫీ తాగి మందు గ్లాసులో పోసి నాచేత తాగించింది.

"రాజీ అసలు జబ్బేమిటీ ఎప్పట్నించీ?" బావ అడిగాడు.

"జబ్బు పేరు తెలీదు బావా! కానీ మంచం పట్టి మాత్రం మూడు నెలలయింది."

"మూడు నెలలనుంచా! రాజీ! ఇన్నాళ్ళూ ఒక్క కార్డు ముక్కన్నా రాయలేదే! మీ నాన్నగారు పోయారు. కానీ నేనింకా బ్రతికేవున్నానే" అంది అమ్మ నిష్ఠూరంగా.

"ఛ! ఎందుకమ్మా అంత మాట అసలే నాన్నగారు పోయిన దిగుల్లో వున్నావు. నీకు రాసి నిన్ను బాధపెట్టడమెందుకని రాయలేదు. ఇప్పుడైనా ఇక రాయకపోతే చివరి చూపులైనా దక్కవేమోనని...." దుఃఖంతో నా గొంతు పట్టేసింది.

"రాజీ! అటువంటి మాటలనకు! నీకేం భయంలేదు. నీ జబ్బు నయం చేయించి పూర్వంలా కళకళలాడుతూ తిరిగేట్టు నేను చేస్తాను" బావ ఆవేశంగా అంటున్నాడు.

నేను తలెత్తి చూశాను.

"అవును రాజీ! నువ్వేం బెంగెట్టుకోకు. నీకు అండగా నేనున్నాను."

బావ మాటలు నా చెవులకు మధురగానంలా విన్పించాయి.

బావ ఎంతకైనా సమర్థుడు. తలుచుకుంటే ఏదైనా చెయ్యగలడు! ఎండిన చెట్టుకి పూలు పూయించగలడు. హేమంతంలో వసంతాన్ని రప్పించగలడు.

ఆనాడు బావ పడిపోతున్న పాకని ఒక చేత్తో ఎత్తి పట్టిన దృశ్యమే నా కళ్ళముందు మెదులుతోంది!

"ఏం రాజీ! మాట్లాడవేం! నా మీద కోపమా!"

"ఛ! నీమీద నాకెందుకు బావా కోపం! నేను చేసిన పనికి నాకే రావాలి కోపం" అన్నాను.

"ఇందులో నువ్వు చేసిందేముంది రాజీ! మనకింతే రాసిపెట్టివుంది. అయినా ఇప్పుడు నువ్వదేమీ మనసులో పెట్టుకోకు. గతమంతా ఒక పీడకలగా మర్చిపో."

బావ తన మంచితనాన్ని మరోసారి నిరూపించుకున్నాడు.

కిటికీలోనుంచి బయటికి చూశాను. పొద్దు పడమరకి వాలిపోతోంది. చీకట్లు ముసురుకుంటున్నాయి.

రావులమ్మ వచ్చింది.

"అమ్మగారూ! అయిదు దాటింది. ముఖం కడుక్కుంటారా!"

"నేను కడిగిస్తాలే! నువ్వు వెళ్ళు" అంది అమ్మ రావులమ్మతో.

అమ్మకి నాకు సేవ చేయాలని కోరిక!

"రాజీ! లేచి కూచ్చుంటావా! జడ వేస్తాను" అంది అమ్మ.

"అలాగే."

అమ్మ నా పెళ్ళి రోజున పూలజడ వేసింది. మళ్ళీ ఇన్నాళ్ళకు అమ్మచేత జడ వేయించుకునే అదృష్టం కలిగింది!

నేను మెల్లగా లేచి కూర్చున్నాను. అమ్మ నా జడ విప్పి నూనె రాస్తోంది. "బావా! ఇప్పుడెక్కడ వుంటున్నావ్."

"మా వూళ్ళోనే! పొలం వుందిగా దాన్ని చూసుకుంటూ అక్కడే వుంటున్నా."

"శ్రీలక్ష్మి బావుందా?"

"ఆ బాగానేవుంది! దానికి నలుగురు పిల్లలు. పార్వతమ్మ ఒక మతిలేని అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంది."

ఆ మాట నాకు విచారాన్ని కల్గించింది.

పాపం శ్రీలక్ష్మి అందమైన మొగుణ్ణి కోరుకుంది.

ఏమిటో మనం అనుకున్నది ఒకటైతే జరిగేది వేరొకటి.

అమ్మ జడ వేసింది.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి అమ్మ సాయంతో ముఖం కడుక్కున్నాను.

బావ లేచి—

"ఇప్పుడే వస్తా రాజీ! ఇంతవరకూ మీ ఆయన్ని పలకరించలేదు" అంటూ వెళ్ళాడు.

అమ్మ నాకు చీర జాకెట్టు తీసిచ్చింది.

నేను కట్టుకున్నాను.

అమ్మ లైటు వేసింది.

"రాజీ! గుళ్లోకి వెళ్ళి అమ్మవారికి పూజ చేయించి వస్తాను. ఆ తల్లి కరుణిస్తే త్వరలోనే లేచి తిరుగుతావు" అంది అమ్మ.

అమ్మ నమ్మకానికి నవ్వు వచ్చింది. కాని నాకోసం అమ్మ పడే తాపత్రయం చూస్తోంటే జాలి కూడా వేస్తోంది.

"అలాగే వెళ్ళిరా అమ్మా" అన్నాను.

"అమ్మ వెళ్ళింది!"

గదిలో ఒంటరిగా మిగిలాను. రోజూ అయితే అలా ఒంటరిగా చీకట్లో పడుకోడం ఇష్టంగా వుండేది. కాని ఇవ్వాళ ఇక్కడ వుండబుద్ధికావడం లేదు. రావులమ్మని పిలిచాను.

"డాబా మీద కుర్చీ వెయ్యి కూర్చుంటాను."

"చలిగా వుంటుందేమోనమ్మా."

"ఫరవాలేదులే."

రావులమ్మ కుర్చీ పైన వేసింది.

నేను మెల్లగా మెట్లెక్కి పైకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను.

పైన చల్లగా, హాయిగా వుంది. కుర్చీలో వెనక్కి వాలాను.

నా మనస్సు ఎప్పుడూ లేనంత ప్రశాంతంగా వుంది. నా జబ్బంతా మటుమాయమైనట్లు ఒళ్లంతా చాలా తేలిగ్గా వుంది.

ఈ ప్రశాంత వేళలో, ఈ ఆనంద సమయంలో గొంతెత్తి పాడుకోవాలని వుంది. ఈ డాబా మీద పరిగెట్టాలని వుంది.

"రాజీ!" అన్న పిలుపు విన్పించింది.

కళ్ళు విప్పాను.

ఎదురుగా బావ నిలబడి వున్నాడు.

"రా! బావా!"

బావ ప్రక్కనేవున్న స్టూలుమీద కూర్చున్నాడు.

"ఇంత చలిగాలిలో కూర్చున్నావేం రాజీ!"

"నాకిక్కడే బావుంది బావా!" అన్నాను.

క్షణకాలం యిద్దరూ మౌనంగా కూర్చున్నాం.

"రాజీ! జీవితం ఎంత చిత్రమైంది!" బావ ఎటో చూస్తూ అంటున్నాడు.

బావ దేన్ని వుద్దేశించి అన్నాడోగానీ నాకు మాత్రం బావ మాటలో గడిచిపోయిన నా జీవితమంతా కళ్ళ ముందు మెదిలింది.

నిజమే జీవితం చిత్రమైంది.

ఈ కాస్త జీవితంలోనే ఎన్నో పరిచయాలు! ఎన్నో అనుభవాలు!

సావిత్రి, బావ, శ్రీలక్ష్మి, పద్మ, జయ, సరోజ-వీరంతా ఒక్కొక్కళ్ళే నా కళ్ళ ముందు మెదులుతున్నారు.

ఒక్కొక్కరిది ఒక్కో స్వభావం – ఎన్నిరకాల మనుషులో అన్నిరకాల మనస్తత్వాలు.

"రాజీ! అత్తయ్య గుడికి వెళ్ళిందా!"

"అవును బావా!"

క్షణం ఆగి అన్నాడు—"రాజీ! ఒక్కటడగనా!"

"అడుగు బావా!"

"సరోజ ఎవరు?"

నాకు పిడుగు పడ్డట్టయింది. బలవంతాన నవ్వుతూ—

"ఎందుకు బావా!" అన్నాను.

"మీ ఆయనతో చాలా చనువుగా వుంటోంటే."

బావ వచ్చి గంట కాలేదు. అన్నీ గ్రహించినట్లున్నాడు. ఇక బావ దగ్గర దాచటం అనవసరం.

"నాక్కాబోయే చెల్లెలు."

"అంటే" బావ కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది.

"ఆయన రేపోమాపో ఆవిడ్ని పెళ్ళిచేసుకోబోతున్నారు."

"రాజీ! నిజమా!"

"అవును బావా! ఇందులో ఆశ్చర్యపడాల్సిందేముంది? నేను రోగంతో మంచం ఎక్కి ఆయనకు ఎందుకూ పనికిరాకుండాపోయాను. ఆయన మాత్రం

## వైద్య విశేషాలు

పుట్టబోయే బిడ్డ మామూలుగా సజీవ శిశువుగానే పుడతాడా? లేక నిర్జీవ శిశువుగా పుడతాడా? అన్న విషయాన్నిముందుగానే తెలుసుకోడానికి బొంబాయిలోని నలుగురు వైద్య పరిశోధకుల బృందం - ఒక వైద్య విధానాన్ని కనుగొన్నారు. గర్భవతి అయిన స్త్రీ-ఉదయాన్నే విసర్జించే మూత్రాన్ని వైద్య పరీక్ష చేసినట్లయితే, అందులో 'ఈస్ట్రోజెన్'. 'క్రియేటినైన్' అనే పదార్థాలు వుంటాయట, ఈ రెండిటి నిష్పత్తి సమంగా వుండి, ఇవి క్రమక్రమంగా అధికమవుతున్న చిహ్నాలు కనిపిస్తే, గర్భంలోని పిండం సక్రమంగా పెరుగుతున్నట్లు, శిశువుకు ఎటువంటి అపాయమూ లేనట్లు తెలుసుకోవచ్చునని, ఆ వైద్య పరిశోధకుల బృందం వెల్లడి చేసింది!

*

'కలరా', 'డయోరియా' (విరోచనముల వ్యాధి) లను నిరోధించే మందును భారతీయ వైద్య శాస్త్రజ్ఞులు ఇటీవలే రూపొందించారు. 'కొరాసోల్' అనే ఈ మందును కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా ఉపయోగించడానికి అంగీకరించినట్లుగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌వారు తెలియజేశారు. మణిపూర్‌లో ఈ మధ్య కలరా వ్యాధి ఉధృతంగా సోకిన ప్రాంతాలలో 'కొరాసోల్' ఉపయోగించగా, అక్కడి మరణశాతం 20 నుంచి, 0.8 శాతానికి తగ్గినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌వారు ప్రకటించారు.

*

ఉబ్బసంతో బాధపడే వారికి కోడిపులుసు (చికెన్ సూప్) మంచి ఉపశమనం కలిగిస్తుందన్న విశేషాన్ని ఇటీవల జూయిష్ హిల్‌సైడ్ మెడికల్ సెంటర్ (యు. ఎస్. ఎ) వారు ప్రకటించారు. కోడిపులుసులోని ఒక విశేష పదార్థం – ఉబ్బసం తీవ్రతను తగ్గిస్తుందని వైద్య పరిశోధనలో వెల్లడైనట్లు వారు తెలియజేశారు. ఐతే, ఇది కొత్త వార్త కాదని, చాలాకాలం క్రితం - యమోయినేడెస్ అనే వైద్య శాస్త్రజ్ఞుడు వేడిగా వున్న కోడిపులుసు తీసుకోవడం వల్ల ఉబ్బసం వ్యాధి, నపుంసకత్వం, కుష్ఠు వంటి వ్యాధులు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నట్లు తెలియజేశారని, ఇటీవల జరిపిన పరిశోధనలవల్ల - కోడి పులుసు తక్కిన వ్యాధులకంటే ఉబ్బసం వ్యాధికి బాగా పనిచేస్తుందని రుజువైనట్లు-ఆ వైద్య పరిశోధకులు తమ ప్రకటనలో వివరించారు.

*

ఈ మధ్య జపాన్ వైద్య శాస్త్రజ్ఞులు కృత్రిమ రక్తాన్ని రూపొందించడం కనుగొని, వైద్య పరిశోధనలలో ఒక ఘన విజయాన్ని సాధించారు. గ్రుడ్లలోని పచ్చసొన, పిండి పదార్థం, పెర్‌ఫ్లూరో కెమికల్స్‌ను ఉపయోగించి, తయారు చేసిన ఈ కృత్రిమ రక్తానికి 'ఫ్లూసల్ డి ఎన్ ఎ' అని పేరు పెట్టడం జరిగింది. ఎలుకలపై ప్రయోగించి, ఆ తర్వాత ఎనీమియాతో బాధపడుతున్న రాబర్ట్ అండర్సన్ అనే రోగికి ఈ రక్తాన్ని ఎక్కించి చూడగా, ఫలితాలు సంతృప్తికరంగా కనిపించినట్లు జపాన్ వైద్యశాస్త్రజ్ఞులు వెల్లడించారు. ఈ కృత్రిమ రక్తాన్ని గ్రూపుల ప్రమేయం లేకుండా, ఎవరికైనా యివ్వవచ్చునట!

*

పొగ త్రాగడం వల్ల ఆరోగ్యానికి ఎన్నిరకాలుగా హాని జరుగుతుందో ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే వున్నాయి. వైద్యపరిశోధనల వల్ల తెలిసిన మరో కొత్త నిజం: పొగ త్రాగడం వల్ల క్రమక్రమంగా వినికిడి శక్తి కూడా నశిస్తుందని! ఏంగ్రాస్ విశ్వవిద్యాలయానికి చెందిన స్టీఫెన్ క్రెస్‌కోడ్ అనే వైద్యశాస్త్రజ్ఞుడు – పలు పరిశోధనలు జరిపి, ఈ కొత్త ప్రమాదాన్ని కనుగొన్నారు. రోజుకు కనీసం 20 సిగరెట్లు కాల్చేవారు కూడా ఈ ప్రమాదానికి గురికాక తప్పదట!

*

సాధారణంగా ఉడక బెట్టిన బంగాళా దుంపలు తినడం వల్ల దేహంలో కొవ్వు పదార్థం ఎక్కువ కావడానికి అవకాశం వుంటుందని అనుకుంటారు. కానీ అది సరికాదని, వేయించిన బంగాళా దుంపలు తినడం వల్ల, అవి వేగిన వంట నూనెల ద్వారా కొవ్వు పదార్థం చేరుతుందని, అంచేత ఉడక బెట్టిన బంగాళా దుంపలు తినడమే ఆరోగ్యానికి మంచిదని ఇటీవల ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్‌వారు నిర్వహించిన ఒక సదస్సులో ప్రముఖులు వెల్లడించారు. బంగాళా దుంపల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చర్చించడానికి ఏర్పాటు చేయబడిన సదస్సులో ఈ అంశం వెల్లడైంది!

మనిషి కాదా ! ఆయన సుఖం ఆయన చూసుకుంటున్నారు. ఇందులో తప్పేం వుంది !''

"రాజీ ! నువ్వేనా ఇలా మాట్లాడేది ?''

"................''

"మాట్లాడవేం రాజీ ! నీకు రోగం వచ్చినంత మాత్రాన ఇంకో పిల్లని వివాహం చేసుకోటమేనా ? అయినా భార్య వుండగా మళ్ళీ పెళ్లా ? పోలీసులకి రిపోర్టిచ్చి జైల్లో వేయిస్తాను''

"అదే జరిగితే నేను నా ఇష్టప్రకారమే చేసుకుంటున్నారని చెప్తాను.''

"రాజీ !''

"బావా ! నాకేదో పతివ్రతననిపించుకోవాలని యిలా అంటున్నాననుకోకు. ఇష్టంలేని వ్యక్తుల్ని ఎవరు మాత్రం కలిపి వుంచగ్గలరు. బావా! ఆయనకు సరోజంటే యిష్టం. రహస్యంగా సరోజతో సంబంధం ఏర్పరచుకునే బదులు బహిరంగంగానే పెళ్లి చేసుకోమంటున్నాను. ఇది తప్పా ?''

"రాజీ ! నీ మాటకి అర్థం లేదు. ఇలా ప్రతి వ్యక్తీ ప్రవర్తిస్తే ఇక వివాహబంధానికి అర్థం ఏముంటుంది ?''

"ఏమీలేదు బావా ! ప్రస్తుతం వున్న వివాహ బంధాలన్నీ మేడిపండులా వున్నాయి.''

బావ వెంటనే ఏం సమాధానం చెప్పలేదు. కొద్దిసేపయ్యాక అన్నాడు—

"రాజీ ! ఏదైనా నీ విషయంలో ఇలా జరగటం నేను భరించలేను.''

"కానీ నాకు బాగానే వుంది బావా ! కనీసం ఆయననన్నా సుఖపడనీ !''

"మరి నీ సంగతి !''

ఆ మాటలతో నేను వులిక్కిపడ్డాను. అవును వాళ్లిద్దరూ ఒకటైతే ఇక్కడ నా స్థితి ఏమిటి ?

గొంతు పట్టేసింది. దుఃఖంతో మాట రాలేదు.

"రాజీ ! నేను చెప్పనా !''

"వూ''

"నాతో వచ్చెయ్ ! నిన్ను నా కంటికి రెప్పలా చూసుకుంటాను.''

నేను తెల్లబోతూ - "బావా'' అన్నాను.

"అవును రాజీ ! ఇందులో తప్పేం వుంది; ఆయన సుఖం ఆయన చూసుకుంటున్నపుడు నీ సుఖం నువు చూసుకోవడంలో తప్పులేదుకదా!''

"కానీ బావా !''

"ఏమిటి రాజీ !''

**ఆవాలు మెత్తగా పొడిచేసి ఆ పొడితో తోమి కడిగినట్లయితే వెండి పాత్రలు నిగనిగలాడుతూ వుంటాయి. —లావణ్య**

నేను వెంటనే జవాబు చెప్పలేకపోయాను.

"రాజీ ! నీ సందేహం ఏమిటో నాకు తెలుసు. లోకం ఏదైనా అనుకుంటుందేమోనని నీ భయం. అతని విషయంలో ఈ సమాజం తప్పు పట్టనిది నీ విషయంలోనే ఎందుకు తప్పు పడుతుంది? ఒకవేళ ఎవరు ఏదన్నా అన్నా నువు పట్టించుకోకు. ఇప్పుడు నిన్ను వేలెత్తి చూపించిన సమాజమే కొన్నాళ్లకి వూరుకుంటుంది. ఇది నిజం. రాజీ ! జీవితంలో అవకాశాలు చాలా తక్కువ వస్తాయి. వాటినుపయోగించుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి.''

అవును. బావ చెప్పింది నిజమే! ఆయన సుఖం ఆయన చూసుకుంటున్నపుడు నేనెందుకు నా సుఖం చూసుకోకూడదూ !

నా జీవితంలోకి మళ్లీ అదృష్టం తొంగి చూస్తోంది. ఇదివరకు పిరికిదాన్నై వచ్చిన అవకాశాన్ని దూరం చేసుకున్నాను. అందుకు ఇంతవరకూ కుమిలిపోతూనే వున్నాను. ఇంక ఇప్పుడు ఈ అవకాశాన్ని వదులుకోలేను. బావతో వెడతాను. నా జీవితం ఆనందమయం చేసుకుంటాను. ఈ సంఘంతో నాకు పని లేదు. నన్ను లక్ష్యపెట్టని వాళ్ళని నేనెందుకు లక్ష్యపెట్టాలి ?

నా చుట్టూ వున్న ఈ జనం నా రోగాన్ని నయం చేయగలరా ? నాకు సంతోషాన్ని ఇవ్వగలరా ! ఆయన సరోజని చేసుకోకుండా ఆపగలరా !

ఊహూఁ ! ఇందులో ఏ ఒక్కటీ చెయ్యలేరు.

నాకు సుఖం కావాలి. ఆనందం కావాలి. నా ఆశలూ, నా కలలూ ఫలించాలి. బావతో వెళ్ళాలి.

బావ లేచి మెల్లగా నా కుర్చీ వెనక్కి వచ్చి రెండు చేతుల్తో నా మెడని చుట్టాడు. నా చెంపకి తన చెంపని ఆన్చాడు.

"రాజీ ! నా కోసం రావా !''

బావ మాటలు నా చెవిలో గుసగుసలాడుతున్నాయి.

ఆ మాటలు రక్తంలోకి వ్యాపించి ప్రతి అణువూ నా కోసం రావా ! రాజీ ! అంటోంది.

"వస్తాను ! బావా ! వస్తాను. నీ కోసం మాత్రమే కాదు. నా కోసం కూడా వస్తాను.''

బావ నా బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు.

నేను పురుషస్పర్శ ఎరగని కన్నెపిల్లలా పులకించాను.

నా శరీరం లయ తప్పుతోంది.

నేను భర్తతో కాపరం చేశాను. కానీ కేవలం ఒక మెత్తని స్పర్శతోనూ, ఒక చిన్న ముద్దుతోనూ ఇంతటి పరవశత్వాన్ని కలిగించగలగడం బావకే తెలుసు.

బావ చేతి మీద చెయ్యి వేశాను. అప్పుడు బావ నా చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

నా కళ్ళముందు ఆనాడు జోరున వర్షంలో పశువుల పాకను పడిపోకుండా పైకెత్తి పట్టిన బావ నిలిచాడు.

ఆ బావ ఈనాడు పడిపోతున్న నా జీవితాన్ని పైకెత్తుతున్నాడు.

బావ నీడలో వుంటే ఇంక నాకేం భయం లేదు!

క్షణాలు గడుస్తున్నాయి. చుట్టు నల్లని చీకటి. కానీ ఈ చీకటి కరుగుతుంది.

మళ్లీ తెల్లవారుతుంది ! రేపటి వెలుగుని చూడగలనా ! అని భయపడనక్కర్లేదు.

ఎంత చిత్రం ! ఈ ఉదయం కళ్ళు విప్పినప్పుడు ఈ రోజు నా జీవితంలో ఇంత పెద్ద మలుపు వస్తుందనుకోలేదు.

ఈ రోజుకింతటి ప్రాముఖ్యత వుంటుందనుకోలేదు.

ఈ రాత్రి ఇంత ఆనందం నా కోసం దాగి వుంటుందనుకోలేదు.

అనుకోనివి జరగడమే జీవితం ! అప్పుడే ఆశ్చర్యం ! ఇక నాకు దిగులులేదు. భయం లేదు.

నేను రేపు కళ్లు తెరిచి వుషోదయాన్ని తప్పకుండా చూస్తాను.

రేపే కాదు—

ఇంకా

ఇంకా

ఎన్నో

ఎన్నెన్నో

వుషోదయాల్ని ఆనందంగా చూస్తాను.

[సంపూర్తి]

639